

రష్యన్ శర్మ

అచ్చమైన భారతీయునికి అచ్చెరువొందించే పేరు

ఇంజనీరింగ్ ఆచార్యునిగా అద్భుత ప్రతిభ

ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్

ఓలేటి బంగారేశ్వర శర్మ ఘనత ఇది

జర్నీ JOURNEY

2

ఆంధ్రజ్యోతి విశాఖపట్నం



రుక్మిణి ఎలియాస్ రూప (ఫైల్)



పతివాడ హరిసంతోష్

ప్రేమోన్మాదం

ప్రేమను తిరస్కరించిందని ఉన్మాదిలా మారిన యువకుడు

ఇంట్లో టీవీ చూస్తున్న యువతిపై కిరోసిన్ పోసి సజీవదహనం

అక్కను రక్షించే యత్నంలో తమ్ముడు కూడా మృతి..

విజయనగరంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఉన్మాది

ప్రేమోన్మాదంతో ఒక యువకుడు రెచ్చిపోయాడు. తన ప్రేమను కాదన్నదని ఆగ్రహంతో ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించాడు. అనంతరం తాను కూడా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అక్కను రక్షించబోయి తమ్ముడు కూడా మృతి చెందాడు. రెండు కుటుంబాల్లో తీవ్రవిషాదం నింపిన ఈ సంఘటన భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని టి.నగరపాలెంలో శనివారం చోటుచేసుకుంది.

-వార్త మెయిన్ ఎడిషన్‌లో..

వర్షంతో వరికి ఊపిరి

మాకవరపాలెంలో వరినాట్లు వేస్తున్న వ్యవసాయాధికారి హేమ



- ఊపందుకున్న వరినాట్లు
- రైతులకు సలహాలిస్తున్న వ్యవసాయాధికారులు
- దూరంగా నాటితే మేలని సూచన

నక్కపల్లి/మాకవరపాలెం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు వరి పంటకు ఊపిరి పోశాయి. ఖరీఫ్ వరి నారుమడులు, నాట్లు దెబ్బతింటున్న తరుణంలో కురుస్తున్న వర్షాలు ..మిగతా 6వ పేజీలో..

సెల్‌తో హెల్ వైపు!



సాంకేతిక పరిజ్ఞానం దుర్వినియోగం

బానిసలుగా మారుతున్న కొంతమంది యువతీయువకులు

అభివృద్ధి పథమా..అధోగతి మార్గమా

సోషల్ నెట్‌వర్క్‌లకు ఎడిక్ట్ అవుతున్న ఈ-తరం

వీడియో గేమ్స్ ప్రభావంతో చితికిపోతున్న బాల్యం

ఇలాగే కొనసాగితే పెనుముప్పే అంటున్న నిపుణులు

సెల్ ఫోన్...ప్రపంచాన్ని దగ్గర చేసింది. మనుషుల మధ్య దూరాన్ని పెంచింది. 'మంచికి' మార్గం వేసింది. 'చెడుకు' దారులు చూపింది. కోటాను కోట్ల ప్రయోజనాలు...అనంత కోటి దుష్పరిణామాలు. ఎందుకిలా...తప్పెక్కడ జరుగుతోంది? బాధ్యులెవరు? 'ఎంతటి సాంకేతిక పరిజ్ఞానమైనా దాని రిమోట్ కంట్రోల్ మనిషి చేతిలోనే' అంటాడో శాస్త్రవేత్త. ఇది అక్షర సత్యం. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఏదైనా వినియోగించే మనిషిపైనే దాని ఫలితం ఆధారపడి ఉంది. స్మార్ట్ ఫోన్ల ప్రస్తుత ప్రపంచంలో యువత దారి తప్పడానికి దాన్ని వినియోగించడంలో తేడానే కారణం అంటున్నారు నిపుణులు. సెల్‌ఫోన్‌కు బానిసైన ఈ-తరం చేజేతులా భవిష్యత్తును పణంగా పెడుతోంది. -సెంటర్‌స్ప్రెడ్‌లో..

చోడవరంలో రెండు స్టేడియాలు

ఓపెన్, ఇండోర్ స్టేడియాల నిర్మాణం

రూ.5.38 కోట్లు మంజూరు

స్థలాల సమస్య పరిష్కారం

క్రీడాకారులకు పండగ

త్వరలోనే పనులు ప్రారంభమంటున్న ఎమ్మెల్యే రాజు

3



చోడవరం చీడికాడ రోడ్డులో స్టేడియం నిర్మాణం కోసం అధికారులు ఎంపిక చేసిన స్థలం ఇదే

ఏసీబీ వలలో గురుకుల ప్రిన్సిపాల్



ఏసీబీకి పట్టుబడిన ప్రిన్సిపాల్ సాల్మన్‌రాజు



పట్టుకున్న నగదు

- గెస్ట్ టీచర్ నుంచి లంచం డిమాండ్
- నెలకు రూ.4 వేలు ఇచ్చేందుకు ప్రిన్సిపాల్‌తో గెస్ట్ టీచర్ ఒప్పందం
- ఏసీబీని ఆశ్రయించిన టీచర్
- రూ.8 వేలు తీసుకుంటుండగా పట్టుబడిన ప్రిన్సిపాల్

అచ్యుతాపురం బాలికల గురుకుల సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ డి.సాల్మన్‌రాజు శనివారం ఏసీబీ వలలో చిక్కుకున్నాడు. ఈయన తమ పాఠశాలలో పనిచేస్తున్న గెస్ట్ టీచర్ అరుణ నుంచి ఎనిమిది వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుపడ్డాడు.

-వార్త 6వ పేజీలో..

ఆది నుంచి ఆరోపణలు

అచ్యుతాపురం గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్‌పై అభియోగాలెన్నో..

తప్పుడు ధ్రువీకరణ పత్రంతో పదోన్నతి

రెండు నెలల క్రితం వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'

కొనసాగుతున్న విచారణ

ఈలోగానే లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

6



విహారంలో విషాదం




యారాడ బీచ్‌లో తండ్రి, కొడుకు మృతి- మెయిన్‌లో..



లంబసింగి ఘాట్‌లో ట్రాఫిక్ జామ్ 7

రష్యన్ శర్మ



అచ్చమైన భారతీయునికి అచ్చెరువొందించే పేరు

- ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భాషా కోర్సు కారణం
- రష్యన్ ట్యూటర్లకు అన్నీ తానై వ్యవహరించిన గుర్తింపు
- సివిల్ ఇంజనీర్‌గా పలు ఉత్తమ డిజైన్లు
- సాగర్ కుడి కాలువ పనుల్లో భాగస్వామ్యం
- బీచ్ రోడ్డు డిజైన్ రూపొందించింది ఆయనే
- బీచ్ రోడ్డు కోసం సర్వే ఓ తీపిగురుతు
- కలెక్టర్‌తో కాలినడకన భీమిలి వరకు
- ఈ రోజు ఆ రోడ్డు చూస్తే గర్వంగా అనిపిస్తుంది
- సివిల్ ఇంజనీరింగ్‌పై తెలుగులో పుస్తకం

జర్నీ

ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఓలేటి బంగారేశ్వర శర్మ ఘనత ఇది

వ్యక్తిలోని ప్రతిభాపాటవాలే గుర్తింపు తెస్తాయి. వృత్తి రీత్యా ఆయన సివిల్ ఇంజనీర్. అచ్చమైన భారతీయుడు. ఆరణాల తెలుగు బిడ్డ. కానీ అంతా రష్యన్ శర్మ అని పిలుస్తారు. వర్సిటీ టెలిఫోన్ డైరెక్టరీలో కూడా ఇదే పేరు ముద్రితమై ఉంది. చారిత్రక ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా వర్సిటీలో రష్యన్ కోర్సు కొనసాగుతున్న రోజుల్లో ఆ దేశ ట్యూటర్లకు అన్నీ తానై వ్యవహరించడం వల్లే దక్కిన గుర్తింపు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఓలేటి బంగారేశ్వర శర్మ ఘనత ఇది. 'పరిశోధనల కోసం రష్యా వెళ్లాను. ఆరు నెలలు రష్యన్ భాషలోనే శిక్షణ ఇచ్చారు. ఆ భాషలో పట్టు సాధించి ఏయూకు వచ్చాక ఇక్కడి కోర్సుకు కేరాఫ్ అడ్రస్‌గా మారడంతో రష్యన్ శర్మగా పేరు స్థిరపడిపోయింది' అంటున్న బంగారేశ్వర శర్మ జీవితంలోని కొన్ని సంఘటనల సమాహారమే ఈ వారం 'జర్నీ'.

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

విశాఖ నగరానికి అలంకార తోరణం బీచ్ రోడ్డు. నగర అందాలను రెట్టింపు చేస్తుంది ఈ రోడ్డు. స్మార్ట్ సిటీలోని పలు హోటళ్లు, ఐటీ కంపెనీలు, రిసార్ట్సులు ఉన్నది బీచ్ రోడ్డులోనే. అంతటి ప్రాధాన్యం ఉన్న బీచ్ రోడ్డు డిజైన్ ఖరారు చేసిన వ్యక్తి మన ఏయూ ప్రొఫెసర్ అంటే నమ్మగలరా. కానీ ఇది నిజం. ప్రపంచంలోని అందమైన బీచ్ వ్యూ ఉన్న రహదారుల్లో ఒకటైన విశాఖ-భీమిలి బీచ్ రోడ్డు సర్వే, డిజైన్ రూపొందించిన వ్యక్తి ఓలేటి బంగారేశ్వర శర్మ. ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యునిగా ఉన్న సమయంలో ప్రభుత్వం అప్పగించిన ఈ బాధ్యతను చిత్తశుద్ధితో పూర్తిచేసిన ఆయన ఇప్పుడా రోడ్డును చూసి ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తుంటారు. పరిశోధనల కోసం ఇంజనీర్ ఉద్యోగం వదిలి ఏయూలో చేరినందుకు మంచి గుర్తింపే లభించిందని ఆనందం వ్యక్తం చేసిన శర్మ తనను పలకరించిన 'ఆంధ్రజ్యోతి' వద్ద అంతరంగాన్ని ఆవిష్కరించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చేరా

కుడికాల్వ రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి మూడు ప్రతిపాదనలు తయారుచేసి అధికారులకు అప్పగించిన తర్వాత 1958లో ఉద్యోగానికి రాజీనామా చేశాను. అప్పటికి మూడేళ్ల ముందే ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభమైంది. కాకినాడ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేసే మా గురువు కృష్ణమాచార్యులిని తీసుకువచ్చారు. ఆయనకు లేఖ రాస్తే రమ్మని జవాబిచ్చారు. వెంటనే వచ్చి ఏయూలో చేరాను. అప్పటికి ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. 120 మంది విద్యార్థులకు క్లాస్ చెప్పేవాడిని. విచిత్రం ఏమిటంటే అప్పట్లో నేను బోధించిన విద్యార్థుల్లో కొద్దిమందివి తప్ప అందరి పేర్లు ఇప్పటికీ గుర్తే. స్టాఫ్ తక్కువగా ఉండడంతో రోజుకు 20 గంటల వరకు పనిచేసే వాడిని. ఏడాది తరువాత లెక్చరర్‌గా పదోన్నతి కల్పించారు.



గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు ప్రతిపాదించా

ఇంజనీరింగ్ పట్టభద్రుడిగా సర్టిఫికెట్ చేతికి రాక ముందే నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో జూనియర్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరాను. ఫలితాలు రాకపోయినా ఉద్యోగం ఇచ్చారు. అప్పట్లో ఇంజనీరింగ్ పాసైతే రూ.150 లేదంటే రూ.125 వేతనం. 1956లో తొలుత నర్సారావుపేటలో విధుల్లో చేరాను. అనంతరం వినుకొండకు బదిలీ చేశారు. సాగర్ కుడికాలువను తొలుత ప్రకాశం జిల్లా వరకు నిర్మించారు. అనంతరం నెల్లూరు వరకు పొడిగించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రారంభ దశలో కాల్వను ఎలా తీసుకువెళ్లాలి అనే దానిపై ఎలైన్‌మెంట్ సర్వేచేసే బాధ్యత అప్పగించారు. నకిరేకల్ గోర్జి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ప్రతిపాదించాను. గుండ్లకమ్మ నదిపై జలాశయ నిర్మాణం డిజైన్ చేశారు. అదే సమయంలో ఇంజనీరింగ్ నిపుణుడు కె.ఎల్.రావు కాల్వడిజైన్ పనులు చూసేందుకు వచ్చారు. కాంక్రీట్, మట్టి ఇంజనీరింగ్‌లో ఆయన నిపుణుడు. క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చిన ఆయన ముందు నేను రూపొందించిన ప్రతిపాదనలు ఇంజనీర్లు ఉంచారు. అప్పుడనిపించింది రావుగారిలా నేనెందుకు రీసెర్చి చేయకూడదని.

పిఠాపురం దరి గొరస మా సొంతూరు

తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం సమీపంలోని గొరస మా స్వగ్రామం. నాన్న ఓలేటి సుబ్బరాయశాస్త్రి కాకినాడలో టీచర్. అమ్మ వెంకటరమణమ్మ. ఏడుగురి సంతానంలో నేనే పెద్దవాడిని. నాకు పాఠశాల వయసు వచ్చేసరికి రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. తీరప్రాంతం కావడంతో కాకినాడపై బాంబులు పడేవి. దీంతో ఐదో తరగతి వరకు అమ్మ వద్దే సాగింది. ప్రవేశపరీక్ష రాసి ఆరో తరగతికి కాకినాడ మెక్లరిన్ హైస్కూల్లో చేర్పించారు. ఎస్ఎస్ఎల్‌సీలో 192 మంది విద్యార్థుల్లో ప్రథముడిగా నిలిచా. ఇంటర్ పీఆర్ కళాశాలలోను, కాకినాడ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ డిగ్రీ చేశాను.

పరిశోధనల కోసం రష్యా వెళ్లా

ఇండో సోవియట్ టెక్నికల్ కో ఆపరేషన్ పథకంలో భాగంగా 1963లో పరిశోధనలకు రష్యా వెళ్లాను. సివిల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి దేశం నుంచి ఇద్దరు ఎంపికైతే అందులో నేనొకడిని. మరో వ్యక్తి ఖరగ్‌పూర్ యూనివర్సిటీ నుంచి ఎంపికయ్యారు. తొలుత ఆరు నెలలు రష్యాభాష నేర్చుకో మన్నారు. నాలుగేళ్లు అక్కడే ఉంటూ నికోలిన్ అలెగ్జాండ్రియా అనే ఆచార్యుని వద్ద పరిశోధనలు చేసి డాక్టరేట్ తీసుకున్నా.




రష్యన్ శర్మగా పేరు

అప్పట్లో భారత్-రష్యా సంబంధాలు పటిష్ఠంగా ఉండేవి. డెబ్బయ్యవ దశకంలో ఏయూలో రష్యన్ కోర్సు ప్రారంభించారు. రష్యన్ భాష బోధనకు సోవియట్ యూనియన్ నుంచి అధ్యాపకులు వచ్చేవారు. ఆ సందర్భంలో ఇక్కడి వారితో మాట్లాడడం నుంచి ప్రతీదీ నాకే అప్పగించే వారు. విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటు సందర్భంగా రష్యన్ నిపుణులు వచ్చినప్పుడు వారికి ఆప్తుడిని నేనే. ఇండో-సోవియట్ కల్చరల్ సొసైటీ విశాఖ కార్యదర్శిగా పనిచేశా. దీంతో వర్సిటీలో రష్యన్ శర్మగా పేరు సార్థకమైంది. చివరకు వర్సిటీ టెలిఫోన్ డైరెక్టరీలో కూడా రష్యన్ శర్మగానే ముద్రించారు. ఒకసారి విమానాశ్రయంలో విమానం హైజాక్ మాక్ డ్రిల్ జరిగింది. ఆ డ్రిల్ సందర్భంగా రష్యన్ భాషలో మాట్లాడే బాధ్యతలు కూడా నాకే అప్పగించారు. 1995లో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేసినా 2006 వరకు రష్యన్ భాష బోధించాను. ఆ తరువాత కోర్సు మూత పడింది.

బీచ్ రోడ్డుకు డిజైన్

సాగర తీరాన వన్‌టౌన్ ప్రాంతం నుంచి వుడా పార్క్ వరకు కచ్చా రోడ్డు ఉండేది. బీచ్ రోడ్డును విస్తరించాలని అప్పటి కలెక్టర్ అబిద్‌హుస్సేన్ నిర్ణయించారు. ఇందుకోసం అప్పటి ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కృష్ణమాచార్యులిని సంప్రదించారు. ఆయన ఎలైన్‌మెంట్ బాధ్యత నాకు అప్పగించారు. దీంతో రోజూ ఉదయాన్నే 45 మంది విద్యార్థులతో వెళ్లి సర్వే చేసేవాడిని. ఇలా ఒక వారం రోజులపాటు సర్వే చేశాక డిజైన్ ఖరారు చేసి ఇచ్చాం. రామకృష్ణ బీచ్‌ని ఆనుకుని స్కాండిల్ పాయింట్ వద్ద పెద్ద గెడ్డ పారుతుండేది. దానిపై వంతెన నిర్మించాలని ప్రతిపాదించాం. అలా తొలి దశ రోడ్డు పూర్తయింది.



పదేళ్ల తరువాత రెండో దశ

కరువు నిధులతో కూలీలకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ఆదేశించడంతో 1968లో కలెక్టర్ పి.ఎల్.శివరావ్‌కు బీచ్ రోడ్డును పొడిగించాలన్న ఆలోచన వచ్చింది. వెంటనే సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిని ఆహ్వానించగా ఆయనతో నేను కూడా వెళ్లాను. ఒకరోజు తెల్లవారు జామున కలెక్టర్ బంగ్లా నుంచి శాంతి ఆశ్రమం వరకు వెళ్లి అక్కడ నుంచి రోడ్డు ఏర్పాటు పరిశీలనకు బయలుదేరాం. కలెక్టర్, నేను, మరికొందరు సిబ్బంది తీరం వెంబడి నడుచుకుంటూ భీమిలి చేరుకునే సరికి మధ్యాహ్నం రెండు గంటలైంది. మధ్యలో అనేక గ్రామాల ప్రజలు వచ్చి తమ గ్రామాల మధ్య నుంచి రోడ్డు వేయాలని కోరడం నాకు ఇప్పటికీ గుర్తుంది. అయితే బీచ్ రోడ్డు అని భావించడంతో వీలైనంత వరకు తీరం వెంబడే ఉండేలా డిజైన్ చేశాం. దీనికోసం కూడా సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులను రెండు వారాలపాటు క్షేత్రస్థాయి సర్వేకు తీసుకువెళ్లి అనంతరం డిజైన్ ఖరారు చేశాం. కైలాసగిరి, సీతకొండ వద్ద రోడ్డు ఎలైన్‌మెంట్ విషయంలో చాలా శ్రమపడ్డాం. మధ్యలో అనేక గెడ్డలు ప్రవహించడంతో వంతెనల నిర్మాణంపై ప్రతిపాదించాం. కైలాసగిరి వద్ద రోడ్డు నిర్మాణ సమయంలో అప్పటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి వచ్చి పరిశీలించారు. శాంతి ఆశ్రమం నుంచి భీమిలి వరకు సర్వేకు రూ.1400 తీసుకున్నాం. ఈ డబ్బులన్నీ విద్యార్థుల టిఫిన్లకే సరిపోయాయి. బీచ్ రోడ్డు సర్వే సమయంలో ఎన్నో విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఊర్లో పూర్ణామార్కెట్‌కు రోడ్డు లేదుగాని బీచ్ రోడ్డు కావాలా? అంటూ పలువురు ఎగతాళి చేసేవారు. అన్ని విమర్శలు పక్కనపెట్టి ప్రభుత్వం రోడ్డు నిర్మాణం పూర్తిచేసింది. నిర్మాణ సమయంలో అధికారులకు సూచనలు చేసేవాడిని. ఈ రోజు బీచ్ రోడ్డుకు ఇంత పేరు వచ్చిందంటే ఆ ఘనత ఖచ్చితంగా ఏయూ విద్యార్థులదే.

కుటుంబం

భార్య భారతీదేవి. ఏయూలో ఎకనామిక్స్‌లో పీజీ చేశారు. బాబు వి.ఎన్.సుబ్రహ్మణ్యం కర్ణాటక రాష్ట్రం మణిపాల్‌లోని ఫార్మసీ కళాశాలలో ఆచార్యుడు. పాప మహాలక్ష్మి ఢిల్లీలో ఉంటున్నారు.

సివిల్ ఇంజనీరింగ్‌పై తెలుగులో పుస్తకం

రష్యాలో ఉన్నప్పుడు ఒక ఆలోచన వచ్చింది. సైన్స్, ఇంజనీరింగ్ మెడిసిన్...ఇలా ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన పుస్తకం చైనా, రష్యన్ తదితర భాషల్లో లభ్యమయ్యేవి. మనం మాత్రం ఆంగ్లంలో పుస్తకాలు చదవాలి. అటువంటప్పుడు తెలుగులో ఎందుకు పుస్తకాలు రాయకూడదని భావించి ప్రయత్నం చేశా. సొంతంగా నిఘంటువు రూపొందించి సాయిల్ మెకానికల్ ఇంజనీరింగ్ సైన్స్‌ను తెలుగులో 'మృత్తిక యాంత్రిక శాస్త్రం' పేరుతో పుస్తకం రాశా. చాలా పోరాటం తర్వాత తెలుగు అకాడమీ దీన్ని ముద్రించింది. తరువాత మరికొన్ని సబ్జెక్టులను తెలుగులో రాసినా ప్రోత్సాహం లేక నావద్దే ఉండిపోయాయి. రష్యన్ భాషలో ఉన్న చైనా సూక్తులను తెలుగులోకి అనువదించాను. 'బంగారు సీత చరితం'తోపాటు పలు ఖండ కావ్యాలు రాశాను.

పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదనలు

ఎం.ఆర్.అప్పారావు ఉపకులపతిగా పనిచేసినప్పుడు పోలవరం ప్రాజెక్టుపై సవివరంగా ప్రతిపాదనలు రూపొందించి అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుకు అందజేశాం. దీనిపై అనేక మంది నిపుణులతో కలిసి చర్చలు జరిపాం. తూర్పు గోదావరి జిల్లా పాశర్లపూడి బ్లో అవుట్, దాని పర్యవసానాలపై అధ్యయనం చేసి పలు సిఫారసులు చేశాం. దీని ఫలితంగానే ఏయూకు డెల్టా స్టడీస్ సెంటర్ వచ్చింది. ప్రస్తుతం జర్మన్, ఫ్రెంచి భాషల్లో అధ్యయనం చేయాలని నాకున్న పరిజ్ఞానంతో ప్రయత్నిస్తున్నాను. వర్సిటీలో పనిచేసినప్పుడు సంస్కృతంలో డిప్లొమా చేశాను.

చోడవరంలో రెండు స్టేడియాలు

చోడవరం: చోడవరంలో క్రీడాకారులకు బంపర్ ఆఫర్ తగలనుంది. ఇంతకాలం ఆటలకు సరైన వసతులు, మైదానం లేక క్రీడాకారులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు చోడవరంలో రెండు స్టేడియాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5.38 కోట్లు విడుదల చేసింది. వీటి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. చోడవరం, మాడుగుల మండలాల్లో జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారులు ఉన్నారు. బాల్ బ్యాడ్మింటన్, షటిల్, వాలీబాల్, తైక్వాండో, కరాటే, అథ్లెటిక్స్ ఉన్నారు. వీరు ప్రాక్టీసు చేసేందుకు అనువైన మైదానం ఇంతవరకు లేదు. దీంతో ఎంత ప్రతిభ ఉన్నా మరుగున పడుతున్నది. చోడవరంలో ప్రభుత్వ హైస్కూల్ మైదానం ఉన్నప్పటికీ ఇది కూడా క్రీడలకు ఏమాత్రం అనువుగా లేదు. ఇక, నడక పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటిన క్రీడాకారులు ఇక్కడ ఉన్నా, వారికి వాకింగ్ ట్రాక్ కూడా లేదు. అరకొర వసతులతోనే ఇక్కడ క్రీడాకారులు సరిపెట్టుకుంటున్నారు. ఇంతకాలానికి చోడవరం ప్రాంత క్రీడాకారులకు మంచి రోజులు వచ్చాయి. ఒకేసారి రెండు స్టేడియాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో క్రీడాకారులు సంబరపడుతున్నారు.



ఇండోర్ స్టేడియం నిర్మించనున్న పోలీసుశాఖ స్థలం ఇదే

రూ.2 కోట్లతో ఓపెన్ స్టేడియం

స్పోర్ట్సు అథారిటీ ఆధ్వర్యంలో రూ.రెండు కోట్లతో ఓపెన్ స్టేడియం నిర్మించనున్నారు. ఇందులో సాధారణ క్రీడలతో పాటు, వాకింగ్ రన్నింగ్ జాగింగ్ చేసేవారి కోసం ప్రత్యేకంగా ట్రాక్ నిర్మించనున్నారు. ఇందులో క్రీడాకారులకు వసతి కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ స్టేడియం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని చోడవరం చీడికాడ రోడ్డులోని బిఈడీ కళాశాల సమీపంలో 9 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు సిద్ధంచేశారు.

రూ.3.38 కోట్లతో ఇండోర్ స్టేడియం

పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మరో రూ.3.38 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ స్టేడియం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ఎకరం స్థలంలో నిర్మించనున్నారు. ఈ ఇండోర్ స్టేడియంలో 8 షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులతోపాటు, జిమ్ క్రీడాకారులకు వసతి ఏర్పాటుకానున్నాయి. దిగువన పార్కింగ్ సౌకర్యంతోపాటు, కల్యాణ మండపం నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ స్టేడియం నిర్మించనున్న స్థలం పోలీసుశాఖ ఆధీనంలో ఉంది. దీంతో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అభ్యర్థన మేరకు పోలీసు అధికారులు ఆ స్థలాన్ని ఇవ్వడానికి అంగీకరించారు. అయితే ప్రత్యామ్నాయ స్థలం ఇవ్వాలని పోలీస్ శాఖ కోరడంతో అంబేరుపురంలోగానీ, వెంకన్నపాలెంలో గానీ కేటాయించేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధంగా ఉన్నారు. రెండు రోజుల క్రితం పోలీస్ అధికారులు ఈ స్థలాలను పరిశీలించి వెళ్లారు. ప్రత్యామ్నాయ స్థలానికి పోలీస్ అధికారులు అంగీకరించిన తర్వాత స్టేడియం పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు.

త్వరలో స్టేడియాల నిర్మాణ పనులు

కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్యే, చోడవరం

చోడవరంలో రెండు స్టేడియాల నిర్మాణం పనులు ప్రారంభానికి ఆటంకాలు తొలగిపోయాయి. రెండు స్టేడియాలకు అవసరమైన స్థల సేకరణలో ఉన్న సమస్యలు పరిష్కారమయ్యాయి. చీడికాడ రోడ్డులో స్టేడియం నిర్మాణానికి సేకరించిన స్థలంలో నిర్వాసితులకు నష్ట పరిహారానికి ప్రభుత్వానికి నివేదించాం. ఈ పరిహారం వారం రోజుల్లో రానుంది. ఆ స్థలంలో నిర్వాసితులకు పరిహారం ఇచ్చి వెంటనే ఓపెన్ స్టేడియం పనులు ప్రారంభించనున్నాం. అలాగే ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థలం ఇచ్చేందుకు పోలీస్ శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రత్యామ్నాయ స్థలాన్ని పోలీస్అధికారులు పరిశీలించి వెళ్లారు. ఈ స్టేడియం నిర్మాణం కూడా సెప్టెంబర్‌లో ప్రారంభం కానుంది.

చాలా ఆనందంగా ఉంది...

పల్లం మురళీకృష్ణ, తైక్వాండో క్రీడాకారుడు. చోడవరం

చోడవరంలో క్రీడలకు సరైన వేదిక లేదు. జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారులు, ఇతర క్రీడల్లో రాణిస్తున్న చాలా మంది క్రీడాకారులు ఇక్కడ ఉన్నారు. అయినప్పటికీ మౌలిక వసతులు లేవు. ఇంతకాలానికి చోడవరంలో ఒకేసారి రెండు స్టేడియాలు నిర్మాణం ప్రారంభం కానుండడం చాలా ఆనందంగా ఉంది. ఇది క్రీడాకారులకు ఆనందం కలిగించే అంశం. ఈ రెండు స్టేడియాలు పూర్తయితే ఈ ప్రాంతం నుంచి ఎంతోమంది క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



పాకశాలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి అశోక్‌గజపతిరాజు

సింహగిరిపై పాకశాల రెండో భవనం ప్రారంభం

సింహాచలం : అప్పన్న ఆలయ ప్రాంగణంలో రూ.3.5 కోటతో నిర్మించిన పాకశాల రెండో భవనాన్ని దేవస్థానం అనువంశిక ధర్మకర్త, కేంద్ర మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింహగిరిపై 300 గదులు ఉండే కాటేజీ నిర్మాణం, మెట్లమార్గ విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించామని, దీనికి దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతులు మంజూరు చేశారని తెలిపారు. సింహగిరిపై పరిశుభ్రతపై మరింత దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. ఘాట్ రోడ్డులో పరిశుభ్రత బాగుందని, మెట్ల మార్గంలో పరిశుభ్రత పెంపునకు కృషిచేయాలని ఆయన ఆలయ అధికారు లను ఆదేశిం చారు. జిల్లా వ్యాప్తంగా వంద కల్యాణ మండపాలను దాతల సహకా రంతో నిర్మించాలన్న ఆలోచన ఉందన్నారు. అన్నితరగతుల వారికి అందుబాటులో ఉండే విధం గా కల్యాణ మండపాలు నిర్మించాలన్నారు. ఆయన కుమార్తె అధితిగజపతి రాజుతో కలిసి ఆలయానికి విచ్చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మరణాలు లేని జిల్లాను ఆవిష్కరిద్దాం

జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం కారణంగా ఒక్క మరణం కూడా జరగని జిల్లాను ఆవిష్కరించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ కోరారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై నగర పోలీస్ కమిషనర్ యోగానంద్ అధ్యక్షతన నగర ట్రాఫిక్ సలహా సంఘం సమావేశం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, వాహనాల సంఖ్య రోజురోజుకి పెరుగుతుండడం, వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వంటి కారణాల వల్ల రోడ్డు ప్రమాదం జరగడం, మరణాలు సంభవించడం సాధారణంగా మారిపోయిందన్నారు. వీటికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అన్ని శాఖల అధికారులు, స్టేక్‌హోల్డర్లతో ప్రతి నెలా సలహా సంఘం సమావేశం నిర్వహిస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. ప్రమాదాల నియంత్రణకు కేసులు రాయడమే కాకుండా ముందుగా మౌలిక సదుపాయాలు కల్పించడం, నిబంధనలు, ప్రమాదాల పట్ల ప్రజలు, విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించడం ముఖ్యమన్నారు. సీపీ యోగానంద్ మాట్లాడుతూ, నగరంలో సంవత్సరానికి 90 వేల కొత్త వాహనాలు వస్తున్నాయని, దీనికి తోడు సెల్లార్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, కూడళ్లను మూసేయడం ప్రమాదాలకు కారణంగా మారుతుందన్నారు. వుడా వీసీ బసంత్‌కుమార్ మాట్లాడుతూ, నిబంధనల పేరుతో కేసులు నమోదు చేయడం కంటే వాహనచోదకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జీవీఎంసీ కమిషనర్ హరి నారాయణన్ మాట్లాడుతూ, జీవీఎంసీ పరంగా ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సిగ్నల్స్‌ను ఆధునికీకరించడంతోపాటు రోడ్ల విస్తరణ చేస్తున్నామన్నారు. డీటీసీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిబంధనలు పాటించని డ్రైవర్లతోపాటు వాహనాల యజమానులపై కూడా కేసులు నమోదుచేస్తున్నామన్నారు. మైనర్ డ్రైవింగ్, ఫిట్‌నెస్ లేని వాహనాలను రోడ్లపై తిప్పినా డ్రైవర్లతోపాటు యజమానులను కోర్టులో హాజరు ఎరుస్తున్నామని చెప్పారు.



పింఛను అందక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న లబ్ధిదారులు(ఫైల్)



పింఛను అందక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో వేచి ఉన్న వృద్ధులు(ఫైల్)

పింఛన్..టెన్షన్

- ట్యాబ్‌లో వేలిముద్రలు సరిపోక లబ్ధిదారుల ఇబ్బందులు
- పాతపద్ధతిలో పింఛను అందించాలని వృద్ధులు, ప్రజాసంఘాల డిమాండ్

అరకులోయ: ప్రభుత్వం ప్రతి నెలా అందించే పింఛను సక్రమంగా అందక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ముందు నెల ట్యాబ్‌లో వేసిన వేలిముద్రలు సరిపోగా అదే ట్యాబ్‌లో మరో నెల వేలిముద్రలు వేయగా మ్యాచ్ కాకపోవడంతో పింఛను పొందలేకపోతున్నామని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రతి నెలా మండలంలో 480 నుంచి 500 మందికి వేలిముద్రలు పడక పింఛను పొందలేకపోతున్నారు. ఈనెల నేటివరకు 488 మంది పింఛను పొందలేకపోయారు. ఇలా ప్రతి నెలా వేలి ముద్రలు మ్యాచ్‌కాక పింఛను పొందలేక వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వరకు వేలిముద్ర సమస్య వస్తే వారి సంబంధిత పంచాయతీ కార్యదర్శి తన వేలిముద్ర వేసి పింఛను ఇచ్చే అవకాశం ఉండేది. ఇలా చేసిన కార్యదర్శులందరికీ డీఆర్‌డీఏ నుంచి రికవరీ నోటీసులు అందడంతో ఇక వేలిముద్రలు మ్యాచ్ అయితేనే కార్యదర్శులు పింఛను పంపిణీ చేస్తున్నారు. ఈనెల 488 మంది పింఛనుదారులకు వేలిముద్రలు మ్యాచ్ కాలేదు. దీంతో వారందరికీ పింఛను ఇచ్చే అవకాశం లేకుండాపోయింది. వారంతా సంతరోజైన శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ముందు కూర్చొని నిరీక్షించడం కనిపిస్తోంది. సాయంత్రం వరకు ఉండి నిరాశతో ఇళ్లకు వెనుదిరుగుతున్నారు.

ఒక్కోసారి గిరిజన సంఘం నాయకులు కలుగజేసుకుని కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేస్తూ సంబంధిత అధికారులకు సమస్య పరిష్క రించాలని ఓ వినతి పత్రం సమర్పించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. పాత పద్ధతిలో గ్రామ పెద్దలు, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్దే పింఛను పంపిణీ చేయాలనే డిమాండ్ అధికశాతం మంది పింఛను దారుల నుంచి, ప్రజా సంఘాల నుంచి వినిపిస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి డీఆర్‌డీఏ అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పాత పద్ధతితోనే పింఛను పంపిణీ చేయాలి

సొంటారి అద్దునాయుడు, ఆర్‌కేనగర్



పాత పద్ధతిలోనే పింఛను పంపిణీ చేయాలి. నూతన విధానంతో అర్హులైన వారు ప్రతి నెలా పింఛను పొందే వారు సైతం ఒక్కో నెలలో వేలిముద్రలు సరిపడక పింఛను పొందలేని పరిస్థితి నెలకొంది. గత నెల వేలిముద్ర ట్యాబ్‌లో పడింది. ఈనెల పడలేదు. వేలిముద్ర పడకపోతే కార్యదర్శి పింఛను సొమ్ము అందించడం లేదు.

ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం

కొర్రా బుద్రి , చొంపి పంచాయతీ



ప్రతి నెలా ఒకటో తేదీ వస్తే ఆనందంగా ఉండేది. కానీ ప్రస్తుతం ఒకటో తేదీ నుంచి పింఛను అందే వరకు టెన్షన్ మొదలవుతోంది. వేలిముద్రలు సరిపోతాయా? లేదా, పింఛను అందుతుందా లేదా అని ఆలోచించాల్సి వస్తోంది. వేలిముద్రలు పడకపోతే మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది.

రెవెన్యూ సేవలు వేగవంతం

డిప్యూటీ తహసీల్దార్, సీహెచ్ మురళీధర్, అనంతగిరి

ఇంటర్వ్యూ



ప్రశ్న: మండలంలో రెవెన్యూ సేవలు ఏవిధంగా అందుతున్నాయి. మీసేవలో చేసుకున్న దరఖాస్తులు సకాలంలో పరిష్కారం అవుతున్నాయా?

జవాబు: ప్రస్తుతం మండలంలో రెవెన్యూసేవలు వేగవంతంగా అందేలా చర్యలు తీసుకుంటున్నాం. మీసేవ కేంద్రాల ద్వారా వివిధ ధ్రువపత్రాలకు దరఖాస్తులు చేసుకున్నవారందరికీ సకాలంలోనే సేవలు అందిస్తున్నాం. జాప్యం చేయడం లేదు.

ప్ర:మండలంలో భూముల వ్యవహారాలకు సంబంధించి సిట్‌లో ఎన్ని ఫిర్యాదులు అందాయి. దర్యాప్తు ఏవిధంగా సాగుతుంది?

జ:మండలంలో భూముల వ్యవహారాలకు సంబంధించి 34 ఫిర్యాదులు సిట్‌కు అందాయి. వీటిపై విచారణ కొనసాగుతోంది. ఆరు ఫిర్యాదులకు సంబంధించి రిపోర్టులు పంపించా. మిగతా 28 ఫిర్యాదులకు సంబంధించిన నివేదికలు తయారు చేసి సోమవారం జిల్లా సిట్ కార్యాలయంలో అందజేయనున్నాం.

ప్ర:చౌకధరల దుకాణాల పనితీరు ఏవిధంగా ఉంది? సకాలంలో రేషన్ సరుకులు అందిస్తున్నారా?

జ:మండలలో చౌకధరల దుకాణాల పనితీరు సక్రమంగా ఉంది. సకాలంలో రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. అలాగే రేషన్ దుకాణాలు ఆదివారం సెలవురోజులు మినహా మిగతా రోజుల్లో దుకాణాలు తెరిచి ఉంచేలా చర్యలు తీసుకున్నాం.

ప్ర: తహసీల్దార్ కార్యాలయంలో సరిపడా సిబ్బంది ఉన్నారా?

జ: కార్యాలయంలో టైపిస్టు, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విధుల నిర్వహణ కొంచెం కష్టమైంది.

-అనంతగిరి

మూతపడిన హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు



తెరచుకోని హెచ్‌పీసీఎల్ పెట్రోల్‌బంకు

అరకులోయ: అరకులోయలో జీసీసీ అధ్వర్యంలో నిర్వహించే హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ వారం రోజుల నుంచి మాతబడి ఉంది. పెట్రోల్, డీజిల్ అయి పోవడంతో తెరవడం లేదు. మరో రెండురోజుల్లో స్టాక్ వస్తే తెరుచుకుంటుందనుకున్న వాహనదారులకు ఇందుకు భిన్నంగా వారం రోజులు పైబడుతున్నా పెట్రోల్ బంకు తెరుచుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ట్యాంకర్ లోపల ఆయిల్ ఫుల్ చేస్తే అధికశాతం ఆయిల్ లీకై కిందకు పోతోందని, దీంతో ఇప్పటివరకు సుమారు రూ.28 లక్షలు నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. బంకును హెచ్‌పీసీఎల్ కంపెనీ వారే దగ్గరుండి నిర్మించారు. పెట్రోల్ బంకు నిర్మించేటప్పుడు నిబంధనల ప్రకారం అన్ని సరిపోయిందా లేదా లేదో చూసుకుని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ బంకు నిర్మాణం ఎంతవరకు నిబంధనల ప్రకారం వుందో చూసుకునేందుకు జీసీసీ అధికారులు, ఆయిల్ కంపెనీ ప్రతినిధులు తనిఖీలు చేసుకునే క్రమంలో బంక్‌ను తాత్కాలికంగా మూసివేశారని తెలుస్తోంది. ఈ బంకు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చేలా జీసీసీ, హెచ్‌పీసీఎల్ కంపెనీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వైటీసీలో ట్రైకార్ రుణాల కోసం ఇంటర్వ్యూ రేపు

అరకులోయ: స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ట్రైకార్ రుణాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికశాతం మంది అభ్యర్థులు దరఖాస్తు చేసున్న కారణంగా యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో విధిగా హాజరు కావాలన్నారు.

విక్రయానికి సిద్ధంగా వినాయక ప్రతిమలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు

ముంచంగిపుట్టు: వినాయక చవితి సమీపిస్తుం డడంతో వినాయక విగ్రహాలు మండలంలో దర్శనమిచ్చాయి. వీటికి డిమాండ్ బాగానే పెరుగుతోంది. అనకాపల్లి, విశాఖపట్నం, చోడవరం వంటి మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులు మండల కేంద్రానికి వచ్చి వివిధ రూపాల వినాయక ప్రతిమలను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. వీటిలో రూ.1500 నుంచి రూ.10 వేలు వరకు విలువైన ప్రతిమలు వున్నాయని వ్యాపారులు తెలిపారు. ధరలు ఎలా వున్నా వీటిని కొనుగోలు చేసేందుకు వినాయక చవితి ఉత్సవ కమిటీలు వెనుకడుగు వేయడం లేదు.

తపాలా ఉద్యోగుల ఆందోళన



పోస్టాఫీసు ఎదుట ఆందోళన చేస్తున్న తపాలా ఉద్యోగులు

ముంచంగిపుట్టు: తమ సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె ఆగదని ఆల్ ఇండియా గ్రామీణా తపాలా ఉద్యోగుల సంఘం అరకు డివిజన్ జాయింట్ కార్యదర్శి జి.గాసన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోస్టల్ బ్రాంచ్ కార్యాలయంలో తపాలా ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఎనిమిది పని గంటలు చేయాలని, పింఛను సదుపాయం కల్పించాలని నినాదాలు చేశారు.గాసన్న మాట్లాడుతూ తపాలా ఉద్యోగుల వినతిని ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం నేటికీ కమిటీ సిఫార్సులు అమలు చేయడం లేదన్నారు. ఏఐజీ డీఎస్‌యూ మండల అధ్యక్ష, కార్యదర్శులు జయరావు,సురేష్,గంగాధర్, రాఘవేంద్రనాథ్, ప్రసాద్ రావు,ప్రతాప్,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిత్తడిగా సంతబయలు ప్రాంగణం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని వారపుసంత ప్రాంగణం శనివారం కురిసిన వర్షంతో చిత్తడిగా మారింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సంతబయలకు వెళ్లే మార్గాలన్నీ బురదమయంగా దర్శనమిస్తున్నాయి. కూరగాయాలు తీసుకొచ్చే గిరిరైతులు చిన్న పాకలు ఏర్పాటు చేసుకుని వర్షానికి ఇబ్బందులు పడుతూ విక్రయాలు కొనసాగించారు. కొంత మంది అధ్వానంగా ఉన్న దారులతో కాలినడకన వెళ్లేందుకు బయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షంతో వారపు సంత అంతా గొడుగుల మయమైంది.




తడక సమీపంలో విస్తరణ పనులతో డబుల్ రోడ్డులా మారిన లోతేరు-అరకులోయ రోడ్డు


హట్టగుడ సమీపంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న దృశ్యం


విస్తరణలో పనులతో వాహనాలు తప్పుకునేందుకు ఇబ్బందులు పడుతున్న దృశ్యం

చురుగ్గా లోతేరు-అరకులోయ రోడ్డు విస్తరణ పనులు

- ప్లాట్‌ఫారాలు లేక తప్పుకునేందుకు ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు
- కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ అధికారులు చొరవ చూపాలని డిమాండ్

అరకురూరల్: అరకులోయ- లోతేరు వరకు 24 కిలోమీటర్ల మేరకు రహదారి విస్తరణ పనులను చురుగ్గా చేపడుతున్నారు. అక్కడక్కడ ఫ్లాట్‌ఫారాలు ఏర్పాటు చేయక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పనులను ఏప్రిల్ నెలలో ప్రారంభించారు. ప్రస్తుతం లోతేరు నుంచి తడక మధ్యలో ఐదు కిలోమీటర్ల మేర విస్తరణ పనులను పూర్తిచేశారు. తారు వేయడంతో డబుల్‌రోడ్డులా కనిపిస్తోంది. అవసరమైన చోట్ల శ్లాబ్ కల్వర్టులు, పైపు కల్వర్టులతోపాటు సీసీరోడ్లు, రక్షణ గోడల పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం అరకులోయ నుంచి హట్టగుడ, దొరగుడ మధ్యలో విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ మార్గ మధ్యలో పలు చోట్ల రహదారి బాగా వెడల్పు తక్కువగా ఉండడం, విస్తరణలో భాగంగా ఓవైపు కొంతభాగం ట్రెంచ్‌లా తవ్వకాలు చేపట్టడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకోవడం కష్టంగా వుందని ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, ఇతర వాహనదారులు వాపోతున్నారు. అక్కడక్కడ వాహనాలు తప్పుకునేలా చిన్నచిన్న ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందని వాహనదారులు కాంట్రాక్టర్‌కు,పనులను పర్యవేక్షిస్తున్న ఆర్అండ్‌బీ ఇంజనీర్లను కోరుతున్నారు. ఈవిషయమై కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ అధికారులు చొరవ చూపాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

విస్తారంగా వర్షాలు..ముమ్మరంగా పొలం పనులు

- ఆనందంలో గిరి రైతులు
- వరి, వంగ సాగుపై మొగ్గు
- వ్యవసాయ,ఉద్యానవనశాఖల సలహాల కోసం గిరి రైతుల ఎదురుచూపు

అనంతగిరి:మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గడిచిన మూడురోజుల నుంచి ముసురు వాతావరణం ఉంటూ వర్షాలు కురుస్తుండడంతో మండలంలోని రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు.

ఇప్పటికే పల్లపు భూముల్లో వరినాట్లు పూర్తవగా వర్షం ఆధారిత భూముల్లో వంగ మెక్కలను నాటారు. సకాలంలో వర్షాలు కురవడంతో వంగనారు వేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.భీంపోలు,గుమ్మకోట,గరుగుబిల్లి,కాశీపట్నం పంచాయతీల్లో వంగ తోటలకు మంచి ప్రసిద్ధి. ఈ నాలుగు పంచాయతీల్లో సుమారు 400 ఎకరాల్లో వంగతోటలు సాగు ప్రతీ ఏటా చేస్తారు.కార్తీకమాసం ప్రారంభంలోనే ఈ తోటలు కాపుకు వస్తాయి ఈ నేపథ్యంలో మెక్కలు పెంచే క్రమంలో సంబంధిత వ్యవసాయ,ఉద్యానవన శాఖల అధికారులు సూచనలు, సలహాలు ఇస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.వర్షాలు కురిసేటప్పుడే సంబందిత శాఖల అధికారులు రైతులకు మెలకువలు తెలపాలని కోరుతున్నారు.


అనంతగిరిలో వర్షం కురుస్తున్న దృశ్యం


భీంపోలు ప్రాంతంలో వేసిన వంగతోట

మూఢనమ్మకాలపై కళాజాత


అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

పెదబయలు: మండలంలోని సీతగుంట, పర్రెడ పంచాయతీల్లో శనివారం మూఢనమ్మకాలపై కళాజాత కార్యక్రమం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సహకారంతో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మూఢనమ్మకాలతో కలిగే కష్టాలను వివరించారు. ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మత్స్యలింగ్, స్థానిక సర్పంచ్ డి.విజయ, సీసీ సత్తిష్, ఎంఆర్‌పీ గంగాభవానీ, కళాజాత బృందం ఈశ్వర్‌రాజు, చంటి, నాగరాజు, లంగమూర్తి, కొండబాబు, శంకర్‌రావు పాల్గొన్నారు.

అరకు రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛభారత్


కుళాయి శుభ్రం చేస్తున్న దృశ్యం


రైల్వే స్టేషన్‌ను శుభ్రం చేస్తున్న దృశ్యం

అరకులోయ: అరకు రైల్వేస్టేషన్‌లో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం ఆర్‌పీఎఫ్ స్టాఫ్, ఆస్పత్రి సిబ్బంది సంయుక్తంగా నిర్వహించారు. స్వచ్ఛభారత్‌లో స్థానిక కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, రైల్వే ఆస్పత్రి వైద్యులు డాక్టర్ జాహ్నవి పాల్గొని పారిశుధ్య పనులను చేయించారు. ముఖ్యంగా ప్లాట్‌ఫారంపై ఉన్న తాగునీటి కుళాయి పాయింట్‌లను పరిశుభ్రం చేశారు. స్టేషన్ పరిసరాలు, వివిధ గదులను, ప్లాట్‌ఫారంను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

సెల్ దుకాణంలో చోరీ: రూ.70 వేల విలువైన సామగ్రి అపహరణ

అరకురూరల్: మండలంలో సెల్‌దుకాణం నిర్వహిస్తున్న కార్తికో రాజ్‌కిరణ్ రాజు సెల్ పాయింట్‌లో శుక్రవారం చోరీకి గురైనట్టు దుకాణ యజమాని కార్తికో రాజుకుమార్ తెలిపారు. రూ.8 వేలు నగదు, రూ.70వేలు ఖరీదు చేసే సెల్ సామగ్రి అపహరించినట్టు ఆయన తెలిపారు.పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

నేడు వినియోగదారుల సంఘాల ప్రతినిధుల సమావేశం

అరకులోయ: పాడేరు డివిజన్ పరిధిలోని వినియోగదారుల సంఘాల ప్రతినిధుల సమావేశం ఆదివారం 10 గంటలకు జరగనుందని వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు వి.ధర్మయ్య, ఉపాధ్యక్షుడు ఎం.కిరణ్‌కుమార్‌లు ఓప్రకటనలో తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు సమాచార హక్కు-వినియోగదారుల రక్షణ చట్టాలు-తీర్పులు అనే అంశంపై సమావేశం జరగనుందన్నారు. ఈ సమావేశానికి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు, సమాచార హక్కు వినియోగదారుల హక్కుల రక్షణ ఉద్యమ రాష్ట్ర అవార్డు గ్రహీత కాండ్రేంగుల వెంకట రమణ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశానికి 11 మండలాల నుంచి వినియోగదారుల సంఘాల ప్రతినిధులంతా హాజరు కావాలని కోరారు.

గెడ్డలోకి దూసుకెళ్లిన కారు

అనంతగిరిరూరల్: అనంతగిరి ఘాట్‌రోడ్డులో శనివారం తెల్లవారుజామున డముకు గ్రామసమీపంలో ఓకారు గెడ్డలోకి దూసుకుపోయింది. అరకులోయ నుంచి విశాఖపట్నం పర్యాటకులు కారులో వెళుతుండగా పొగమంచు అధికంగా వుండడంతో మలుపు కనిపించక తిన్నగా వెల్లడంతో సుమారు పదిమీటర్ల లోతు ఉన్న గెడ్డలోకి దూసుకుపోయింది. ఈప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

నేటి నుంచి తహసీల్దార్ కార్యాలయాల్లో ధర్నా

డుంబ్రిగుడ:పాడేరు ఏజెన్సీ వ్యాప్తంగా ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకు తహసీల్దార్ కార్యాలయాల్లో ధర్నా నిర్వహించనున్నట్టు రాష్ట్ర నాయకులు కె.సురేంద్ర, సీపీఎం మండల కార్యదర్శి కె.దయానిధి తెలిపారు. శనివారం వారు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో ఎన్నికల ముందు నరేంద్ర మోదీ ఏడాదికి రూ.రెండు కోట్లు ఉపాధి పనులు కల్పిస్తామని హామీ ఇచ్చి మూడేళ్లు గడిచిన ఉపాధి కల్పించలేదని అన్నారు. తక్షణమే ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సర్పంచ్ అచ్చమ్మ, సింహాద్రి, బాలరాజు, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సోయగాలు


సుదూరంగా కొండలనంటిన మేఘాలు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు- పాడేరు ప్రధాన రహదారిలో ప్రకృతి సోయగాలు ఎన్నో దాగి ఉన్నాయి. ఈ ప్రాంతంలో సెప్టెంబర్ మొదలు జనవరి వరకు నిత్యం సినిమా షూటింగ్‌లు జరుగుతాయి. జైపూర్ జంక్షన్ నుంచి ప్రకృతి అందాలు ఎంతగానో చూపరులను మంత్రముగ్ధులు చేస్తున్నాయి. ప్రధానంగా కురిడి పెద్దబ్రిడ్జి గెడ్డ వద్ద ఉన్న భారీ వృక్షం అందులో డార్లింగ్ సినిమా సెట్ ఉండడం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. మూడు కొండల నడుమ గ్రామం, ఆకాశం ఎత్తున కొండలు ఆకాశంలో కలిసిపోయిన మబ్బులు ఇలా ఎంతో ఆకర్షణ దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి.

మొక్కుబడి తంతుగా ప్రజావాణి

పలు శాఖల అధికారులు డుమ్మా

ముంచంగిపుట్టు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం మొక్కుబడి తంతుగా జరిగింది. రెండు, మూడు శాఖల మినహా ఇతర శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో ప్రజావాణికి వినతులు అందించేందుకు వచ్చిన బాధితులు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ, ఐసీడీఎస్ అధికారులు మినహా ఇతర ఏశాఖ అధికారులు హాజరు కాలేదు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు సంబంధిత అధికారులు అందుబాటులో లేక తీవ్ర నిరాశ చెందారు.

బెంగళూరు, హౌరాకు ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం: ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని విశాఖ మీదుగా బెంగళూరు, హౌరా, తిరువనంతపురానికి ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు.

హౌరా- బెంగళూరు : 02510 నంబర్ గల రైలు ఈ నెల 22 తెల్లవారుజాము 1.05 గంటలకు హౌరాలో బయలుదేరి అదేరోజు (22న) మధ్యాహ్నం 3.05 గంటలకు విశాఖ చేరి తిరిగి 3.50 గంటలకు బయలుదేరి మర్నాడు (23న) ఉదయం 11.40 గంటలకు బెంగళూరు క్యాంట్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02509 నంబర్ గల రైలు ఈ నెల 24 రాత్రి 11.40 గంటలకు బెంగళూరులో బయలుదేరి మర్నాడు (25న) రాత్రి 7.15 గంటలకు విశాఖ చేరి తిరిగి 7.35 గంటలకు బయలుదేరి మర్నాడు (26న) ఉదయం 10.55 గంటలకు హౌరా చేరుతుంది.

తిరువనంతపురం- హౌరా : 06515 నంబర్ గల రైలు ఈ నెల 20న మధ్యాహ్నం 12.40 గంటలకు తిరువనంతపురంలో బయలుదేరి మర్నాడు (21న) రాత్రి 7.15 గంటలకు విశాఖ చేరి తిరిగి 7.35 గంటలకు బయలుదేరి మర్నాడు (22న) 10.55 గంటలకు హౌరా చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 06516 నంబర్ గల రైలు ఈనెల 24 తెల్లవారుజాము 1.05 గంటలకు హౌరాలో బయలుదేరి అదేరోజు (24న) మధ్యాహ్నం 3.05 గంటలకు విశాఖ చేరి తిరిగి 3.50 గంటలకు బయలుదేరి మర్నాడు (25న) రాత్రి 10.35 గంటలకు తిరువనంతపురం చేరుతుంది.

ఆది నుంచి ఆరోపణలు

అచ్యుతాపురం, ఆగస్టు 19: ఎనిమిది వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన అచ్యుతాపురం గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్‌పై అనేక అభియోగాలు వున్నాయి. ఆయన తప్పుడు ధ్రువీకరణ పత్రం సమర్పించి పదోన్నతి పొందారనే ఆరోపణలు కూడా వున్నాయి. ప్రస్తుతం అచ్యుతాపురం గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్‌గా చేస్తున్న డి.సాల్మన్‌రాజు 1985లో ట్రైనింగ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ)గా పశ్చిమ గోదావరి జిల్లా అప్పలరాజుగూడెం ఆంధ్ర ప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాల (ఏపీఆర్ ఎస్)లో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయునిగా చేరారు. అప్పట్లో సాల్మన్‌రాజు తన చిరునామా పశ్చిమ గోదావరి జిల్లా అగర్తిపాలెం, వయా పాలకొల్లు, కులం బీసీగా పేర్కొన్నారు. సాల్మన్‌రాజు టీజీటీగా చేరి అనంతరం పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ)గా మారారు. ఇదిలావుండగా 2002లో ఎలమంచిలిలో బాలికల గురుకుల పాఠశాలను ప్రారంభించారు. సాల్మన్‌రాజు బదిలీపై ఎలమంచిలి వచ్చారు. 2013లో ఈ పాఠశాలను అచ్యుతాపురం మార్చారు. రామశర్మ రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా వుండేవారు. ఆయన 2013 సెప్టెంబర్ 30న బదిలీపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో సీనియర్ అయిన ఇంగ్లీష్ పీజీటీ టి.నారాయణస్వామికి ఎఫ్ఏసీ (ఫుల్ అడిషన్ చార్జి) ఇచ్చారు. ఆయన కేవలం మూడు మాసాలు మాత్రమే ఎఫ్ఏసీగా చేశారు. అనంతరం యండమూరి ఉదయ్‌కుమార్ వచ్చారు. ఆయన సీనియర్ కావడంతో 2014 ఫిబ్రవరిలో ఎఫ్ఏసీగా నియమించారు. ఇదిలావుండగా 2017 జనవరిలో జూనియర్ అయిన డి.సాల్మన్‌రాజును ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ హైదరాబాద్ ఏపీఆర్ఈఐ సొసైటీ నుంచి ఉత్తర్వులు రావడంతో అంతా ఖంగుతిన్నారు. ఎస్సీ కేటగిరీలో ప్రమోషన్ వచ్చినట్టు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. విషయం తెలిసిన ఆంధ్రజ్యోతి వివరాలు సేకరించగా అసలు విషయం బయటపడింది. దేవా సాల్మన్‌రాజు అచ్యుతాపురం మండలం చోడపల్లి పంచాయతీ మోసయ్యపేటలో స్థిరనివాసం వుంటున్నట్టు, ఆయన కులం మాల-ఎస్సీ అని 2016 అక్టోబర్ 21న అప్పటి ఇన్‌చార్జి తహసీల్దార్ కె.నాగేశ్వర రావు ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. ఆ కుల ధ్రువీకరణ పత్రం ఆధారంగా సాల్మన్ రాజు ప్రిన్సిపాల్ ప్రమోషన్ కొట్టేశారు. కానీ ఇది ఎలా జరిగిందనే ది ఎవరికీ అంతుబట్టని విషయం. ఒక ఉద్యోగి 32 సంవత్సరాలు ఉద్యోగం చేసిన తర్వాత కులం ఎలా మారుతుంది. ఆయన స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా అయితే విశాఖ జిల్లా అచ్యుతాపురం మండలంలో కుల ధృవీకరణ పత్రం ఎలా ఇచ్చారు? ఇదే విషయాన్ని జూలై ఐదున మాయలోడు శీర్షికతో ఆంధ్రజ్యోతి ప్రముఖంగా ప్రచురించింది. దీనిపై విచారణ జరుగుతోంది. ఇదిలావుండగా గురుకుల బాలికల పాఠశాలలో ఖాళీగా వున్న నాలుగు ఉపాధ్యాయ పోస్టుల్లో నర్సీపట్నానికి చెందిన నలుగురు యువకులను నియమించారు. ప్రభుత్వం ఒక్కొక్క ఉపాధ్యాయునికి నెలకు 17 వేలు జీతం కేటాయించగా పది వేలకే సాల్మన్‌రాజు నియమించారని తెలిసింది. ఇది భవిష్యత్తులో చాలా అనర్థాలకు దారితీస్తుందని వారిని తొలగించి మహిళలను నియమించాల్సిందిగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును స్థానిక నేతలు కోరారు. దీంతో ఎమ్మెల్యే పాఠశాలను సందర్శించి పురుష ఉపాధ్యాయులను తొలగించాలల్సిందిగా ఆదేశించారు. దీంతో మహిళా ఉపాధ్యాయులను నియమించారు. ప్రస్తుతం వారి వద్ద లంచం తీసుకుంటూ ప్రిన్సిపాల్ ఏసీబీకి చిక్కారు.

ఏసీబీ వలలో గురుకుల ప్రిన్సిపాల్

గెస్ట్ టీచర్ నుంచి లంచం డిమాండ్

ఏసీబీని ఆశ్రయించిన ఉపాధ్యాయురాలు

రూ.8 వేలు తీసుకుంటుండగానే పట్టుబడిన ప్రిన్సిపాల్

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 19: అచ్యుతాపురంలో గల ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ డి.సాల్మన్‌రాజు శనివారం గెస్ట్ టీచర్ వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుపడ్డారు. వివరాల్లోకి వెళితే..అచ్యుతాపురం బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సాల్మన్‌రాజు ఈ ఏడాది జనవరి నెలలో పదోన్నతి పొందారు. ఆయనకు గురుకుల పాఠశాలలో ఖాళీలు భర్తీ చేసే అవకాశం లభించింది. మార్చి నెలలో గురుకుల పాఠశాలలో ఐదు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఆ పోస్టులను సాల్మన్ రాజు భర్తీ చేశారు. ఆ పోస్టులో చేరిన గెస్ట్ టీచర్‌కు రూ.14,500 వేతనం ఇస్తారు. ఈ విధంగా మార్చి నెలలో గెస్ట్ టీచరుగా చేరిన నాగసత్యానారాయణను ప్రతి నెలా రూ.ఐదు వేలు లంచంగా ఇవ్వాలని ప్రిన్సిపాల్ డిమాండ్ చేసేవారు. ఆ బాధ భరించలేక ఆయన ఉద్యోగం మానేశారు. అదేవిధంగా పాఠశాలలో పనిచేస్తున్న అరుణ అనే గెస్ట్ టీచర్‌ను కూడా ప్రతి నెలా రూ.ఐదు వేలు ఇవ్వాలని ప్రిన్సిపాల్ సాల్మన్‌రాజు డిమాండ్ చేశారు. ఈ నెలలో జూన్, జూలై నెలలకు సంబంధించి రూ.29 వేల జీతం అరుణ అందుకున్నారు. అందులో నుంచి రూ.పది వేలు ఇవ్వాలని సాల్మన్ రాజు కోరారు. నెలకు రూ.ఐదు వేలవంతున ఇస్తేనే ఉద్యోగంలో కొనసాగిస్తానని, లేకుంటే తొలగిస్తానని స్పష్టం చేశారు. దీంతో అరుణ తీవ్ర విసుగు చెంది ప్రిన్సిపాల్‌తో రూ.ఎనిమిది వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఈనెల 16వ తేదీన ఏసీబీ అధికారులను సంప్రతించింది. ఈ మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు శనివారం ఉదయం పదిన్నర గంటల సమయంలో పాఠశాల వద్ద మాటువేశారు. టీచర్ అరుణ ముందుగా అనుకున్న ప్రకారం ఎనిమిది వేల రూపాయలు (మూడు రెండు వేల రూపాయలు, నాలుగు ఐదు వందల రూపాయల నోట్లు) ప్రిన్సిపాల్ సాల్మన్‌రాజుకు ఇచ్చింది. అక్కడే పొంచి వున్న ఏసీబీ డీఎస్పీ రామకృష్ణ, ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రిన్సిపాల్ సాల్మన్‌రాజును అదుపులోకి తీసుకున్నారు.


పొలాల్లోకి చేరిన నీరు

వర్షంతో వరికి ఊపిరి

(మొదటిపేజీ తరువాయి)

పంటకు ప్రాణం పోశాయని రైతులు అంటున్నారు. నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ భారీ వర్షం పడింది. కుండపోతగా కురిసిన వర్షంతో పంట పొలాల్లో సమృద్ధిగా నీరు చేరింది. వరి పొలాలు వర్షపునీటితో కళకళలాడుతున్నాయి. శనివారం మధ్యాహ్నం వరకూ నక్కపల్లి మండలంలో 36.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షం ఖరీఫ్‌లో వరి సాగు చేసే రైతులకు ఎంతో లాభదాయకంగా వుంటుందని నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల వ్యవసాయశాఖాధికారులు శ్రీకాంత్, ఉమాప్రసాద్ చెప్పారు.

మాకవరపాలెంలో...

రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మండలంలో వరినాట్లు జోరందుకున్నాయి. మాకవరపాలెం, తామరం, కొండలఅగ్రహారం, బయ్యవరం, పీపీఅగ్రహారం, పైడిపాల గ్రామాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే వరినాట్లు వేసే గడువు దాటడంతో రైతులు ఒక్క సారిగా వరినాట్లు వేసే పనిలో పడ్డారు. వరినాట్లును దూరంగా వేయాలని వ్యవసాయాధికారి హేమ రైతులకు సూచించారు. ఎలా వేయాలో మాకవరపాలెం రైతులకు ఆమే స్వయంగా నాట్లు వేసి చూపించారు. దీని వల్ల గాలి, వెలుతురు బాగా ఉండడం వల్ల తెగుళ్లు సోకవని ఆమె చెప్పారు. ఇప్పటివరకు 700 హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయని ఆమె చెప్పారు. మరో మూడు రోజుల్లో మండలంలో వరినాట్లు పూర్తవుతాయన్నారు.



అసలే అడవి.. ఆపై అర్ధ రాత్రి.. ఆకలి తీర్చుకునేందుకు ఎటువంటి ఆహారం లేదు.. కనీసం గొంతు తడుపుకోవడానికి నీరు కూడా కనుచూపు మేరలో కానరాదు.. ముందుకు వెళ్లలేక.. వెనక్కి రాలేక.. ఇలా దాదాపు 11 గంటల పాటు ప్రత్యక్ష నరకం చూశారు.. ఇదీ నర్సీపట్నం-చింతపల్లి ప్రధాన రహదారిలోని లంబసింగి ఘాట్‌లో ప్రయాణికులకు ఎదురైన అనుభవం.



చెట్టు కొమ్మలను తాకి రోడ్డు మధ్యలో ఇరుక్కు పోయిన ట్రాలీ



రహదారిలోని ఓ వైపు నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు



మరోవైపు స్తంభించిన ట్రాలీ, వ్యాన్‌లు

లంబసింగి ఘాట్‌లో ట్రాఫిక్ జామ్

చెట్టు కొమ్మలను తాకి రోడ్డుకు అడ్డంగా నిలిచిన ట్రాలీ

రహదారికిరువైపులా బారులు తీరిన వాహనాలు

11 గంటల పాటు స్తంభించిన రాకపోకలు

అర్ధ రాత్రి అడవిలో జాగారం.. ప్రయాణికులకు నరకం

చింతపల్లి: చింతపల్లి-నర్సీపట్నం ప్రధాన రహదారిలోని లంబసింగి ఘాట్‌లో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో భారీ ట్రాలీ నిలిచిపోయింది. చెట్టు కొమ్మలు తగులుకుని రహదారికి అడ్డంగా ఉండిపోయింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేరకు ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు స్తంభించిపోయాయి. ఉదయం పది గంటల వరకూ ఒక్క వాహనం కూడా ముందుకు కదల్లేదు. ఈ క్రమంలో ప్రయాణికులు పడ్డ కష్టాలు వర్ణణాతీతం.

గూడెంకొత్తవీధి మండలం సీలేరు-దారకొండ ప్రధాన రహదారి నిర్మాణానికి తారు, పిక్కరాయిని మిక్స్‌చేసే భారీ యంత్రాలను కాంట్రాక్టరు మైదాన ప్రాంతాల నుంచి ట్రాలీలో రింతాడకు తరలిస్తున్నారు. ఈ భారీ యంత్రాలతో ట్రాలీ రాత్రి సుమారు 9 గంటలకు నర్సీపట్నంలో బయలుదేరింది. లంబసింగి ఘాట్‌లో ప్రయాణిస్తుండగా సుమారు 11 గంటల సమయంలో ట్రాలీపై నున్న భారీ యంత్రాలు చెట్లకొమ్మలకు తాకి ఇరుక్కుపోయింది. ట్రాలీ రహదారికి అడ్డంగా నిలిచిపోవడంతో ఇరువైపులా రాకపోకలు స్తంభించిపోయాయి. రాత్రి వేళ చెట్ల కొమ్మలను తొలగించే పరిస్థితి లేకపోవడంతో ఇరువైపులా ప్రయాణించే వాహనాలు ఎక్కడికక్కడ స్తంభించిపోయాయి. మరుసటి రోజు ఉదయం లంబసింగి ఘాట్‌లో రాకపోకలు స్తంభించిపోయాయని మీడియాలో స్క్రోలింగ్ రావడంతో చింతపల్లి తహసీల్దార్ ఉమామహేశ్వరరావు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే సమీపంలోని గిరిజనులను రప్పించి చెట్టకొమ్మలను తొలగించారు. సుమారు మూడు గంటల పాటు గిరిజనులు శ్రమించి చెట్టకొమ్మలను తొలగించడంతో ఉదయం పది గంటలు తర్వాత రాకపోకలు కొనసాగాయి.

రాత్రంతా జాగారం

వాహనాలు కదలకపోవడంతో రాత్రంతా అడవిలో ప్రయాణికులు జాగారం చేయాల్సి వచ్చింది. భద్రాచలం వెళ్లే ప్రయాణికులు నరకం చవిచూశారు. దాదాపు 11 గంటల పాటు ఘాట్‌రోడ్డులోనే ఉండిపోవాల్సి వచ్చింది. వీరంతా తినడానికి ఎటువంటి ఆహారం, గొంతు తడుపుకోవడానికి కనీసం నీరు కూడా అందుబాటులో లేక అష్టకష్టాలు పడ్డారు. అలాగే తెల్లవారుజామున చింతపల్లి నుంచి నర్సీపట్నం, నర్సీపట్నం నుంచి సీలేరు, భద్రాచలం, చింతపల్లి వెళ్లే ఆర్టీసీ బస్సులు, వారపు సంతలకు వెళ్లే వాహనాలు ఘాట్ రోడ్డులోనే నిలిచిపోయాయి. ఈ క్రమంలో ప్రయాణికులు, ఉద్యోగులు, గిరిజనులు పడే కష్టాలు వర్ణణాతీతం.

కేంద్రీయ విద్యాలయం, వెటర్నరీ యూనివర్సిటీలకు

స్థలాలు కేటాయించండి

ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అనకాపల్లి: కేంద్రీయ విద్యాలయం, వెటర్నరీ యూనివర్సిటీల ఏర్పాటుకు స్థల సేకరణ చేపట్టాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో ఆర్డీవో సూర్యకళతో ఆయన సమీక్ష నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయం సుందరయ్యపేట పంచాయతీలోని అచ్చియ్యపేట గ్రామంలో సర్వే నంబర్ 511లో పదెకరాల స్థలం కేటాయించారని, ఆ స్థలానికి దేవాదాయ శాఖకు చెందిన భూమిలో నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టారని చెప్పారు. ప్రత్యామ్నాయంగా మరో చోట స్థలం ఇవ్వాలని ఆర్డీవోను ఎంపీ ఆదేశించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరమైతే ప్రభుత్వానికి లేఖ రాయాలని ఆయన సూచించారు. ఇప్పటికే రెండు మూడు చోట్ల కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థలాలు చూసి ఉంటే ఈ విధంగా జాప్యం జరిగి ఉండేది కాదన్నారు.

అలాగే వెటర్నరీ యూనివర్సిటీ ఏర్పాటుకు కూడా స్థల సేకరణ చేయాలని ఆర్డీవోకు ఎంపీ ఆదేశించారు. అనకాపల్లి లేదా కశింకోట మండలంలో వంద ఎకరాల స్థలం కేటాయించాలని సూచించారు. దీనిపై ఆర్డీవో సూర్యకళ స్పందిస్తూ, కోడూరులో కొంత భూమి ఉందని, అక్కడ కుదరకపోతే కశింకోట మండలంలో కూడా ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. ఎక్కడో చోట భూమి చూపిస్తే కేంద్ర ప్రభుత్వం వెటర్నరీ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ కేవీ.సత్యవతి, గుత్తా ప్రభాకర్ చౌదరి, కుమార్‌రాజా, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండపం పనులు ప్రారంభం

అన్నవరంలో తగ్గిన ఉద్రిక్తతలు.. తెరపైకి మరో వివాదం

స్థలం పంచాయతీది కాదని పోలీసు ఫిర్యాదు

చోడవరం: అనేక మలుపుల అనంతరం అన్నవరంలో కల్యాణ మండపం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అధికార తెలుగు దేశం, ప్రతిపక్ష వైసీపీల మధ్య తీవ్ర స్థాయిలో పోరుకు, ఉద్రిక్తతలకు కారణమైన వివాదాస్పద ఈ మండపం పనులను శనివారం ప్రారంభించారు. ఐదు రోజుల పాటు ఘర్షణలు, కొట్లాటలు, అరెస్టులకు దారితీసిన అన్నవరం గ్రామంలో కల్యాణ మండపం నిర్మాణం పనులను శుక్రవారం టీడీపీ, వైసీపీ కార్యకర్తల పోరాటాల నడుమ సర్పంచ్ దొమ్మేసి అప్పలనర్స శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. కల్యాణ మండపం నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమానికి అడ్డుతగిలిన 21 మంది వైసీపీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడంతో, శనివారం మండపం నిర్మాణం పనులను అధికారులు ప్రారంభించారు. గతంలో ఇచ్చిన మార్కింగ్ మేరకు రూ.20 లక్షలతో ఆధునిక వసతులతో మండపం నిర్మించనున్నట్టు పీఆర్ డీఈ జీఎస్ఎస్.ప్రసాద్ తెలిపారు. కాగా, కల్యాణ మండపం నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వైసీపీ నాయకులు కోర్టు ద్వారా స్టే తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు కూడా పనులు త్వరగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్టు తెలిసింది.



కల్యాణ మండపం నిర్మాణానికి పునాదులు తవ్వుతున్న దృశ్యం

ఈ స్థలం పంచాయతీది కాదు

అన్నవరంలో నిర్మిస్తున్న కల్యాణ మండపం స్థలం పంచాయతీది కాదని, ఇది రాయాలయానికి సంబంధించిన స్థలమని పేర్కొంటూ అన్నవరం గ్రామానికి చెందిన పొట్నూరు ముత్యాలనాయుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయ స్థలంలో అక్రమంగా మండపం నిర్మిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏదేమైనా అన్నవరం గ్రామంలో కల్యాణ మండపం నిర్మాణం ఐదు రోజుల పాటు రెండు పార్టీల నాయకులు, అధికారులు, పోలీసులకు కూడా నిద్ర లేకుండా చేసిందనే చెప్పాలి.

సికెల్ సెల్ ఎనీమియా పరీక్షలపై అవగాహన అవసరం

ఏడీఎంహెచ్‌వో గురునాథరావు

చింతపల్లి: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలకు సికెల్ సెల్ ఎనీమియా పరీక్షల నిర్వహణపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని పాడేరు అందనపు డీఎంహెచ్‌వో గురునాథరావు స్పష్టం చేశారు. స్థానిక యువజన శిక్షణ కేంద్రంలో కొయ్యూరు, గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాల ఆరోగ్య కార్యకర్తలకు శనివారం హెచ్‌బీ, సికెల్ సెల్ ఎనీమియా పరీక్షల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఎంహెచ్‌వో మాట్లాడుతూ, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు గుర్తించాలని సూచించారు. రక్తహీనత, సికెల్ సెల్ ఎనీమియా కలిగిన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమస్య ఉంటే వెంటనే వైద్యుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

వంతెనలపై వరద నీటి ప్రవాహం

ఏవోబీ ప్రాంతాలకు నిలిచిన రాకపోకలు

సీలేరు: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో రాకపోకలు నిలిచిపోయాయి. మల్కన్‌గిరి జిల్లాలో పొట్టేరు, కొరుకొండల వద్ద వంతెనలపై నుంచి వదరనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఛత్తీస్‌ఘడ్, ఆంధ్రాకు రాకపోకలు నిలిచిపోయి జన జీవనం స్తంభించింది. మల్కన్‌గిరి నుంచి కోరుకొండ మీదుగా సీలేరు వచ్చే రహదారిలో కోరుకొండ వంతెన పైనుంచి నీరు ప్రవహిస్తున్నది. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి. జాన్‌బాయ్ వద్ద బలిమెల జలాశయం నీరు పెరగడంతో దిగువన ప్రజలు ఇల్లు వదిలి ఎగువ ప్రాంతాలకు వెళ్లిపోయారు.



పొట్టేరు వద్ద వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

ఆదివారం ప్రత్యేకం

సెల్‌ఫోన్‌తో... పెడ వైపు





అభివృద్ధి పథమా... అధోగతి మార్గమా

యువతను బానిసలు చేస్తున్న ఫోన్ మేనియా

- సోషల్ నెట్‌వర్క్‌లకు ఎడిక్ట్ అవుతున్న ఈ-తరం
- వీడియో గేమ్స్ ప్రభావంతో చితికిపోతున్న బాల్యం
- అరగంట చేతిలో ఫోన్ లేకుంటే పిచ్చెక్కుతున్న వైనం
- అతి వినియోగంతో దారితప్పుతున్న జీవితాలు
- ప్రయోజనం మాటెరుగు... దుష్పరిణామాలే అధికం
- పక్కనే ఉన్నా మనసు విప్పి మాట్లాడుకోలేని వారెందరో
- పిల్లల తీరుపై తల్లిదండ్రుల ప్రభావం కూడా

- సాంకేతిక పరిజ్ఞానం దుర్వినియోగంతో కోరి కష్టాలు
- మారాం చేస్తున్నారని...స్టేటస్ సింబల్‌గా పిల్లలకీ ఫోన్లు
- నష్టాన్ని మాత్రం గుర్తించని వారే అందరూ
- ఇలాగే కొనసాగితే పెనుముప్పే అంటున్న నిపుణులు

(ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం)


బస్సులో వెళ్తున్నంత సేపు సెల్ ఫోన్ చాటింగ్... రోడ్డుపై నడుస్తున్నా ఫోన్‌తోనే వ్యాపకం...చివరికి తరగతి గదిలోనూ ఇదే పని...వీడియోస్, మేసేజెస్ చూడడం. అవకాశం దొరికితే ఫోన్‌లోని కెమెరాకు పని చెప్పడం...కొందరు ఆకతాయిలు అశ్లీల దృశ్యాల చిత్రీకరణకు తెగబడడం...పోర్న్ సైట్లు వీక్షిస్తున్న ప్రబుద్ధులూ కొందరు...వీడియో గేమ్స్‌తోనే జీవితం అనుకునేది మరికొందరు...ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తెచ్చిపెట్టుకున్న 'సమస్యల కుంపటి' ఇది. నాలుగేళ్ల పసిపిల్లల నుంచి పాతికేళ్ల యువతరాన్ని బానిసలను చేస్తున్న సెల్ ఫోన్ ప్రభావం ఇది. సమాచార సాంకేతిక విప్లవంతో మనిషిని ఉన్నత పథంవైపు వేగంగా అడుగులు వేయించాల్సిన సాంకేతిక పరిజ్ఞానం జీవితాలను దారితప్పిస్తున్న సాధనంగా మారిపోవడం విషాధం. అరచేతిలో ప్రపంచం ఇమిడిపోయే సౌలభ్యం వల్ల ప్రపంచాన్ని చదివి ప్రగతి బాట పట్టాల్సిన యువతరం పెడదోవ పట్టి బంగారు భవిష్యత్తును తమకు తానుగానే నాశనం చేసుకుంటున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సెల్‌ఫోన్ మాయాజాలం, దాని ప్రభావం, పరిణామాలపై నిపుణులతో మాట్లాడి 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

ఇవీ లెక్కలు

- దేశంలో ఫేస్‌బుక్ ఉపయోగిస్తున్న వారి సంఖ్య 24 కోట్లు దాటింది. ఈ విషయంలో అమెరికాను అధిగమించేశాం. వీరిలో ఏడు కోట్ల మంది భారతీయులు నిత్యం ఫేస్ బుక్ చూస్తున్నారు. ఎక్కువ మంది రోజుకు కనీసం మూడుసార్లు ఈ సైట్‌ను వీక్షిస్తున్నట్టు సర్వేల్లో తేలింది.
- ట్విట్టర్‌ను 2.3 కోట్ల మంది, యూట్యూబ్‌ను ఆరు కోట్ల మంది వీక్షిస్తున్నారు.
- కళాశాలకు వెళ్లే యువతే కాదు. పదేళ్ల పిల్లల నుంచి 90 ఏళ్ల వృద్ధుల వరకు అంతా సోషల్ మీడియా మేనియాలో చిక్కుకుంటున్నారు.
- సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయం గడపడం వల్ల డిప్రెషన్‌కు గురయ్యే ప్రమాదం వుందని యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్ పరిశోధకుల అధ్యయనంలో తేలింది.
- తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్ వినియోగించే సమయంలో పిల్లలు దగ్గర వుంచుకోవడం వల్ల స్మార్ట్ ఫోన్ ఆపరేట్ చేసే విధానం, ఫోన్‌లోని విషయాలను, సమాచారాన్ని ఏకాగ్రతతో చూడడం, దానిని గుర్తు పెట్టుకోవడం, ఎక్కువగా ఆకర్షితులు కావడం జరుగుతుంది.
- జర్నల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధ్యయనంలో దాదాపు 170 మంది తల్లి దండ్రులను విడివిడిగా కూర్చోబెట్టి పరిశోధన చేయగా, 48 శాతం మంది మూడు అంతకంటే ఎక్కువ సార్లు సెల్ వల్ల డిస్టబ్ అవుతున్నట్టు, 17 శాతం మంది ఎటువంటి ఇబ్బంది లేదని వెల్లడించారు.

ఇలా చేస్తే మేలు

- పరిమితంగా వాడితే సెల్‌ఫోన్ వినియోగం ఎంతో ఉపయుక్తం
- పిల్లలతో వీడియో గేమ్స్ ఆడించాల్సి వస్తే నిర్థిష్ట సమయం పెట్టాలి
- ఉద్రేకం, కక్షపూరిత, క్రూరత్వాన్ని ప్రేరేపించే ఆటల జోలికి వెళ్లకుండా కట్టడి చేయాలి
- రాత్రి సమయాల్లో ఆటలు ఆడకుండా నిరోధించాలి
- యువత చేసే చాటింగ్‌లపై ఓ కన్నేసి ఉంచడం అవసరం
- ఎప్పటికప్పుడు వారి మిత్రులతో మాట్లాడి పిల్లల ప్రవర్తన గురించి తెలుసుకోవాలి.
- అప్పడప్పుడు పిల్లల సెల్ ఫోన్‌లను పరిశీలిస్తుండాలి
- వారి ప్రవర్తనలో మార్పు కనిపిస్తే స్నేహితుడిలా అడిగి తెలుసుకోవడం
- ప్రత్యేకంగా ఆడపిల్లల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తప్పనిసరి
- ఒంటరిగా సెల్ ఫోన్‌తో ఎక్కువ సమయం గడుపుతుంటే ఆరాతీయాలి.



దారితప్పిన లక్ష్యం



'సాంకేతిక విప్లవం మంచి, చెడు రెండింటికీ దోహదపడుతుంది. దాని ఫలితం వినియోగించే వారిపైనే ఆధారపడి ఉంటుంది'...రెండో ప్రపంచ యుద్ధకాలంలో అమెరికా జపాన్‌పై అణుబాంబు దాడి అనంతరం ఆ బాంబుల రూపశిల్పి అయిన శాస్త్రవేత్త ఇలా ఆవేదన వ్యక్తం చేశారట. సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించే తత్వాన్నిబట్టి దాని ప్రభావం సమాజంపై కనిపిస్తుంది. మంచి, చెడు అన్నవి వినియోగించే వ్యక్తిపైనే ఆధారపడి ఉంటాయి. ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, స్నాప్‌చాట్, టెలీగ్రామ్... ఇలా మాధ్యమం ఏదైనా వాటి అంతిమ లక్ష్యం అత్యంత వేగంగా సమాచార మార్పిడి మాత్రమే. దూరంగా ఉన్న వారిని చేరువ చేయాలి. దూరమైపోతున్న వారికి దగ్గరకావాలి. కానీ ఇవే మాధ్యమాలు రాత్రిపూట దగ్గరగా ఉండాల్సిన దంపతుల్ని దూరం చేస్తున్నాయి. ఎవరి ప్రపంచంలో వారు బతికేలా చేస్తున్నాయి. పుస్తకాలతో కుస్తీపట్టాల్సిన విద్యార్థులను పట్టాపగ్గాలేని వారిగా తయారు చేస్తున్నాయి. ముచ్చటించుకునే సమయం హరించుకుపోతోంది. ఒత్తిడి పెంచి అనారోగ్యాన్ని తెచ్చి పెడుతోంది.

ఎందుకు బానిసలవుతున్నారు..



సామాజిక మాధ్యమం ఏదైనా యువత బానిసలవడానికి ప్రధాన కారణం లైక్‌లు, కామెంట్లని వేరుగా చెప్పక్కర్లేదు. మనం చేసే ప్రతిపనిని, ఉండే ప్రతి చోటుని పక్కవారితో క్షణాల్లో షేర్ చేసుకోవడం, వాటికి వచ్చే లైకులు, కామెంట్లు చూసి మురిసిపోవడం ఒక వ్యసనంగా మారింది. విద్యార్థుల్లో ఈ ధోరణి మరీ శృతిమించిపోయింది. చివరకు పడక గదిలో భార్యతో గడిపే శృంగార సన్నివేశాలను సహితం గ్రూపులో పెట్టి ఆనందించే ప్రబుద్ధులు తయారయ్యారు. కొన్ని విషయాల్లో వాదనలకు దిగుతూ వైషమ్యాలు పెంచుకుంటున్నారు. లైక్‌లు వస్తాయని పెట్టిన ఫొటోకు ఆశించిన మేరకు కామెంట్లు రాకపోవడం వల్ల ఆందోళనకు, ఒత్తిడికి, నిరాశకు గురవుతున్న వారి సంఖ్య లక్షల్లో ఉంటుండడం గమనార్హం. సున్నిత మనస్కులైన యువత మరింత కుంగిపోతున్నది. తెలియకుండానే ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. ఈ లక్షణాలన్నీ పూర్తి స్థాయిలో అనుభవిస్తున్న విద్యార్థిని ఇంటర్‌నెట్‌కు దూరంగా కొన్ని గంటలు, రోజులు, నెలలు వుంచాల్సి వస్తే పిచ్చోలుగా మారిపోతున్నారు. ఈ శతాబ్దపు అద్భుతమైన ఆవిష్కరణల్లో ఒకటైన సోషల్ మీడియా కోట్లాది మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తోంది. ముఖ్యంగా నాలుగేళ్ల చిన్నారుల నుంచి పాతికేళ్ల యువకుడి వరకు శ్వాస...ధ్యాసగా మారిపోయిందంటే అతిశయోక్తి కాదు.

విలువలు కరిగిపోతున్నాయి

కొత్త టెక్నాలజీ, ఫీచర్ల వల్ల తల్లిదండ్రులు వారి పిల్లలతో గడిపే సమయం తగ్గుతోందని పలు సర్వేల్లో తేలింది. మనుషుల్లో విలువలు కరిగిపోవడానికి సెల్ ఫోన్ కారణమని చెబుతున్నారు. రోడ్డుపై ప్రమాదం జరిగితే బాధితులకు సాయం అందించి వారిని కాపాడే ప్రయత్నం కంటే ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించేందుకే ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారని పలు సందర్భాల్లో వెల్లడైంది. విలువలు కరిగిపోతున్నాయనేందుకు ఇంతకంటే ఉదాహరణ ఏముంది. స్కూల్ నుంచి వచ్చిన పిల్లాడి హోమ్ వర్కు కంటే, వాడి ఇబ్బందుల కంటే తమ సెల్‌లోవచ్చే మెసేజ్‌లపైనే ఎక్కువ మంది తల్లిదండ్రులు దృష్టి పెడుతున్నారు. గంటకోసారైనా సెల్ లాక్ ఓపెన్ చేసి ఏం మెసేజ్‌లు వచ్చాయో చూడందే రోజు గడవని విద్యార్థులున్నారు. వైఫేతో జీవితాన్ని అనుసంధానించుకున్న వారికీ లోటులేదు. దంపతులు మాట్లాడుకోవాలంటే చాటింగ్ పూర్తవ్వాలి. గతంలో క్షణం తీరిక లేని భర్త ఇప్పుడు అర్థరాత్రి వరకు సోషల్ మీడియాతోనే కాలక్షేపం చేస్తాడు. అదే సమయంలో భార్యతో మనసువిప్పి మాట్లాడే తీరుబాటు మాత్రం ఉండదు.



చేతిలో సెల్ ఫోన్... చెవిలో ఇయర్ ఫోన్స్... మాట్లాడుతూ ప్రయాణం... వీక్షిస్తూ విహారం...ఇంటా, బయటా ఎప్పుడూ చూసినా ఇదే వ్యాపకం. అధునాతక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాక సెల్ ఫోన్ ఇప్పుడు సామాన్యుని సాధనమైంది. సమాచార మాధ్యమంగా ఉపయోగపడాల్సిన ఫోన్ నాలుగు అడుగులు ముందుకు వెళ్లి మరెన్నో కొత్తపుంతలు సొంతం చేసుకుంది. స్మార్ట్‌ఫోన్‌లు వచ్చాక అరచేతిలోకి ప్రపంచం వచ్చి చేరింది. అంతాబాగున్నా ఎదురవుతున్న దుష్పరిణామాలపైనే నిపుణుల ఆందోళన. ఛాటింగ్...షూటింగ్...లిజనింగ్...వ్యూయింగ్... ఎప్పుడు చూసినా ఇదే వ్యాపకం...మంచి కోసం కంటే చెడువైపు యువత అడుగులు వేస్తుండడమే భయపెడుతోంది. సాంకేతిక అద్భుతం సాధించామని సంతోషించాలా...జీవితాలు దారి తప్పుతున్నాయనని భయపడాలా అన్న డైలమా ఇప్పుడు అన్నివర్గాలను వెంటాడుతోంది. ఈ ప్రయాణం 'ఎటు వైపు సాగుతుంది' అన్నదే అందరినీ భయపెడుతున్న అంశం.

బ్రెయిన్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందంటున్నారు




ఎక్సరే, స్కానర్ వంటి వాటివల్ల అనైజింగ్ రేడియేషన్ ప్రభావం మనపై పడుతుంది. అది కొంత హానికరం. కానీ సెల్‌ఫోన్ ద్వారా వచ్చే రేడియేషన్ నాన్ అనైజింగ్ కనుక అంత ప్రభావం వుండదు. కానీ చిన్నపిల్లలు ఎక్కువ సెల్‌ఫోన్‌తో ఆడడం వల్ల దీర్ఘకాలికంగా సమస్యలు ఉత్పన్నమవుతాయి. అనేక రకాల దుష్పరిణామాలు వున్నట్టు ప్రచారంలో వున్నా శాస్త్రీయంగా నిరూపితం కాలేదు. చాలా అంశాలు పరిశోధనల దశలోనే వున్నాయి. ఆస్ట్రేలియాలో పరిశోధనలు జరుగుతున్నాయి. సెల్ వినియోగం తీవ్రతరమైతే బ్రెయిన్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం వుందని పరిశోధకులు చెబుతున్నారు. **- బుచ్చిబాబు,** హెచ్ఓడీ, కేజీహెచ్ రేడియోలజీ విభాగం

అనర్థాలకు లెక్కే లేదు

సెల్‌ఫోన్‌లో గంటల కొద్దీ మాట్లాడే వారిని అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మొబైల్ పదేళ్లు వాడితే యుక్తవయస్కుల్లో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని స్వీడన్ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. రేడియేషన్ వల్ల మెదడులో కణాలపై తీవ్ర ప్రభావం పడి కణితులు ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్నారు. ఫోన్‌కు కవర్ లేకుండా జేబులో పెట్టుకోవడం వల్ల రేడియేషన్ వల్ల గుండెపై ప్రభావం పడుతుందంటున్నారు. పునరుత్పత్తి సమస్యలు, స్మెర్మ్ కౌంట్ తగ్గిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయన్న ప్రచారం ఉంది. కానీ ఇవన్నీ ఇంకా పరిశోధన దశలోనే వున్నాయని, శాస్త్రీయంగా పూర్తి స్థాయిలో నిరూపితం కాలేదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. మణికట్టు నుంచి మెదడుకు వెళ్లే నాళం దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నారు. ఫోన్‌ను మితిమీరి వాడితే రక్తపోటు పెరుగుతుందని, నిద్రలేమి సమస్య వస్తుందని, చెవి పోటు పెరుగుతుందని నిపుణులంటున్నారు. తలనొప్పి, కళ్లు తిరగడం, అసౌకర్యం వంటి ఇబ్బందులు ఎదురవుతాయని చెబుతారు. కంటి వైద్య నిపుణులు అపోహని కొట్టిపారేస్తున్నా ఎక్కువ సేపు సెల్ చూడడం వల్ల కంటి చూపు మందగిస్తుందన్న ప్రచారం కూడా ఉంది. సెల్‌ఫోన్ రేడియేషన్ నాన్ అనైజింగ్ (అనైజింగ్, నాన్ అనైజింగ్ రెండు రకాలు) కావున రేడియేషన్ ప్రభావం ఉండదని సెల్ కంపెనీలు చెబుతున్నా దీర్ఘకాలం ఎక్కువ సమయం వాడితే ప్రభావం కచ్చితంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.



కొత్త పరిచయాలతో ఇబ్బందులు



ఫేస్ బుక్... ముఖపరిచయం లేని వారిని కలిపే సాధనం. కానీ కాంప్లెమెంట్‌లు... కృతజ్ఞతలు... ఆహ్వానాలు...ఇంకా ఎన్నో. ఒకరంటే ఒకరికి తెలియక పోయినా కొన్నాళ్ల చాటింగ్ తర్వాత మూడో కంటికి తెలియకుండా కలుసుకోవడం, మాయమాటలు నమ్మి సర్వం సమర్పించుకోవడం, ఆ తర్వాత మోసపోయామని తెలిసి లబోదిబో మనడం... ఆ తర్వాత ఫిర్యాదులు, కేసులు షరామామూలే. ఎక్కడ మొదలై ఎక్కడ అంతమవుతుందో తెలియని ఈ పరిచయాల వల్ల విద్యార్థులు చాలా విలువైన కెరీర్‌ను నష్టపోతున్నారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల ఆన్‌లైన్ ఏక్టివిటీలపై దృష్టి పెడుతుంటే మరికొందరు కనీసం పట్టించుకోవడం లేదు. మరికొందరికి అంత పరిజ్ఞానం ఉండడం లేదు. తల్లిదండ్రులు కనిపెడుతున్నారని పిల్లలు పసిగడితే వివరాలు తెలియకుండా వారు ఇంకా జాగ్రత్త పడుతున్నారు. చాటింగ్‌లు, హిస్టరీలు ఎప్పటికప్పుడు డిలీట్ చేస్తూ అప్రతమ్తంగా వుంటున్నారు. ఆన్‌లైన్ పరిచయాల వల్ల మోసపోతున్న వారిలో ఆడపిల్లలే అధికంగా వుంటున్నారు.

దూరం తరిగింది...పెరిగింది



సెల్‌ఫోన్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక అరచేతిలోకి ప్రపంచం వచ్చి దూరం తగ్గింది. కానీ మనుషుల బాంధవ్యాల మధ్య దూరం మాత్రం పెరిగింది. వీడియో కాలింగ్ సదుపాయం అందుబాటులోకి వచ్చాక అమెరికాలో ఉన్న కొడుకుతో మాట్లాడి దగ్గరనే ఉన్న అనుభూతి పొందుతున్నారు తల్లిదండ్రులు. అత్యవసర పత్రాలు, ఇతర ఫైళ్లు ఒక చోటు నుంచి మరో చోటుకు పంపేందుకు గతంలో నెట్ సెంటర్లకు వెళ్లాల్సి వచ్చేది. అత్యవసరమైతే కొన్ని సందర్భాల్లో దాదాపుగా అసాధ్యమయ్యేది. కానీ ఇప్పుడు ఇంట్లో వున్న సెల్ ఫోన్‌లో ఫొటో తీసి అవసరమైన పత్రాలు క్షణాల్లో కావలసిన చోటుకు పంపుకునే వీలు కలిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని ప్రయోజనాలున్నాయి. ఒక మంచి ప్రయోజనం కోసం రూపొందిన సెల్ ఫోన్ అంతే చేటును చేస్తోంది. ముఖ్యంగా విద్యార్థి దశపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. సెల్ మేనియాలో పడి చదువును నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏకాగ్రతను కోల్పోతున్నారు. తమ విలువైన కాలాన్ని వృథా చేసుకుంటున్నారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం



ఎందులోనైనా ఆనందం ఉంటే దాన్ని వెతుక్కోవడం సహజం. యువత సెల్‌కు ఎడిక్ట్ అవడానికి ఇదే కారణం. వారికి కావలసిన ప్రపంచం అందులో దొరుకుతోంది. సెల్ ఫోన్ వాడకం పెరిగితే ఏకాగ్రత లోపిస్తుంది. బాధ్యతలు మర్చిపోతాం. వాయిదా వేసే ధోరణి పెరుగుతుంది. జ్ఞాపకశక్తి తగ్గుతుంది. చేసే వృత్తిలో, చదివే చదువులో నైపుణ్యం కొరవడుతుంది. నెట్ వినియోగానికి నిర్దిష్ట సమయం పెట్టుకుని, పరిమితులకు లోబడి వినియోగిస్తే ప్రయోజనాలే ఎక్కువ. పిల్లల విషయంలో తల్లిదండ్రుల పర్యవేక్షణ చాలా అవసరం. సెల్‌కు బానిసైన వారికి దానిని దూరం చేసినా, ఆంక్షలు విధించినా చిరాకు, కోపం, అసహనం పెరిగిపోతాయి. స్థిరత్వం కొరవడుతుంది. అందుకే ఆ స్థితి రాకమునుపే అప్రమత్తం కావాలి. **- డాక్టర్ ఎన్.ఎన్.రాజు,** సైకాలజిస్ట్

కళ్లు ఒత్తిడికి గురవుతాయి



ఎక్కువ సమయం సెల్ ఫోన్ వినియోగించడం వల్ల కళ్లు అలసటకు గురవుతాయి. కానీ కంటి చూపుపై ప్రభావం పడుతుందన్నది అపోహ మాత్రమే. రాత్రి సమయాల్లో లైట్లు అపేసి సెల్ ఎక్కువ సేపు చూడడం వల్ల కళ్లు తీవ్ర ఒత్తిడికి గురవుతాయి. దాని ప్రభావం నిద్రపై పడుతుంది. ఈ కారణంగా ఆనారోగ్య సమస్యలు చుట్టుముడతాయి. మైదానంలో ఆడుకోవాల్సిన సమయాన్ని సెల్ కోసం వృథా చేయడం సరికాదు. నిద్రపోయే గంట ముందు సెల్ ఫోన్ వాడక పోవడం మేలు. **- డాక్టర్ రవీంద్ర,** శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యశాల

స్వీయ నియంత్రణ ఉండాలి



కావాల్సిన స్టడీ మెటీరియల్ క్షణాల్లో డౌన్‌లోడ్ చేసుకుంటూ విద్యార్థులు సెల్‌ఫోన్ ద్వారా ఎంతో ప్రయోజనం పొందుతున్నారు. గ్రంథాలయాలు, బుక్‌స్టాల్స్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అంతా అందుబాటులోకి రావడంతో సెల్ వినియోగం పెరిగింది. అదేవిధంగా సోషల్ మీడియా కారణంగా సమయం వృథా చేస్తున్నవారూ ఉన్నారు. సద్వినియోగం, దుర్వినియోగం చేసే రెండు వర్గాలున్నాయి. విద్యార్థులకు స్వీయ నియంత్రణ ఉండాలి. టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి. **- వెంకటరావు,** డైరెక్టర్, ఏయూ కంప్యూటర్ సెంటర్

యువతి అదృశ్యం



రాంబిల్లి: మండలంలోవాడనర్సాపురం గ్రామానికి చెందిన ఎస్.నూకరత్న(19) ఈ నెల 11 నుంచి కనిపించడం లేదని తల్లి ఎర్రయ్యమ్మ ఫిర్యాదుచేశారని స్థానిక ఎస్ఐ కుమార్‌స్వామి తెలిపారు.బ్రాండిక్స్ కంపెనీలో పనిచేస్తున్న నూకరత్నం రాంబిల్లి వెళతానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన చెప్పారు. ఆమె తల్లి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామన్నారు.

తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్య



మునగపాక: మండలంలోని నాగులాపల్లి గ్రామానికి చెందిన యల్లబిల్లి శంకరరావు(24) తన తల్లి మందలించిందని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి హెచ్‌సీ దొర అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగులాపల్లి గ్రామంలో జగ్గజ్జీవన్‌రామ్ కాలనీలో యల్లబిల్లి శంకరరావు నివాసం ఉంటున్నాడు. తాగుడుకు బానిసైన శంకరరావు శుక్రవారం మద్యం కోసం తన తల్లికి డబ్బులు ఇమ్మని అడిగాడు. తల్లి మందలించి డబ్బులు ఇవ్వడానికి నిరాకరించింది. దీంతో సాయంత్రం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి ఎన్టీఆర్ వైద్యాలయంలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు శంకరరావుకు భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ... పాము కాటుకు గురైన వ్యక్తి మృతి



కె.కోటపాడు: మండలంలోని ఎ.కోడూరు శివారు పొడుగుపాలెం గ్రామంలో పాముకాటుకు గురైన కర్రి మంగునాయుడు (47) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ నెల 13వ తేదీన చెరకుతోటలో పనిచేస్తుండగా పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. ఇది గమనించిన స్థానికులు కె.కోటపాడు ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎ.కోడూరు ఎస్ఐ ఎ.సత్యనారాయణ తెలిపారు.

రైలు పట్టాలపై పసికందు మృతదేహం



విశాఖపట్నం : విశాఖ రైల్వేస్టేషన్ లోని పట్టాలపై శనివారం పసికందు మృతదేహం కనిపించింది. అంతలోనే ఆ మృతదేహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎవరికీ తెలియకుండా తరలించడం చర్చనీయాంశమైంది. పూర్తిగా నెలలు కూడా నిండని ఆ పసికందు తల్లి ప్రేగుతో సహా ట్రాక్‌పై పడిన నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా వదిలి వెళ్లిపోయి వుంటారని అభిప్రాయపడుతున్నారు. ఈ సమాచారం రైల్వే పోలీసులకు అందే సమయానికే ట్రాక్‌పై పసికందు మృతదేహం కనిపించలేదు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

చిన్నాన్న అంత్యక్రియలు నిర్వహించి.. శ్మశానంలోనే ప్రాణాలు విడిచి..

మల్కాపురంలో విషాద ఘటన

విశాఖపట్నం : చిన్నాన్న అంత్యక్రియలు నిర్వహించిన వ్యక్తి శ్మశానంలోనే మృతి చెందిన విషాదం సంఘటన శనివారం మల్కాపురం శ్మశాన వాటికలో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

స్థానిక ఏకేసీ కాలనీకి చెందిన పైలా సూర్యనారాయణ (68) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. దహన సంస్కారాలు నిర్వహించేందుకు శనివారం ఉదయం మృతదేహాన్ని స్థానిక శ్మశాన వాటికకు తీసుకొచ్చారు. మృతుడి అన్న కుమారుడు పైలా రమణ (48) అంత్యక్రియలను పూర్తి చేశారు. అనంతరం శ్మశానంలోనే ఉన్న బోరు వద్ద కాళ్లు, చేతులు కడుగుతుండగా, రమణ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే అతడిని సమీపంలో ఉన్న జీవీఎంసీ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. దీంతో బంధువులు, ఏకేసీ కాలనీ వాసులు విషాదంలో మునిగిపోయారు.

ఆస్పత్రి నుంచి రమణ మృతదేహాన్ని ఆటోలో ఏకేసీ కాలనీకి తరలించారు. అక్కడ సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలు చేపట్టి తిరిగి దహన సంస్కారాల నిమిత్తం శ్మశానానికి తీసుకెళ్లారు.



ఆటోలో మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

వివిధ ప్రాంతాల నుంచి సూర్యనారాయణను కడసారి చూసేందుకు వచ్చిన వారంతా శ్మశానంలో రమణ మృతి చెందాడని తెలుసుకుని విలపించారు.

ఉషాప్రైమ్ ఆస్పత్రి ఎదుట ధర్నా

వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపణ



ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

అనకాపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి వైద్యం అందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని శనివారం రాత్రి ఉషాప్రైమ్ ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 10వ తేదీన ఎలమంచిలికి చెందిన ఎస్.సన్యాసినాయుడు అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతనిని అదేరోజు స్థానిక ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న సన్యాసినాయుడు పరిస్థితి శనివారం విషమించడంతో తీసుకు వెళ్లిపోవాలని వైద్యులు పోలీసులతో చెప్పించారు. దీంతో ఆగ్రహించిన సన్యాసినాయుడు బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాల మధ్య సయోధ్య కుదిర్చారు.

వాకపల్లి గాయానికి పదేళ్లు!!

- దశాబ్దం గడుస్తున్నా మహిళలకు దక్కని న్యాయం
- మహిళలు వేసిన కేసుపై సుప్రీంకోర్టు స్టే తెచ్చుకున్న పోలీసులు
- 11 మంది బాధిత మహిళల్లో ఇద్దరి మృతి
- నేటికీ న్యాయ పోరాటం చేస్తున్న ప్రజాసంఘాలు

పాడేరు: 2007 ఆగస్టు 20 తేదీన కూంబింగ్ పోలీసులు తమపై అత్యాచారానికి పాల్పడ్డారని జి.మాడుగుల మండలం నుర్మతి పంచాయతీ వాకపల్లికి చెందిన 11 మంది ఆదిమ జాతి గిరిజన మహిళలు ఫిర్యాదు చేశారు. ఆ ఘటన జరిగి ఆదివారానికి దశాబ్దం కావస్తున్నది. కానీ నేటికీ తమకు న్యాయం జరగలేదని బాధిత మహిళలు, వారి తరపున న్యాయపోరాటం చేస్తున్న ఆదివాసీ ఐక్యపోరాట సమితి, మానవహక్కుల వేదిక నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత మహిళల్లో ఇద్దరు మహిళలు ఇప్పటికే మృతి చెందారు. వివరాల్లోకి వెళితే..

వాకపల్లి గ్రామంలో మావోయిస్టు నేత తలదాచుకున్నారనే సమాచారంపై 2007 ఆగస్టు 20న తెల్లవారుజామున ఐదు గంటల ప్రాంతంలో కూంబింగ్ పోలీసులు ఆగ్రామాన్ని చుట్టుముట్టి ఇంటింటినీ తనిఖీ చేశారు. ఆ సమయంలో మగవాళ్లంతా పొలం పనులకు వెళ్లిపోగా, మహిళలు మాత్రమే ఇళ్లలో ఉన్నారు. ఈ క్రమంలో కూంబింగ్ పోలీసులు, మహిళల మధ్య పెద్ద యుద్ధమే జరిగింది. తమపై కూంబింగ్ పోలీసులు అత్యాచారం చేశారని ఆరోపిస్తూ మహిళలంతా పంచాయతీ కేంద్రం నుర్మతి గ్రామానికి వచ్చేశారు. అలాగే అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న లకే రాజారావుకు వాకపల్లివాసులు సమాచారం అందించారు.

పోలీసులు అత్యాచారం చేశారని మహిళల ఫిర్యాదు

వాకపల్లి మహిళలపై కూంబింగ్ పోలీసులు అత్యాచారానికి పాల్పడ్డారనే సమాచారం అందుకున్న ఎమ్మెల్యే లకే రాజారావు, మీడియా ప్రతినిధులు హుటాహుటిన నుర్మతి గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడున్న 11 మంది బాధిత మహిళలు, తమపై పోలీసులు అత్యాచారానికి పాల్పడ్డారని వివరించారు. బాధితులు అప్పటి ఐటీడీఏ పీవో శరత్, సబ్‌కలెక్టర్ లోకేశ్‌కుమార్‌లకు కూడా ఫిర్యాదు చేశారు. తర్వాత వాకపల్లి బాధిత మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ ఐక్యపోరాట సమితి ఆధ్వర్యంలో పాడేరులో రిలే, ఆమరణ నిరాహార దీక్షలు, ఏజెన్సీ వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు జరిగాయి. బాధిత మహిళలు సైతం అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి వద్దకు వెళ్లి తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు.

సుప్రీంకోర్టు నుంచి స్టే తెచ్చుకున్న పోలీసులు

తమపై 21 మంది కూంబింగ్ పోలీసులు అత్యాచారానికి పాల్పడ్డారని వాకపల్లికి చెందిన 11 మంది ఆదిమ జాతి గిరిజన మహిళలు హైకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్ స్వీకరించిన కోర్టు, మొత్తం పోలీసుల్లో 13 మంది మాత్రమే గ్రామంలోకి చొరబడ్డారని, మిలిగిన



ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టిన మహిళలు (ఫైల్ ఫొటో)

ఎనిమిది మంది పోలీసులు బయట ఉన్నారని, అందువల్ల ఈ కేసులో నిందితులుగా 13 మంది పోలీసులను మాత్రమే పరిగణిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. అయినప్పటికీ తమకు న్యాయం చేయమని బాధిత మహిళలు హైకోర్టుకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంలో వాకపల్లి మహిళలు తమపై హైకోర్టులో తప్పుడు కేసు వేశారని పేర్కొంటూ పోలీసులు సుప్రీంకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. దీంతో వాకపల్లి అత్యాచార ఘటనకు సంబంధించి హైకోర్టులో ఉన్న కేసు సుప్రీంకోర్టు స్టేతో పెండింగ్‌లో ఉండిపోయింది.

పదేళ్లయినా న్యాయం జరగలేదని మహిళల ఆవేదన

తమకు అన్యాయం జరిగిందని పదేళ్లుగా న్యాయపోరాటం చేస్తున్నా న్యాయం జరగలేదని వాకపల్లి బాధిత మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే బాధిత మహిళల తరపున న్యాయపోరాటం చేస్తున్న ఆదివాసీ ఐక్యపోరాట సమితి, మావన హక్కుల వేదిక నేతలు కూడా పాలకుల తీరుపై పెదవి విరుస్తున్నారు. తమకు అన్యాయం జరిగిందని గిరిజన మహిళలు బాహ్యప్రపంచానికి వచ్చి వేడుకున్నా.. పదేళ్లుగా న్యాయం జరగకపోవడం అన్యాయమని ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి.

మొరాయించిన జీఎస్టీ పోర్టల్

ఆందోళన చెందుతున్న వ్యాపారులు

అప్రమత్తమైన కేంద్రం

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): జీఎస్టీపై తలలు పట్టుకుంటున్న వ్యాపారులకు కొత్త సమస్య ఎదురైంది. వ్యాపార లావాదేవీల వివరాలు అప్‌లోడ్ చేసే జీఎస్టీ పోర్టల్ శనివారం మొరాయించింది. ఉదయం నుంచి లక్షలాది మంది వ్యాపారులు రిటర్న్స్ దాఖలు చేయడానికి ప్రయత్నించడంతో పోర్టల్ జామ్ అయింది. జూలై నెల రిటర్న్స్‌ను ఈనెల 20లోగా దాఖలు చేయాల్సి వుంది. రిటర్న్స్ కోసం ఈనెల 14 నుంచి జీఎస్టీ పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. వ్యాపారులు ఎక్కువ మంది చివరి రెండురోజుల్లోనే రిటర్న్స్ దాఖలు చేయడం అలవాటుగా వస్తోంది. వ్యాట్ అమలులో వున్నప్పుడు ప్రతి రాష్ట్రానికి ఒక వెబ్‌సైట్ వుండేది. దీంతో వ్యాపారులు ఇబ్బంది లేకుండా రిటర్న్స్ దాఖలు చేసేవారు. అయితే జూలై ఒకటి నుంచి జీఎస్టీ అమలులోకి రావడంతో దేశవ్యాప్తంగా ఒకటే వెబ్‌సైట్ అందుబాటులోకి తెచ్చారు. జూలై నెల వ్యాపార లావాదేవీలపై మొత్తం వివరాలు, చెల్లించాల్సిన పన్ను వివరాలతో కూడిన రిటర్న్స్‌ను 20లోగా అప్‌లోడ్ చేయాలి. దీంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది వ్యాపారులు పోర్టల్‌లో లాగిన్ కావడానికి ప్రయత్నించడంతో మొరాయించింది. రిటర్న్స్ దాఖలకు ఆదివారం రాత్రితో గడువు ముగియనున్న నేపథ్యంలో లక్షలాది మంది వ్యాపారులలో టెన్షన్ ఎక్కువైంది. పోర్టల్ జామ్ అయిన విషయాన్ని పన్నుల విభాగం అధికారులకు వ్యాపారులు నివేదించారు. వెంటనే జీఎస్టీ ప్రధాన కార్యాలయం ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఇంకా సమాచారం రావాల్సి వుందని పన్నుల విభాగం విశాఖ జాయింట్ కమిషనర్ కె.నాగేంద్ర పేర్కొన్నారు.

25 వరకు గడువు..

జీఎస్టీ పోర్టల్ మొరాయించిన నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. వ్యాపారుల ఆందోళనలను పరిగణనలో తీసుకున్న కేంద్రం, పన్ను చెల్లింపులు, రిటర్న్స్ దాఖలకు ఈనెల 25 వరకు గడువిచ్చింది. ఈ మేరకు శనివారం రాత్రి జీఎస్టీ ఉన్నతాధికారుల నుంచి రాష్ట్ర పన్నుల విభాగానికి సమాచారం అందింది.

తెరుచుకోని పేట్రాయి జీయూపీ పాఠశాల

- ఉపాధ్యాయ నియామకంలో అధికారుల నిర్లక్ష్యం
- దిక్కుతోచని స్థితిలో గిరిజన విద్యార్థులు




పేట్రాయి జీయూపీ పాఠశాల,వార్డు మెంబర్, కొర్రాబలరామ్, గ్రామస్థుడు ఫాంగిదెబో

సీలేరు: వేసవి సెలవుల అనంతరం ఇప్పటివరకు పేట్రాయి జీయూపీ పాఠశాల తెరుచుకోకపోవంతో గిరిజన విద్యార్థులు విద్యకు దూరమై పోతున్నారని, పేట్రాయి వార్డు మెంబరు కొర్రా బలరామ్, గ్రామస్థుడు పాంగి దెబో ఆందోళన చెందుతున్నారు. జీకే వీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధి లోని పేట్రాయిలో జీయూపీ పాఠశాల కొన్నేళ్లుగా కొనసాగుతోంది.

ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ ఉన్న ఈ ప్రభుత్వ పాఠశాలలో 35 నుంచి 40 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. గత ఏడాది కూడా ఈ పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయుడిని అధికారులు నియమించక పోవడంతో అదే గ్రామానికి చెందిన యువకుడు సీఆర్‌టీగా పని చేశాడు. నాలుగు నెలలు పనిచేసినా జీతాలు ఇవ్వకపోవడంతో వేసవి సెలవుల అనంతరం మానేశాడు. ఈ ఏడాది వేసవి సెలవుల అనంతరం ఇప్పటి వరకూ ఈపాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించకపోవడంతో ఈపాఠశాల తెరుచుకోలేదు. ఇటీవల ముగిసిన బదిలీల ప్రక్రియ తరువాత కూడా ఈపాఠశాలకు ఏ ఉపాధ్యాయుడు కూడా వచ్చి పాఠశాలను ప్రారంభించిన దాఖలాలు లేవని గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు అధికార్లను ప్రశ్నిస్తున్నారు.

రెండు నెలలుగా పేట్రాయి జీయూపీ పాఠశాలలో చదువుకుంటున్న సుమారు 35 మంది పైబడి విద్యార్థులు విద్యకు దురమై పోయారని వాపోతున్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి పేట్రాయి జీయూపీ పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతున్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

దక్షిణ మధ్య రైల్వే విజయవాడ విభాగం సీనియర్ సెక్యూరిటీ కమిషనర్ గాంధీ



విలేకరులతో మాట్లాడుతున్న గాంధీ

అనకాపల్లిటౌన్: రైలు ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ విభాగం సీనియర్ సెక్యూరిటీ కమిషనర్ ఎస్.ఆర్.గాంధీ తెలిపారు. శనివారం ఆయన స్థానిక రైల్వేస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. విజయవాడ డివిజన్‌లో నేరాల సంఖ్య బాగా తగ్గిందన్నారు.

గత ఏడాది మూడు బంగారు వస్తువులు స్నాచింగ్ కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఏమీ లేవన్నారు. విజయవాడ డివిజన్‌లో ప్రధాన రైల్వేస్టేషన్లలో నేరాల నియంత్రణలో భాగంగా సీసీ కెమెరాలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రెండు నెలల వ్యవధిలో 60 మంది హోంగార్డులను పోలీసుశాఖ నుంచి తీసుకొని విజయవాడ, కాకినాడ, రాజమహేంద్రవరం, సామర్లకోట స్టేషన్లకు కేటాయించనున్నామన్నారు. ప్రస్తుతంలో రైల్వేలో స్వచ్ఛ భారత్ పక్షోత్సవాలు జరుగుతున్నాయన్నారు. రోజు వారీగా స్టేషన్ పరిశుభ్రత, క్వార్టర్స్, స్టేషన్ పరిసరాలు,స్వచ్ఛభారత్‌పై ప్రయాణికులకు అవగాహన కల్పించడం, స్వచ్ఛమైన తాగునీరు అందించడం, రైళ్లలో పరిశుభ్రత, స్టేషన్‌లోని క్యాంటీన్‌లలో పరిశుభ్రతకు అవకాశం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నామనారు.

రైళ్లలో గంజాయి రవాణా నియంత్రణపై ప్రత్యేక సిబ్బందితో నిఘా విస్తృతం చేశామని ఆయన చెప్పారు. స్టేషన్ సూపరింటెండెంట్ కొమ్ముశెట్టి పార్థసారథి, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ శ్రీనివాసరావు ఉన్నారు.

బస్ స్టేషన్లలో మినీ థియేటర్ల ఏర్పాటుకు నిర్ణయం

విశాఖపట్నం: ఆర్టీసీ విశాఖ రీజియన్ పరిధిలోని చింతపల్లి, వి.మాడుగుల, యలమంచిలి బస్ స్టేషన్లలో మినీ థియేటర్ల ఏర్పాటుకు ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించింది. ఈ మూడు బస్ స్టేషన్ల ఖాళీ స్థలాల్లో మినీ థియేటర్లు ఏర్పాటు చేయడం ద్వారా అదనపు ఆదాయం రాబట్టుకోవాలన్న ఉద్దేశంతో ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. వీటి కోసం టెండర్లను కూడా ఆహ్వానించింది. ఈ టెండర్‌ను డౌన్‌లోడ్ చేసేందుకు ఈనెల 21 తుది గడువుగా ప్రకటించింది. మరుసటి రోజు మధ్యాహ్నం రెండు గంటల లోగా టెండర్ దాఖలు చేయాల్సి ఉంటుందని రీజనల్ మేనేజర్ జి.సుదేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

గ్లిసరీడియా మొక్కలపై అవగాహన

నైరా కళాశాల విద్యార్థుల ప్రచారం



చూచుకొండలో గ్లిసరీడియా మొక్కలు నాటుతున్న దృశ్యం

మునగపాక: గ్లిసరీడియా మొక్కలు పెంచి వాటి ఆకులను ఎరువుగా ఉపయోగించుకోవడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చునని నైరా కళాశాల విద్యార్థులు సూచించారు. చూచుకొండ గ్రామంలో శనివారం శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన నైరా కళాశాల విద్యార్థినులు పని అనుభవంలో భాగంగా గ్లిసరీడియా మొక్కల ప్రయోజనం కోసం వివరించారు. ఈమొక్కలను ప్రభుత్వం అటవీశాఖ ద్వారా ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. ఆధార్‌కార్డు తీసుకువెళితే రెండు మొక్కలు ఉచితంగా ఇస్తారని తెలిపారు. ఈ మొక్కలను పొలం గట్లపై పెంచుకొని వాటి ఆకులను ఎరువుగా ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువుల కంటే ఈ గ్లిసరీడియా ఆకులు మంచి ఎరువుగా ఉపయోగపడుతుందని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటకోట నర్సింగరావు, రామకృష్ణ, నైరా కళాశాల విద్యార్థినీలు పాల్గొన్నారు.

సెజ్‌కు భూములు ఇవ్వం

ఏపీఐఐసీ అధికారులకు తేల్చిచెప్పిన గొరపూడి పంచాయతీ వాసులు ఎస్‌డీసీకి వినతి



గ్రామ పెద్దలు, రైతులతో చర్చిస్తున్న ఏపీఐఐసీ ఎస్‌డీసీ సత్తిబాబు



భూములు ఇవ్వమని తీర్మాన పత్రాన్ని ఎస్‌డీసీకి అందజేస్తున్న గ్రామ పెద్దలు

రాంబిల్లి: సెజ్ కోసం తమ భూములు ఇచ్చేది లేదని గొరపూడి పంచాయతీ ప్రజలు ఏపీఐఐసీ అధికారులకు తేల్చి చెప్పారు. గొరపూడి పంచాయతీలోని 12 బ్లాక్‌ల పరిధిలో సుమారు 417 ఎకరాలు సెజ్‌కు భూసేకరణ కోసం ఏపీఐఐసీ అధికారుల బృందం అప్పన్నపాలెం కాలనీలోని కమ్యూనిటీ హాలులో శనివారం అవార్డు ఎంక్వయిరీ నిర్వహించింది. తొలుత ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ సత్తిబాబు సెజ్‌కు ఈ పంచాయతీలో తీసుకున్న భూముల వివరాలు, ప్రభుత్వం, రైతుల భూములకు కొత్తయాక్ట్ ప్రకారం ఇచ్చే నష్టపరిహారం వివరాలను తెలిపారు. ఇదివరకే సెజ్‌కు తీసుకోదలచిన భూములకు సంబంధించి సదరు రైతులకు నోటీసులు జారీచేశామని, ఈ విషయమై అవార్డు ఎంక్వయిరీ చేయడానికి వచ్చామని ఆయన తెలిపారు.2013 కొత్త యాక్ట్ ప్రకారం జిరాయతీకి ఎకరాకు రూ.15.20 లక్షల నష్టపరిహారం ఇస్తామని, ఈ పరిహారం పొందేందుకు రైతులు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ విషయమై స్థానిక మాజీ సర్పంచ్ లాలం నాయుడుబాబు, ప్రముఖ వైద్యులు గొర్లె సత్యన్నారాయణలు మాట్లాడుతూ ఇదివరకే సెజ్ ఏర్పాటుకు వేలాది ఎకరాలు రైతుల భూములను తీసుకున్నారన్నారు. వాటిలో పూర్తిస్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు చేయలేదన్నారు. కొత్తగా తమ జీవనాధారమైన వ్యవసాయ భూములను తీసుకోవడానికి నోటీసులు జారీచేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ప్రకటిస్తున్న ప్యాకేజీలో స్పష్టత లేదని ఎట్టి పరిస్థితుల్లోను తమ భూములు ఇచ్చేది లేదన్నారు. ఈ మేరకు గ్రామస్థుల మంతా తీర్మానించా మన్నారు. ఈ విషయమై ప్రముఖ వైద్య నిపుణులు గొర్లె సత్యన్నారాయణ ద్వారా వచ్చిన ప్రముఖ న్యాయవాది ఎల్.శ్రీనివాస్ రైతుల సమస్యలను అధికారులకు వివరించారు.అనంతరం రైతులు భూములు ఇవ్వమని తీర్మానించుకున్న పత్రాన్ని ఎస్‌డీసీ సత్తిబాబుకు అందజేశారు. దీనిపై సత్తిబాబు మాట్లాడుతూ ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డిప్యూటీ తహసీల్దార్ అర్జునరావు,మహేశ్వరావులు,ఏపీఐఐసీ సిబ్బంది, టీడీపీ నాయకులు లాలం తాతబాబు, గ్రామ ఉపసర్పంచ్ శెట్టి అప్పారావు,గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

మహిళలు ఉద్యోగ, ఉపాధిలో ముందంజ వేయాలి

కేంద్ర మంత్రి సుజనాచౌదరి



విశాఖపట్నం: మహిళలు ఉద్యోగ ఉపాధి రంగాల్లో ముందంజ వేయాలని కేంద్ర మంత్రి సుజనాచౌదరి అన్నారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి సుజనా మాట్లాడుతూ చదువుకున్న యువతులు ఇంటికే పరిమితమవుతున్నారని అన్నారు. యువతులు ఉద్యోగాలు చేయాలని, పది మందికీ ఉపాధి ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. ఇందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. అలాగే విలేకరుల అడిగిన ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ నంద్యాల ఎన్నికల్లో డబ్బులు వెదజల్లుతున్నామనేది ప్రతిపక్షాల దుష్ప్రచారం అని అన్నారు. ఎన్నికల సమయంలో ఇలాంటి ప్రచారాలు పట్టించు కోకూడదని అన్నారు. నిజాయితీగా గెలవడమే తమ లక్ష్యమన్నారు. మూడేళ్లలో పదమూడు జిల్లాలను ఎంతో అభివృద్ధి చేశామనారు. తెలుగుదేశం కార్యాలయం నూతన భవనాన్ని మంత్రి సుజనా శనివారం తెలిసారిగా సందర్శించారు. సీఎం చాంబర్, కాన్ఫరెన్స్ హాల్, మంత్రుల కార్యాలయాలు, ఇతర గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

నార్త్‌జోన్ దివ్యాంగుల క్రికెట్ పోటీల విజేత విశాఖ



విశాఖ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సౌత్ ఏసీపీ జె.రామ్మోహనరావు

ఉక్కుటౌన్‌షిప్: నార్త్‌జోన్ దివ్యాంగుల క్రికెట్ ట్రోఫీని విశాఖ జట్టు కైవసం చేసుకుంది. రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ క్రీడా మైదానంలో జరుగుతున్న ఈ పోటీల్లో శనివారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. విశాఖపట్నం జట్టు తూర్పుగోదావరి జట్టుపై నిర్ణిత 15 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 184 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్ చేసిన తూర్పుగోదావరి జట్టు నిర్ణిత 15 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 121 పరుగులు చేసి ఓటమి పాలైంది. ముగింపు కార్యక్రమానికి సౌత్ ఏసీపీ జె.రామ్మోహనరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేత జట్టుకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉక్కు క్రీడా విభాగాధిపతి ఎం.ఎస్.కుమార్, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాటం ఎస్ చంద్రరావు, దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మదుసూదన్ నాయక్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.అన్నేష్, దువ్వాడ, గాజువాక క్రైం సీఐలు ఎన్.సాయి. పైడపునాయుడు, ఉక్కు క్రీడా విభాగం అధికారులు క్రాంతికుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

What are the total marks scored...

QUANTITATIVE APTITUDE



B. Krishna Kishore
Senior Faculty
Dimensions Coaching
Centre, Guntur.

RRB, PO's & Clerks Special

Direction (1-5) : What value should come in place of the question mark (?) in the following questions?

1. $\frac{\sqrt{4356}\times\sqrt{?}}{\sqrt{6084}}=11$
   (1) 196 (2) 125 (3) 169 (4) 225 (5) 81
2. $4\frac{1}{2}+\left(1\div 2\frac{8}{9}\right)-3\frac{1}{13}=?$
   (1) $\frac{23}{13}$ (2) $\frac{13}{23}$ (3) $\frac{25}{13}$ (4) $\frac{25}{26}$
   (5) None of these
3. $\left\{(441)^{\frac{1}{2}}\times 207\times(343)^{\frac{1}{3}}\right\}\div\left\{(14)^2\times(529)^{\frac{1}{2}}\right\}=?$
   (1) 5.75 (2) 6.75 (3) 7.75 (4) 6.25 (5) 6.50
4. –676.76 + 1237 + 897.34 – ? = 1294.25
   (1) 168.2 (2) 164.2 (3) 154.2 (4) 164.8
   (5) None of these
5. $\frac{(22\times5+8^2+4^2)^2}{12\times25\times6+36\times2}+\frac{85\times240\times750}{51\times8\times100}+\frac{800\times289}{17\times25}$
   = ?
   (1) 1360 (2) 1177 (3) 1470 (4) 1280 (5) 1170

Direction (6-10): Study the following table carefully and answer the given questions. Table shows the percentage of marks scored by five different students in six different subjects.

Student→ Marks ↓	Math (150)	English (120)	Reasoning (50)	Computer (50)	Marketing (100)	GS (200)
Lucky	64%	65%	52%	60%	77%	49.5%
Priti	70%	50%	56%	58%	57%	54.5%
Kumkum	65%	75%	70%	54%	63%	57%
Alka	48%	55%	64%	56%	71%	61%
Poonam	56%	40%	48%	46%	53%	52.5%

6. What are the total marks scored by Priti in all the six subjects together?
   (1) 378 (2) 386 (3) 388 (4) 398 (5) None of these
7. What is the average marks scored in Reasoning by all the students?
   (1) 26 (2) 27 (3) 28 (4) 29 (5) None of these
8. Marks scored by Kumkum in Computer is **approximately** what percentage of marks scored by Alka in English?
   (1) 42% (2) 41% (3) 40% (4) 39%
   (5) None of these
9. What is the difference between the total marks scored by Lucky in Reasoning and Kumkum in GS and total marks scored by Priti in Reasoning and Alka in Math?
   (1) 80 (2) 100 (3) 90 (4) 120 (5) None of these
10. What is the aggregate **approx** percentage of Poonam considering all the six subjects?
    (1) 47% (2) 54% (3) 57% (4) 50%
    (5) None of these

Direction (11-15) : What will come in place of question mark (?) in the following number series.

11. 3 11 ? 115 567 3411
    (1) 25 (2) 27 (3) 42 (4) 37 (5) 33
12. 326.34375 219.0625 90.125 29.25 11 ?
    (1) 9 (2) 8 (3) 5.5 (4) 7.5 (5) 6.5
13. 5 4 23 7 3 24 9 2 ? 11 1 14
    (1) 29 (2) 31 (3) 20 (4) 21 (5) 25
14. 19 35 89 217 ? 899
    (1) 429 (2) 431 (3) 420 (4) 421 (5) 467
15. 19 29 47 77 125 ?
    (1) 235 (2) 283 (3) 200 (4) 220 (5) 225
16. A tank is fitted with 8 pipes, some of them that fill the tank and other pipes are meant to empty the tank. Each pipe that fills the tank can fill it in 8 hours, while each of those that empty the tank can empty it in 6 hours. All the pipes are kept open. When the tank is full, it will take exactly 6 hours for the tank to empty. How many pipes are filling the tank?
    (1) 4 (2) 3 (3) 6 (4) 2 (5) None of these
17. Wheels of diameters 7 cm and 14 cm start rolling simultaneously form X and Y, 1980 cm apart, towards each other in opposite directions. Both of them make same number of revolutions per second. If both of them meet after 10 second, then find the speed of the smaller wheel.
    (1) 32 cm/s (2) 42 cm/s (3) 56 cm/s
    (4) 66 cm/s (5) 44 cm/s
18. There is a ring road connecting points P, Q, R and S. The road is in a complete circular form but having several approach roads leading to the centre. Exactly in the centre of the ring road there is a tree which is 20 Km from Point P on the circular road. You have taken a round of circular road starting from point P and finish at the point after touching points Q, R and S. You then drive 20 km interior towards the tree from point P and from there, reach somewhere in between Q and R on the ring road. How much distance do you have to travel from the tree to reach the point between Q and R on the ring road?
    (1) 35 km (2) 42 km (3) 20 km (4) 25 km
    (5) None of these

Answers With Explanation

(1-5) :


1. (3) $\frac{\sqrt{4356}\times\sqrt{?}}{\sqrt{6084}}=11$
   $\Rightarrow \frac{66\times\sqrt{?}}{78}=11$
   $\Rightarrow \sqrt{?}=\frac{78\times11}{66}=13$
   $\therefore$? = 169
2. (1) $4\frac{1}{2}+\left(1\div2\frac{8}{9}\right)-3\frac{1}{13}=?$
   $=\frac{9}{2}+\left(1\times\frac{9}{26}\right)-\frac{40}{13}$
   $=\frac{9}{2}+\frac{9}{26}-\frac{40}{13}$
   $=\frac{117+9-80}{26}$
   $=\frac{46}{26}=\frac{23}{13}$
3. (2) $\left[(441)^{\frac{1}{2}}\times207\times(343)^{\frac{1}{3}}\right]\div\left[(14)^2\times(529)^{\frac{1}{2}}\right]$
   $=(21\times207\times7)\div(196\times23)$
   $=\frac{21\times207\times7}{196\times23}=6.75$
4. (5) – 676.76 + 1237 + 897.34 – ? = 1294.25
   ⇒ 1457.58 – ? = 1294.25
   ⇒ ? = 1457.58 – 1294.25
   = 163.33
5. (4) $\frac{(22\times5+8^2+4^2)^2}{12\times25\times6+36\times2}+\frac{85\times240\times750}{51\times8\times100}+\frac{800\times289}{17\times25}$
   $=\frac{(110+64+16)^2}{100}+375+544$
   $=\frac{36100}{100}+919$
   = 919 + 361 = 1280

(6-10) :


6. (3) Required total
   $=150\times\frac{70}{100}+120\times\frac{50}{100}+50\times\frac{56}{100}+50\times\frac{58}{100}+100\times\frac{57}{100}+200\times\frac{54.5}{100}$
   = 105 + 60 + 28 + 29 + 57 + 109
   = 388
7. (4) Required average
   $=\frac{50}{5\times100}\times(52+56+70+64+48)$
   $=\frac{1}{10}\times290$
   = 29
8. (2) Required percentage (%)
   $=\left[\frac{50\times\frac{54}{100}}{120\times\frac{55}{100}}\times100\right]\%$
   $=\left(\frac{27}{66}\times100\right)\%$
   = 40.90% ≈ 41%
9. (5) Required difference
   $=\left(50\times\frac{52}{100}+200\times\frac{57}{100}\right)-\left(50\times\frac{56}{100}+150\times\frac{48}{100}\right)$
   = (26 + 114) – (28 + 72)
   = 140 – 100 = 40
10. (4) Total marks obtained by Poonam
    $=150\times\frac{56}{100}+120\times\frac{40}{100}+50\times\frac{48}{100}+50\times\frac{46}{100}+100\times\frac{53}{100}+200\times\frac{52.5}{100}$
    = 84 + 48 + 24 + 23 + 53 + 105
    = 337
    $\therefore$ Required % $=\left(\frac{337}{670}\times100\right)\%$
    = 50.29 %
    ≈ 50%

(11-15) :

11. (2) The number series is as follows:
    3 × 2 + 5 = 11
    11 × 3 – 6 = **27**
    27 × 4 + 7 = 115
    115 × 5 – 8 = 567
    567 × 6 + 9 = 3411
12. (4) The number series is as follows:
    326.34375 ÷ 1.5 + 1.5 = 219.0625
    219.0625 ÷ 2.5 + 2.5 = 90.125
    90.125 ÷ 3.5 + 3.5 = 29.25
    29.25 ÷ 4.5 + 4.5 = 11
    11 ÷ 5.5 + 5.5 = **7.5**
13. (4) The number series is as follows:
    5 × 4 + 3 = 23
    7 × 3 + 3 = 24
    9 × 2 + 3 = **21**
    11 × 1 + 3 = 14
14. (5) The number series is as follows :
    $19+2\times2^3=35$
    $35+2\times3^3=89$
    $89+2\times4^3=217$
    $217+2\times5^3=$ **467**
    $467+2\times6^3=899$
15. (3) The number series is as follows:



16. (1) Let the no. of filler pipe = x
    $\therefore$ No. of empty pipe = $8-x$
    ATQ, $\frac{8-x}{6}-\frac{x}{8}=\frac{1}{6}$
    $\Rightarrow \frac{4(8-x)-3x}{24}=\frac{1}{6}$
    $\Rightarrow 32-4x-3x=4$
    $\Rightarrow 7x=28$
    $\Rightarrow x=4$
17. (4) Let the speed of smaller wheel = x c.m/s
    In 10 sec, it will cover $10x$ cm.
    $\therefore$ Distance covered by the smaller wheel in one revolution
    $=2\times\frac{22}{7}\times3.5=22$ cm
    $\therefore$ No. of revolutions made by smaller wheel in 10 sec
    $=\frac{10x}{22}=\frac{5x}{11}$ .... (i)
    Distance covered by bigger wheel in 10 sec = $(1980-10x)$ cm
    $\therefore$ No. of revolutions made by bigger wheel in 10 sec $=\frac{1980-10x}{44}$ ....(ii)
    ATQ,
    $\frac{5x}{11}=\frac{1980-10x}{44}$
    $\Rightarrow 20x+10x=1980$
    $\Rightarrow 30x=1980$
    $\Rightarrow x=\frac{1980}{30}=66$ cm/sec.
18. (3)



Clearly, radius of the circle is 20 km.
Hence, One has to cover a distance of 20 km to reach a point between Q and R.

ఉద్యోగాలు

ఓఎన్‌జిసి

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఒఎన్‌జిసి) - నెట్ 2017 ద్వారా **ఇ 1 లెవెల్ ఎగ్జిక్యూటివ్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది
మొత్తం ఖాళీలు: 27
హ్యూమన్ రిసోర్స్ ఎగ్జిక్యూటివ్ ఖాళీలు: 20
అర్హత: 60 శాతం మార్కులతో ఎంబీఏ(పర్సనల్ మేనేజ్‌మెంట్/ హెచ్ఆర్‌డి/ హెచ్ఆర్ఎం)/ పీజీ (పర్సనల్ మేనేజ్‌మెంట్/ ఐఆర్/ లేబర్ వెల్ఫేర్)/ రెండేళ్ల పీజీ డిప్లొమా(పిఎం/ ఐఆర్/ లేబర్ వెల్ఫేర్) ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: జనవరి 1 నాటికి 30 ఏళ్లు మించరాదు
యుజిసి నెట్ సబ్జెక్ట్: లేబర్ వెల్ఫేర్/ పర్సనల్ మేనేజ్‌మెంట్/ ఇండస్ట్రియల్ రిలేషన్స్/ లేబర్ అండ్ సోషల్ వెల్ఫేర్/ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (సబ్జెక్ట్ కోడ్ 55)/ మేనేజ్‌మెంట్(సబ్జెక్ట్ కోడ్ 17)
ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ ఖాళీలు: 5
అర్హత: 60 శాతం మార్కులతో ఎంబీఏ(ఫైనాన్స్) పూర్తిచేసి ఉండాలి
వయసు: జనవరి 1 నాటికి 30 ఏళ్లు మించరాదు
యుజిసి నెట్ సబ్జెక్ట్: మేనేజ్‌మెంట్(సబ్జెక్ట్ కోడ్ 17)
అఫీషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్ ఖాళీలు: 2
అర్హత: 60 శాతం మార్కులతో పీజీ(హిందీ) పూర్తి చేసి ఉండాలి. డిగ్రీలో ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. ట్రాన్స్‌లేషన్ వర్క్‌లో అనుభవం ఉండాలి.
వయసు: జనవరి 1 నాటికి 40 ఏళ్లు మించరాదు
యుజిసి నెట్ సబ్జెక్ట్: హిందీ(సబ్జెక్ట్ కోడ్ 20)
ఎంపిక: యుజిసి నెట్(నవంబర్ 2017) స్కోరు, అకడమిక్ మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
అభ్యర్థులు ముందుగా యుజిసి నెట్ 2017కు దరఖాస్తు చేసుకొని రిజిస్ట్రేషన్/ రోల్ నెం వచ్చిన తరవాతనే ఒఎన్‌జిసికి అప్లయ్ చేసుకోవాలి
యుజిసి నెట్ 2017 ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 11
యుజిసి నెట్ 2017 : నవంబరు 5
యుజిసి నెట్ వెబ్‌సైట్ : http://cbsenet.nic.in
ఒఎన్‌జిసి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 21 నుంచి
ఒఎన్‌జిసి ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 19
ఒఎన్‌జిసి ఇంటర్వ్యూలు: 2018 జనవరిలో
వెబ్‌సైట్: www.ongcindia.com

ఎన్ఎఫ్ఎల్

నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్(ఎన్ఎఫ్ఎల్)- **మేనేజ్‌మెంట్ ట్రైనీస్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 36
విభాగాలవారీ ఖాళీలు: హెచ్ఆర్ 12, మార్కెటింగ్ 24
వయసు: ఆగస్టు 31 నాటికి 29 ఏళ్లు మించరాదు
అర్హత: 60 శాతం మార్కులతో (ఎంబీఏ/ పీజీ డిగ్రీ/ డిప్లొమా) (పర్సనల్ మేనేజ్‌మెంట్ & ఇండస్ట్రియల్ రిలేషన్స్/ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్/ హెచ్ ఆర్)/ ఎమ్మెస్సీ(అగ్రికల్చర్)/ (ఎంబీఏ/ పీజీడీబీఎం) (మార్కెటింగ్/ అగ్రి బిజినెస్ మార్కెటింగ్ / ఇంటర్నేషనల్ మార్కెటింగ్ / రూరల్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణులై ఉండాలి.
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 23న
పరీక్ష కేంద్రం: హైదరాబాద్ తదితర ప్రధాన నగరాలు
దరఖాస్తు ఫీజు: రూ.735(ఎస్సీ/ ఎస్టీ/ ఎక్స్ సర్వీస్‌మెన్/ దివ్యాంగులు/ డిపార్టుమెంటల్ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంది)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 6
వెబ్‌సైట్: www.nationalfertilizers.com

ఎన్ఎల్ఎస్ఐయు

నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ (ఎన్ఎల్ఎస్ఐయు)- కింది **డిస్టెన్స్ ఎడ్యుకేషన్** కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
కోర్సులు: రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ లాస్ (ఎంబిఎల్) ప్రోగ్రామ్, ఏడాది పీజీ డిప్లొమా (హ్యూమన్ రైట్స్ లా/ మెడికల్ లా & ఎథిక్స్/ ఎన్విరాన్‌మెంటల్ లా/ ఇంట లెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ లా/ ఛైల్డ్ రైట్స్ లా/ కన్స్యూమర్ లా & ప్రాక్టీస్/ సైబర్ లా& సైబర్ ఫోరెన్సిక్)
అర్హత: డిగ్రీ పూర్తిచేసి ఉండాలి
దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31
వెబ్‌సైట్: http://ded.nls.ac.in

అప్రమత్తత లేకుంటే ప్రాణాపాయం

'దండయాత్ర' చేస్తున్నా ఆగని దోమల వ్యాప్తి

పరిసరాల పరిశుభ్రతే కీలకం

అవగాహనతో జ్వరాలు దూరం

నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం

దోమతో జరభద్రం





(విశాఖపట్నం)

చిన్న దోమే కదా..ఏముందిలే అని అశ్రద్ధ చేస్తే ప్రాణాలు హరించుకుపోతాయి. ఊరూ.. వాడా ఎక్కడికక్కడే జనావాల మధ్యలోనే ఉంటూ పెద్ద సమస్యను తెచ్చిపెడుతున్నాయి. వర్షాలు మొదలవడంతోపాటు దోమలు ముసురుకుంటాయి. ఇంటా బయటా అనే తేడా లేకుండా స్వైర విహారం చేస్తున్నాయి. చిన్న దోమలు పెద్ద గుంపులుగా జనంపై దండయాత్ర చేస్తూ ప్రాణాంతక మలేరియా, డెంగీ, చికున్‌గన్యా వంటి జ్వరాల వ్యాప్తికి కారణ భూతమవుతున్నాయి. పెద్ద వర్షాలు కురవకుండా చిన్నపాటి చినుకులు కురిస్తే పరిసరాల్లో నీటికుంటలు, మరుగు కాలువల్లో దోమలు పుట్టుకొచ్చి జనాన్ని పీల్చిపిప్పి చేస్తాయి. జిల్లాలో ప్రస్తుతం అడపాదడపా కురుస్తుండడం, దీనికితోడు దోమల నివారణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు అంతంత మాత్రంగా ఉండడం వంటి అనేక కారణాలతో చిన్న దోమతో మానవాళికి పెద్ద సమస్యలు తప్పడంలేదు. నేడు 'ప్రపంచ దోమల నివారణ దినోత్సవం' సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం



మలేరియా

జూన్ ప్రారంభం నుంచి అక్టోబర్ వరకు మలేరియా వ్యాప్తి అధికంగా ఉంటుంది. ఆడ ఎనాఫిలస్ దోమ కుట్టడం వల్ల ఈ వ్యాధి ప్రబలుతుంది. 10 నుంచి 14 రోజుల వ్యవధిలో మలేరియా లక్షణాలు కన్పిస్తాయి.

లక్షణాలు

చలితో కూడిన జ్వరం తరచూ రావడం, తల తిరగడం, ఒళ్లు నొప్పులు అధికంగా ఉంటాయి. విపరీతంగా చెమట పడుతుంది. చాలా నీరసంగా ఉంటుంది. ఈ లక్షణాలు కనిపిస్తే ఆరోగ్య కేంద్రాలలో వైద్యుడిని సంప్రతించాలి.

జాగ్రత్తలు

నీటి తొట్టెలు, కుండీలు, ట్యాంకులను మూడు రోజులకు ఒకసారి శుభ్రం చేయాలి.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ సీసాలు, ఖాళీ టైర్లు, పాలిథన్ కవర్లు, ఇంటి ఆవరణల్లో లేకుండా చేయాలి.

ఏటికేడు పెరుగుతున్న మలేరియా



జిల్లాలో ఏటా మలేరియా జ్వరాల వ్యాప్తి పెరుగుతూనే ఉన్నా ప్రభుత్వ లెక్కల్లో మాత్రం మలేరియా మరణాలు కానరావు. జిల్లాలో 44.3 లక్షల జనాభా ఉండగా 86 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 36 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్న ఏజెన్సీ 11 మండలాల్లో సుమారు 6.8 లక్షల గిరిజన ప్రాంతాలను దోమలతో సంక్రమించే వ్యాధులు ఎక్కువగా ఉండే ప్రాంతాలుగా గుర్తించారు. జీవీఎంసీ పరిధిలోని 14.34 లక్షల జనాభా నివాసముంటున్న ప్రాంతాలను దోమలు వ్యాప్తిచెందే ప్రాంతాలుగా గుర్తించి దోమలపై దండయాత్ర పేరుతో ప్రభత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నా దోమల నివారణ సాధ్యం కావడం లేదనే చెప్పాలి.

చికిన్ గున్యా

ఆల్ఫా వైరస్ ద్వారా చికిన్ గున్యా వ్యాపిస్తుంది. తీవ్రమైన జ్వరం, విపరీతమైన కీళ్ల నొప్పులు, రోగిని బాధిస్తాయి. ఈ నొప్పులు నెల నుంచి ఏడాది వరకు ఉంటాయి.

జాగ్రత్తలు

ఇంటి పరిసరాలలో, మురుగు కాలువల్లో గంబూషియా చేపలను వదలడం, కిరోసిన్ చల్లడం ద్వారా దోమలు వృద్ధి చెందకుండా చేయవచ్చు. నీరు, ఆహారం కలుషితమవకుండా చూసుకోవాలి.

ఈ ఏడాది జులై నెలాఖరు వరకు జిల్లా అధికారులు మొత్తం 3,63,826 మందికి మలేరియా పరీక్షలు నిర్వహించగా మొత్తం 3,255 మందికి వ్యాధి నిర్ధారణ జరిగింది. దీన్నిబట్టి.. జిల్లాలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో దోమల కారణంగా వ్యాప్తిచెందే మలేరియా ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

సంవత్సరం	సేకరించిన రక్తపూతలు	మలేరియా కేసులు
2016	4,05,968	3971
2017	3,63,826	3,255

డెంగీ..

దోమల వల్ల ప్రబలే ప్రమాదకర జ్వరాల్లో డేంగీ ఒకటి. ఏడిస్ దోమ (ఏడిస్ ఈజిప్టు లేదా ఏడిస్ ఆల్ బాపిక్టస్) ద్వారా డెంగీ వ్యాపిస్తుంది. డెంగీ మూడు రకాలు.. సాధారణ జ్వరం, హెమరేజిక్ జ్వరం, షాక్ సింద్రోమ్.ఒకే రకమైన డెంగీ వైరస్ శరీరంలోకి ప్రవేశించినప్పుడు జ్వరం వస్తే ఐదు నుంచి ఏడు రోజుల్లోగా నయమవుతుంది. ఒకటి కంటే ఎక్కువ రకాల డెంగీ వైరస్ శరీరంలోకి ప్రవేశిస్తే డెంగీ హెమరేజిక్ జ్వరం వస్తుంది. దాని తీవ్రమైన స్థాయిని షాక్ సింద్రోమ్ అంటారు. బ్రేక్ జోన్ ఫీవర్‌గా పేర్కొంటారు.

లక్షణాలు..

అధిక జ్వరం, ఆకలి లేకపోవటం, వాంతులు, తీవ్రమైన తలనొప్పి, కీళ్లు, కండరాల నొప్పులు. 3 రోజుల కంటే ఎక్కువగా జ్వరం వస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

ఈ దోమ వృద్ధి చెందే ప్రాంతాలు

నీరు నిల్వ ఉండే ఇంటి పైకప్పు, ఇంటి పరిసరాల్లో మురికినీటి గుంటలు, ఇంట్లో ఉండే పూల కుండీలు, ఏసీ ట్రేలో ఉండే నీరు, బావుల్లోంచి నీరు తోడే బకెట్లు, నీరు వెళ్లే వాల్వులు, చెట్టు తొర్రలు, నీటిగొట్టాలు, రాలిన ఆకులు, మొక్కల మొదళ్లు,

చికిత్స ఇలా..

వ్యాధి లక్షణాలకు అనుగుణంగా వైద్యుడిని సంప్రతించి చికిత్స తీసుకోవాలి. దోమల నివారణకు నిటి నిల్వ ప్రాంతంలో గంబూషియా వంటి చిన్న చేపలను,పెంచాలి. ఫిస్టియా వంటి మొక్కలు ఈ దోమ పెరగడానికి దోహదపడతాయి. అందుకే ఆ మొక్కలను ఇంట్లో ఉంటే తీసివేయాలి.



అవగాహన కల్పిస్తున్నాం

పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలి. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాపించకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. గ్రామాల్లో, కాలనీల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, విద్యార్థులతో ర్యాలీలు, నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

ఆర్.జగదీశ్, కణితి పీహెచ్‌సీ వైద్యుడు



రెవెన్యూ ఉద్యోగులపై క్రిమినల్ కేసులు వద్దు

ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

విశాఖపట్నం, (ఆంధ్రజ్యోతి): విశాఖ భూకుంభకోణం ఆరోపణలపై సిట్ చేపడుతున్న విచారణలో రెవెన్యూ ఉద్యోగులపై క్రిమినల్ కేసులు పెట్టవద్దని, శాఖాపరమైన చర్యలు మాత్రమే తీసుకోవాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోషియేషన్ అధ్యక్షులు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు విశాఖ జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను కోరారు. నివారం విశాఖ వచ్చిన ఆయన జిల్లా జేఏసీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, రెవెన్యూ ఉద్యోగుల సంఘ ప్రతినిధులతో కలిసి కలెక్టర్, జేసీ సృజనను వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిట్ విచారణతో రెవెన్యూ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రెవెన్యూ అధికారులు జారీచేసిన పట్టాదారు పాసుపుస్తకాలు, సెటిల్‌మెంట్ ఆర్డర్స్, ఇనామ్ ఆర్డర్స్ వంటి వాటిలో ఏమైనా పొరపాట్లుంటే ఆయా రెవెన్యూ చట్టాల ప్రకారం అపీల్ చేసుకొనే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ ఉద్యోగులపై క్రిమినల్ కేసులు పెట్టవద్దని, శాఖాపరమైన చర్యలు చేపట్టాలని కోరామన్నారు. సిట్ విధానాలతో రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్, జేసీలకు వివరించగా సానుకూలంగా స్పందించారన్నారు.

కారుణ్య నియామకాలకు ఇకపై ఇంటర్మీడియట్ విద్యార్హతకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంగీకారం తెలపడం అభినందించదగ్గ విషయమని బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్హతతో జూనియర్ అసిస్టెంట్‌లుగా నియమించిన ఐదేళ్లలో డిగ్రీ పూర్తి చేసేలా ఉత్తర్వులు జారీ చేయడంతో రాష్ట్రంలో వివిధ శాఖలకు చెందిన పది లక్షల మంది ఉద్యోగులకు సీఎం మేలు చేశారని చెప్పారు.

ప్రేమోన్మాది కలకలం

ప్రేమను నిరాకరించిన యువతికి నిప్పు అంటించిన యువకుడు

యువతి సజీవ దహనం

రక్షించేందుకు యత్నించిన ఆమె సోదరుడు కూడా మృతి

రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఉన్మాది

మానసిక అపరిపక్వతే కారణమంటున్న మానసిక వైద్యనిపుణులు

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

ప్రేమను తిరస్కరించిందనే అక్కసుతో ఒక యువతిపై కిరోసిన్ పోసి సజీవదహనం చేసిన ప్రేమోన్మాది ఉదంతం నగరంలో తీవ్ర కలకలం రేపింది. అక్కను రక్షించే క్రమంలో ఆమె సోదరుడు కూడా మంటల్లో చిక్కుకున్నాడు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. తాను సరిదిద్దుకోలేని తప్పుచేశానని పశ్చాత్తాపం చెందాడో లేక సమాజం, కోర్టు వేసే శిక్షలను ఊహించుకుని భయపడ్డాడో గానీ ఉన్మాది కూడా రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని తగరపువలస టి.నగరపాలెంలో శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన చర్చనీయాంశంగా మారింది.

తగరపువలస సమీపంలోని టి.నగరపాలేనికి చెందిన పొట్నూరు రుక్మిణి అలియాస్ రూప (19) బాసర కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతోంది. తల్లిదండ్రులు చిన్నప్పుడే వదిలివెళ్లిపోవడంతో తమ్ముడు ఉపేంద్రతో కలిసి నగరపాలెంలోని చిన్నాన్న రవి ఇంట్లో వుంటోంది. రవి డాబాగార్డెన్స్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్‌లో ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నారు. రూపను ప్రేమిస్తున్నానంటూ తగరపువలసకు చెందిన పతివాడ హరిసంతోష్ (24) వెంటపడేవాడు. దీనిపై ఆమెతోపాటు ఆమె కుటుంబసభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో హరిసంతోష్ తట్టుకోలేకపోయాడు. ఎలాగైనా తనను ప్రేమించాల్సిందేనని పట్టుదలతో శనివారం మధ్యాహ్నం నగరపాలెంలో రూప వుంటున్న ఇంటికి వెళ్లాడు. ఆమె ఇంట్లో టీవీ చూస్తుండగా చిన్నబ్యాగు పట్టుకుని లోపలకు వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో రూపతోపాటు పదో తరగతి చదువుతున్న ఆమె తమ్ముడు ఉపేంద్ర వున్నాడు. రెండు నిమిషాల పాటు రూపతో హరిసంతోష్ మాట్లాడాడు. ఒక్కసారిగా తన బ్యాగ్‌లో వున్న డబ్బాను తీసి కిరోసిన్‌ను ఆమెపై పోసి నిప్పంటించి అక్కడి నుంచి పరారైపోయాడు. అక్క మంటల్లో చిక్కుకోవడంతో ఒక్కసారిగా అవాక్కయిన ఉపేంద్ర ఆమెను రక్షించేందుకు యత్నించడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మంటల తీవ్రతకు ఇంట్లోని టీవీ ఒక్కసారిగా పేలడంతో పెద్దశబ్దం వచ్చింది. దీంతో సమీపంలోని ఇళ్లలోని వారంతా రూప వుంటున్న ఇంటికి వచ్చి చూసేసరికి మంటల్లో ఆమె కాలిపోతూ కనిపించింది. నీళ్లతో మంటలను ఆర్పి ఆస్పత్రికి తరలించే యత్నం చేస్తుండగానే రూప మృతి చెందింది. ఉపేంద్రను కేజీహెచ్‌కు తరలించారు. ఉపేంద్ర చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. రూపకు నిప్పంటించి పరారైపోయినా హరిసంతోష్ తన ద్విచక్ర వాహనంతో విజయనగరం వెళ్లి అక్కడ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నగరవాసుల్లో తీవ్రకలకలం రేపింది.

మానసిక అపరిపక్వత వల్లే ఇలాంటి ఉన్మాదాలు

ఏదైనా పనిచేస్తే దానివల్ల ఎదురయ్యే పరిణామాలు, దుష్పరిణామాల గురించి ఆలోచించే విచక్షణ, మానసిక పరిపక్వత లేనివాళ్లు ఇలాంటి ఉన్మాద చర్యలకు పాల్పడుతుంటారు. దీనిని వైద్యపరిభాషలో 'ఇంపల్స్ కంట్రోల్ డిజార్డర్'గా పిలుస్తారు. జన్యుపరమైన కారణాలు, పెరిగిన వాతావరణం వంటివి వారి ప్రవర్తనకు ఇందుకు చాలావరకు దోహదం చేస్తాయి. ఏదైనా ఒక ఆలోచన మెదడులో కలిగితే వెనుకాముందు ఆలోచించకుండా క్షణాల్లో దానిని అమలు చేసేస్తుంటారు. వేరొకరితో చర్చించే ఆలోచన కూడా చేయరు. సాధారణంగా 18 నుంచి 25 ఏళ్ల వయస్సు వారిలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తుంటాయి.

-డాక్టర్ ఎన్.ఎన్.రాజు, మానసిక వైద్య నిపుణులు

రిజర్వాయర్లకు వరద నీరు

రెండు టీఎంసీలు అదనంగా చేరిక

జెన్‌కో ఎస్‌ఈ మురళీమోహన్



వరద నీటితో కళకళలాడుతున్న గుంటవాడ రిజర్వాయర్

సీలేరు: అల్పపీడన ద్రోణి ప్రభావంతో సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని రిజర్వాయర్లకు వరద నీరు పోటెత్తిందని, దీంతో రెండు టీఎంసీలు అదనంగా చేరిందని జెన్‌కో ఎస్‌ఈ మురళీమోహన్ తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, గత రెండు రోజులుగా సీలేరు నదీ పరివాహక ప్రాంతాల్లో కొండలపై కురిసిన భారీ వర్షాలకు జోలాపుట్టు, బలిమెల, గుంటవాడ, డొంకరాయి రిజర్వాయర్లలో వరద నీరు వచ్చిందన్నారు. దీంతో దాదాపు రెండు టీఎంసీలు అదనంగా నీరు చేరిన్నారు. మరో రెండు రోజులు వర్షాలు కొనసాగితే సీలేరు కాంప్లెక్సు పరిధిలోని జలాశయాలు పూర్తి స్థాయి నీటి మట్టాలకు చేరుకోవచ్చన్నారు.

జోలాపుట్టు రిజర్వాయర్‌లో 0.75 టీఎంసీల నీరు చేరిందని, దీంతో జోలాపుట్టు పూర్తి స్థాయి నీటి మట్టం 2750 అడుగులు కాగా, ప్రస్తుతం 2727 అడుగులు ఉందని జెన్‌కో ఎస్‌ఈ తెలిపారు. బలిమెల జలాశయంలో 0.650 టీఎంసీల నీరు చేరిందని, దీంతో పూర్తి స్థాయి నీటి మట్టం 1516 అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1472.5 అడుగులకు చేరిందని చెప్పారు. గుంటవాడ రిజర్వాయర్‌లో పిల్లిగెడ్డ క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 0.64 టీఎంసీల వరదనీరు వచ్చిందని, దీంతో దీని నీటిమట్టం 1360 అడుగులు కాగా, ప్రస్తుతం 1344 అడుగులకు చేరిందన్నారు. డొంకరాయి రిజర్వాయర్‌కు వలసగెడ్డ, పాలగెడ్డ, మంగంపాడు వాగుల నుంచి 0.68 టీఎంసీల వరదనీరు చేరిందని, ఇక్కడ పూర్తి స్థాయి నీటి మట్టం 1037 అడుగులు కాగా, ప్రస్తుతం 1029.6 అడుగులకు చేరుకుందని ఎస్‌ఈ తెలిపారు. అల్పపీడన ప్రభావంతో ఏ క్షణంలో భారీ వర్షాలు వస్తాయోనని ముందస్తు చర్యగా జెన్‌కో సిబ్బందిని అప్రమత్తం చేశామని ఆయన చెప్పారు.

ఫ్యాన్సీ నంబర్ల వేలం ద్వారా రూ.9.63 లక్షలు

ఎన్ఏడీ జంక్షన్: రవాణా శాఖ ఫ్యాన్సీ నంబర్ల వేలంలో ఏపీ 31 డీఎఫ్ 9999కు రూ.3.54 లక్షలు, 3456 నంబర్‌కు రూ 3.35 లక్షలు వచ్చాయి. డీటీసీ కార్యాలయంలో శనివారం 18 నంబర్లను వేలంలో ఉంచగా, వాటిలో ఏడింటిని దక్కించుకునేందుకు పలువురు పోటీపడ్డారు. వేలంలో 8888 నంబర్‌కు రూ.75,999, 7777కు రూ.75వేలు, 4455కు రూ.50,900, 5678కు రూ.42వేలు, 8118కు రూ.30,600 ఆదాయం వచ్చింది. నంబర్ల వేలం ద్వారా శనివారం రవాణా శాఖకు రూ.9,63,499 ఆదాయం సమకూరింది.

గీతం నర్సింగ్ దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగింపు

సాగర్‌నగర్: గీతం విశ్వవిద్యాలయం బీఎస్సీ నర్సింగ్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగించినట్టు అడ్మిషన్ల డైరెక్టర్ కె.నరేంద్ర తెలిపారు. ఇంటర్మీడియట్ తత్సమాన పరీక్షలలో సైన్స్ సబ్జెక్టులతో 45 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఆగస్టు 27వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన చెప్పారు.

అనకాపల్లి మార్కెట్ ధరలు

కూరగాయలు (కిలో)



ఉల్లిపాయలు	రూ.30
బంగాళదుంపలు	రూ.15
టొమేటో	రూ.50
వంకాయలు(తెల్లవి)	రూ.30
వంకాయలు(నల్లవి)	రూ.30
బీరకాయలు	రూ.30
బెండకాయలు	రూ.30
దొండకాయలు	రూ.30
క్యారెట్	రూ.40
క్యాబేజీ	రూ.25
బీన్స్	రూ.60
కొబ్బరి కాయ(చిన్నది)	రూ.10
కొబ్బరికాయ(పెద్దది)	రూ.12
బీట్‌రూట్	రూ.30
మిర్చి	రూ.45
చిక్కుడు	రూ.--
గోరుచిక్కుడు	రూ.30
బరబాటీ	రూ.30
అల్లం	రూ.60
చేమదుంపలు	రూ.30
దోసకాయ	రూ.30
కాకరకాయలు	రూ.30
ఆనపకాయ(చిన్నది)	రూ.10
ఆనపకాయ(పెద్దది)	రూ.15
అరటికాయలు (మూడు)	రూ.20


పప్పు దినుసులు (కిలో)

కందిపప్పు	రూ.65
పెసరపప్పు	రూ.65
మినపపప్పు	రూ.70
శనగ పప్పు	రూ.75
పంచదార	రూ.44
ఇడ్లీనూక	రూ.28
గోధుమ రవ్వ	రూ.34
చింతపండు	రూ.100
మైదా	రూ.28

నూనె ధరలు (లీటర్)

పామోలిన్	రూ.62
సన్‌ఫ్లవర్	రూ.82
వేరుశనగ	రూ.120
కొబ్బరి	రూ.120
డాల్డా (కిలో)	రూ.70

కోడి గుడ్లు(నెక్)



వంద గుడ్లు రూ.లలో

విశాఖపట్నం	362
విజయనగరం	366
శ్రీకాకుళం	366

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	బ్యాగ్
లైవ్ ధర	93.00	90.00
విత్ స్కిన్	130.00	150.00
స్కిన్ లెస్	153.00	160.00

బెల్లం ధరలు(రూ.లలో)

	కనిష్ట	గరిష్ట
మొదటి రకం	3660	4010
రెండో రకం	3240	3730
మూడో రకం	3000	3420

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 1, 8



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారులు, ప్రియతముల వైఖరి ఆవేదన కలిగిస్తుంది. షాపింగ్‌కు అనుకూలం. వేడుకల్లో పాల్గొంటారు. ఖర్చులు అంచనాలు మించుతాయి. పొదుపు పథకాల్లో ఆచితూచి వ్యవహరించాలి.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బదిలీలు, మార్పులు అసౌకర్యం కలిగిస్తాయి. తల్లి, మాతృవర్గీయులకు సంబంధించిన వ్యవహారాలు ఆవేదన కలిగిస్తాయి. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారు ఆచితూచి వ్యవహరించాలి.



మిథునరాశి: (మే21-జూన్21): చర్చలు, ప్రయాణాల్లో నిదానం అవసరం. సోదరీసోదరుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. సన్నిహితుల నుంచి ముఖ్యమైన మెయిల్స్, ఫోన్ సందేశాలు అందుకుంటారు. ఇంటర్వ్యూలలో నిరాశ తప్పకపోవచ్చు.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పెట్టుబడుల్లో ఆచితూచి వ్యవహరించాలి. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. షాపింగ్‌లో ఖర్చులు అధికం. విలువైన వస్తువుల కొనుగోలు విషయంలో నాణ్యత గమనించాలి.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): కొత్త పనుల ప్రారంభానికి అనుకూల సమయం కాదు. వ్యక్తిగత వ్యవహారాలకు సంబంధించిన ఆలోచనలు కొలిక్కి వస్తాయి. సంకల్ప సాధనకు అధికంగా శ్రమించాల్సి ఉంటుంది.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): వినోదం, ఫొటోగ్రఫీ, రచనా రంగాల వారికి అనుకూలం. సినీ, రాజకీయ, న్యాయ, బోధన రంగాల వారు లక్ష్య సాధనకు అధికంగా శ్రమించాలి. ఒక సమాచారం కలవరం కలిగిస్తుంది.




తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): సహకార సంఘాలు, యూనియన్ కార్యకలాపాలకు అనుకూలం. బృందకార్యక్రమాల్లో అసౌకర్యం కలిగే అవకాశం వుంది. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాల్లో లక్ష్య సాధనకు అధికంగా శ్రమించాలి. పెద్దలు, ప్రముఖులను కలుసుకుంటారు. గౌరవ, మన్ననలు అందుకుంటారు.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): న్యాయ, బోధన, రక్షణ, రవాణా రంగాల వారు ఆచితూచి వ్యవహరించాలి. భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకుంటారు. డ్రైవింగ్, చర్చల్లో నిదానం పాటించండి. చిన్నారులు, ప్రియతముల ఆరోగ్యం మెరుగుపడుతుంది.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఆర్థిక విషయాల్లో కొంత నిరుత్సాహకరంగా ఉంటుంది. ఆరోగ్యం పట్ల శ్రద్ద చూపించాలి. సంస్మరణల్లో పాల్గొంటారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు. వాయిదా పద్ధతులపై వస్తువులు కొనుగోలు చేస్తారు.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పందాలు, పోటీల్లో నిదానం పాటించండి. శ్రీవారు, శ్రీమతి వ్యవహారాలు మనస్తాపం కలిగిస్తాయి. వేడుకల్లో పాల్గొంటారు. బృందకార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. జనసంబంధాలు విస్తరిస్తాయి.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఆస్పత్రులు, హోటల్, క్యాటరింగ్ రంగాల వారికి కొంత నిరుత్సాహకరంగా వుంటుంది. విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. సహోద్యోగుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సూక్తి

మనిషి
ఔన్నత్యానికి
కొలబద్ద మేధస్సు
కాదు హృదయం

- మదర్ థెరిసా

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. వియంన ▸ ....
2. రకొత ▸ ....
3. రంశిబి ▸ ....
4. కివాలి ▸ ....

టంగ్ ట్విస్టర్స్

1. If you're keen on stunning kites and cunning stunts,buy a cunning stunning stunt kite.
2. Two tiny tigers take two taxis to town.

ఔనా!

ఆస్ట్రేలియాలో 10 వేల బీచ్‌లు ఉన్నాయి. రోజుకో బీచ్‌ను సందర్శించినా 27 ఏళ్లు పడుతుంది.



చిట్టీల్స్



ఎవరైనా పిల్లలు బాగా హుషారుగా ఉంటే అబ్బో ఈ అబ్బాయికి తెలివి అంతా ఇంతా కాదు అని అంటుంటారు. మరి నిజంగా తెలివిని పరీక్షలించాలంటే? ఓ వ్యక్తిని మేధావిగా గుర్తించాలంటే? అవి తెలుసుకోవడానికే ఓ పరీక్ష ఉంది.. అదే - 'ఐక్యూ(Intelligence Quotient) టెస్ట్. మహామహులే ఆ పరీక్షలో నెగ్గాలంటే తలలు పట్టుకుంటారు. అలాంటిది తెలివితేటల్లో ప్రఖ్యాత శాస్త్రవేత్తలు అల్బర్ట్ ఐన్‌స్టీన్, స్టీఫెన్ హాకింగ్‌ల స్థాయిని దాటేశాడు ఓ తెలుగు కుర్రాడు. అతడే బండి యశ్వంత్.

ఐక్యూ 162.. భాషలు 5

బ్రిటన్‌లో ఉన్న 'మెన్సా' క్లబ్ ఐక్యూను పరీక్షించడంలో ఎంతో ప్రఖ్యాతి చెందింది. ప్రపంచంలోనే అతి పురాతనమైన ఐక్యూ క్లబ్ ఇదే కావడం విశేషం. 1964లో రోలాండ్ బెరిల్, డాక్టర్ లాన్స్‌వేర్ కలిసి దీన్ని ప్రారంభించారు.

Mensa
The High IQ Society



తెలివితేటలకు తూకం వేయాలంటే.. 'ఐక్యూ'(ఇంటెలిజెన్స్ కోషంట్) పరీక్షలో సత్తా చాటాల్సిందే. అందులో నెగ్గితే.. ప్రపంచ మేధావుల జాబితాలో ఒకరిగా పేరు పొందొచ్చు. బ్రిటన్‌లో ఈమధ్యే జరిగిన ఐక్యూ టెస్ట్‌లో మన తెలుగు అబ్బాయి మెరిశాడు. పన్నెండేళ్ల 'బండి యశ్వంత్' 162 మార్కులు గానూ, 162 సాధించి(ఐక్యూ పరీక్షలో అత్యధిక మార్కులు) ఔరా అనిపించాడు. వృత్తిరీత్యా యశ్వంత్ కుటుంబం లండన్‌లోని 'రీడింగ్'లో నివాసముంటుంది. యశ్వంత్ తండ్రి కృష్ణమోహన్, తల్లి మాధవి లత సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా చేస్తున్నారు. కృష్ణమోహన్ స్వస్థలం తెనాలి(గుంటూర్)లోని కొలకలూరు కావడం విశేషం.

'నేను ఈ విజయాన్ని నమ్మలేకపోతున్నాను. ఎంతో ఆనందంగా ఉంది. నాకు పజిళ్లు పూర్తి చేయడమంటే భలే సరదా. రూబిక్ క్యూబ్ సాల్వ్ చేసేదాకా పట్టు వదలను. త్వరలోనే ముంబైలో జరిగే 'ప్రపంచ రూబిక్ క్యూబ్ టోర్నమెంట్'లో పాల్గొనబోతున్నాను. నాకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులంటే చాలా ఇష్టం. భవిష్యత్తులో మంచి వ్యాపారవేత్తను కావాలని అనుకుంటున్నాను. కాల్పనిక కథలు చదువుతుంటాను. కొత్త టెక్నాలజీ గురించి ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుంటాను. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించాను. క్రికెట్ నా ఫేవరేట్ గేమ్. జర్మనీ, ఫ్రెంచి, స్పానిష్ భాషల్లో కూడా మాట్లాడగలను. ప్రస్తుతం లాటిన్, రష్యన్ భాషలను నేర్చుకుంటున్నాను. 'ఆస్ట్రానమీ క్లబ్'లో నేను ఓ మెంబర్‌ని కూడా. నాకు ఇష్టమైన పనిని, మనసు పెట్టి చేస్తాను'.

- యశ్వంత్

ఐక్యూ టెస్ట్ పరీక్ష ఎలా ఉంటుందంటే..

- ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. ఒకటి 'కెటెల్ 3బీ పేపర్'. రెండోది 'కల్చర్ ఫెయిర్ స్కేల్'. ఈ రెండూ కలిపి రెండున్నర గంటల పరీక్ష ఇది. మొదటి పేపర్లో 42 ప్రశ్నలుంటే, రెండో దాంట్లో 250 ప్రశ్నలు ఉంటాయి.
- ఇందులో కష్టమైన ఇంగ్లీష్ పదాలకు అర్థాలు, వ్యతిరేక పదాలతో పాటు, బంధుత్వ ప్రశ్నలు, చిక్కులెక్కలు, మెదడు స్థాయిని పరీక్షించే తార్కిక ప్రశ్నలుంటాయి.

నవ్వుల్ నవ్వుల్

ఇద్దరు మేధావుల మాటలు..

మిస్టర్ మేధావి లింగం : ఒరేయ్! నువ్వు గేదె మీద వెళ్తున్నావు కదా. నిన్ను పోలీసులు పట్టుకుంటారు.

మిస్టర్ మేధావి గంగ : ఎందుకురా?

మిస్టర్ మేధావి లింగం : నువ్వు హెల్మెట్ పెట్టుకోలేదు కదా!

మిస్టర్ మేధావి గంగ : ఒరేయ్ ఇది ఫోర్ వీలర్. అందుకే బెల్టు పెట్టుకున్నా చూడు.

మిస్టర్ మేధావి లింగం : !!!!!!!!

చెప్పగలరా?

ఉరిలో ఉన్నా
కానీ గురిలో లేను

మేడలో ఉన్నా
కానీ మేనులో లేను

రాతలో ఉన్నా
కానీ రాయిలో లేను

అయితే ఇంతకీ
నేనెవర్నో
చెప్పగలరా?

రంగులు వేయండి




జవాబులు

చెప్పగలరా? : ఉడత

జంతర్‌మంతర్ : 1. వినయం 2. కొరత 3. శిబిరం 4. వాకిలి

జంబ్లింగ్ వర్డ్స్ : 1.COLD 2.SOFT 3.RIDE 4.LIKE

దారి కనుక్కోండి




జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. LCOD ▸ ....
2. STOF ▸ ....
3. DERI ▸ ....
4. KELI ▸ ....

బొమ్మ గీయండి





తిరుమల సమాచారం



వసతి గదులు: రూ.500 : అక్టోబర్ 24 నుంచి డిసెంబర్ 18 వరకు ఉన్నాయి.
రూ.100 : అక్టోబర్ 24 నుంచి డిసెంబర్ 18 వరకు ఉన్నాయి.
శ్రీనివాసమ్: అక్టోబర్ 24 నుంచి డిసెంబర్ 18 వరకు ఉన్నాయి.
రూ.300 దర్శనం : ఆగస్టు 29 నుంచి డిసెంబర్ 1 వరకు ఉన్నాయి. (మధ్యలో సెప్టెంబరు 2,5,19, 23, 27, 28, 29, 30 అక్టోబర్ 1,7, 14 తప్ప)
రూ.50 దర్శనం : ఖాళీలు లేవు.
ఆర్జిత సేవలు : అక్టోబర్ 20వ తేదీ ఉన్నాయి.

రైల్వే సమాచారం



రైళ్ల రాకపోకల వేళలు, రిజర్వేషన్ ఖాళీల వివరాలు, టికెట్ చార్జీలు, ఇతర సమాచారం కోసం... 139
ప్రయాణికుల భద్రతకు రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) టోల్ ఫ్రీ నంబరు 182
అనకాపల్లి ఆర్పీఎఫ్ పోస్ట్ ఫోన్... 08924-226965

ఆర్టీసీ సమాచారం




APSRTC
అనకాపల్లి ఎంక్వైరీ 77300 37027
నర్సీపట్నం ఎంక్వైరీ 94932 11969
పాడేరు ఎంక్వైరీ (డీఎం) 73829 14859

అందాలు అద్భుతహ



డముకు వ్యూ పాయింట్ వద్ద మంచు అంతాలను వీక్షిస్తున్న సందర్శకులు





రణజిల్లెడ జలపాతం ముందు పచ్చని పంట పొలాలు

- ఓ వైపు మంచు.. మరోవైపు వాన..
- చింతపల్లి, అనంతగిరిలలో వాతావరణానికి పర్యాటకులు తన్మయం
- అరకులోయ కళకళ

చింతపల్లి/ అనంతగిరి రూరల్ : విశాఖ మన్యంలోని చింతపల్లి, అనంతగిరి మండలాల్లో శనివారం అద్భుత వాతావరణం ఆవిష్కృతమైంది. ఆంధ్ర కశ్మీర్ లంబసింగిలో ఓవైపు పొగ మంచు.. మరోవైపు చిరుజల్లులు.. వెరసి పర్యాటకుల మదిని పులకింపజేశాయి. మధ్యాహ్నం పన్నెండు గంటలైనా మంచుతెరలు వీడకపోవడం విశేషం. ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించక పోవడంతో లైట్లు వేసుకుని వాహనచోదకులు రాకపోకలు సాగించారు. ఇదిలావుంటే, అనంతగిరి మండలంలో మరో రకంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో పొగమంచు కమ్ముకోగా, మరోపక్క ఎడతెరపి లేకుండా వాన కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచే అనంతగిరి, డముకు, కాశీపట్నం ప్రాంతాల్లో వర్షం కురవగా, మధ్యలో ఆగిన సమయంలో పొగ మంచు దర్శనమిచ్చింది. ఈ తెరల మధ్యలో అనంతగిరుల అందాలు మరింత రెట్టింపయ్యాయి. వీకెండ్‌లో సరదాగా గడిపేందుకు వచ్చినవారు ఈ అందాలకు తన్మయత్వం చెందారు. డముకు వ్యూపాయింట్ సందర్శకులతో కళకళలాడింది.

అరకులోయలో వీకెండ్ సందడి

అరకులోయ : ప్రకృతి అందాలకు పుట్టినిల్లు అరకులోయ ప్రస్తుతం కొంగొత్త అంతాలతో కళకళలాడుతోంది. చుట్టూ పచ్చని పొలాలు, ఉరకలేస్తున్న గెడ్డలు, పాలనురగను తలపించేలా జలజలా.. జారుతున్న జలపాతాలు ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రణజిల్లెడ జలపాతం హోరు రెట్టింపయ్యింది. దీంతో పర్యాటకులు తెగ సందడి చేస్తున్నారు. యువత జలకాలాడుతూ సరదాగా గడుపుతున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండడం, వీకెండ్ కావడం పద్మాపురం గార్డెన్, మ్యూజియం తదితర ప్రాంతాలను పెద్ద సంఖ్యలో సందర్శిస్తున్నారు.




అనంతగిరిలో వాన



బోడకొండమ్మ దేవాయం వద్ద మంచు అందాలు



లంబసింగిని కమ్మేసిన పొగ మంచు



రెండు కొండల నడుమ జలజలా..జారుతున్న జలపాతం



కేరింతలు కొడుతున్న యువత

మంచి గాయని కావాలన్నదే లక్ష్యం

ప్రముఖ గాయని గోపిక పూర్ణిమ



విలేకరులతో మాట్లాడుతున్న గోపిక పూర్ణిమ

పాయకరావుపేట : జీవితంలో మంచి గాయనిగా పేరు సాధించాలన్నది తన ఆకాంక్షగా ప్రముఖ నేపథ్య గాయని గోపిక పూర్ణిమ తెలిపారు. పాయకరావుపేటలో శనివారం జరిగిన శ్రీప్రకాష్ విద్యా సంస్థల 41వ వ్యవస్థాపక దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విలేకరులతో మాట్లాడారు. చిన్నప్పటి నుంచి పాటలంటే ఇష్టమన్నారు. ఇంట్లో అందరూ పాటలు పాడేవారు ఉండడం వలన తనకు అలవాటుగా మారిందన్నారు. ఇందుకు తన తండ్రి ప్రోత్సాహం ఎంతగానో ఉందని, తనకు సంగీతం నేర్పడం కోసమే హైదరాబాద్‌లో చదువుకుంటున్న తనను చెన్నైకి తీసుకువచ్చారని వివరించారు. 20 ఏళ్లుగా పాటలు పాడుతున్నానని, 'పాడుతా తీయగా' వేదికలో పాల్గొన్న తరువాత మంచి అవకాశాలు లభించాయని చెప్పారు. ఇప్పటి వరకు తాను 400 సినిమాల్లో పాటలు పాడడంతో పాటు ఆరు వేల భక్తి గీతాలు పాడానన్నారు. నంది అవార్డు రావడం ఆనందమన్నారు. తొలుత శ్రీప్రకాష్ విద్యా సంస్థలకు వచ్చిన ఆమెకు ఘన స్వాగతం పలికారు.

భూగర్భ జలాల దోపిడీని అరికట్టాలి

జలవనరుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ హుకుంసింగ్



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ హుకుంసింగ్

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నీటిని వాణిజ్యం చేస్తూ కోట్లాది రూపాయలు ఆర్జించే బహుళజాతి కంపెనీలను నియంత్రించి, భూగర్భ జలాల దోపిడీని అరికట్టాలని జల వనరుల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ హుకుంసింగ్ ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం విశాఖ నగరానికి వచ్చిన జల వనరుల పార్లమెంటరీ కమిటీ సభ్యులు నోవాటెల్ హోటల్‌లో తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు పనులు, ప్రగతి, భూగర్భ, ఉపరితల జలవనరుల నిర్వహణ తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ హుకుంసింగ్ మాట్లాడుతూ అత్యంత శక్తవంతమైన నాయకుడు నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో పరిపాలన స్ఫూర్తిదాయకంగా సాగుతోందన్నారు. బహుళజాతి కంపెనీలకు కళ్లెం వేయడం, భూగర్భ జలాల దోపిడీలను అరికట్టడం అవసరమన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శశిభూషన్‌కుమార్ మాట్లాడుతూ జలవనరుల నిర్వహణకు అమలు చేస్తున్న వివాదాలను, తీసుకుంటున్న చర్యలను కమిటీకి వివరించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఎం.మరళీమోహన్, పి.అపురూప, వి.సత్యభావ, హర్షవర్ధన్, సర్దార్ బల్విందర్‌లతో పాటు జల వనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.



వారపు సంతలో బురదలోనే సామగ్రిని కొనేందుకు వెళ్తున్న వినియోగదారులు



చిత్తడిగా మారిన గుత్తులపుట్టు వారపు సంత

గుత్తులపట్టు వారపు సంత సమస్యల వలయంలో చిక్కుకుంది. వర్షం కురిస్తే సంత ప్రాంగణం చిత్తడవుతోంది. పరిసరాలు బురదగా మారడంతో దుకాణాల నిర్వహణ కష్టమవుతోంది. గత్యంతరం లేక అక్కడే టార్పాన్లు వేసుకుని వ్యాపార లావాదేవీలు సాగించాల్సిన దుస్థితి దాపురిస్తోంది. ఈ క్రమంలో వ్యాపారులు, రైతులు, వినియోగదారులు నరకయాతన అనుభవించాల్సి వస్తోంది.



సంతలో గొడుగులు కొంటున్న గిరిజనులు

సమస్యల స(చి)ంత

- గుత్తులపుట్టులో కనీస సదుపాయాలు కరువు
- వర్షం కురిస్తే పరిసరాలు చిత్తడి
- బురదలోనే క్రయవిక్రయాలు
- షెడ్లు లేక టార్పాలిన్లలో దుకాణాలు
- వర్తకులు, గిరిజనులు నానా అగచాట్లు

పాడేరు రూరల్: మండలంలోని గుత్తుల పుట్టు గ్రామంలో జరిగే వారపు సంతకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ప్రతి గురువారం జరిగే ఈ సంతకు అనేక ప్రాంతాల నుంచి వర్తకులు, మండలంలోని చాలా గ్రామాలతో పాటు హుకుంపేట, పెదబయలు మండలాలకు చెందిన గిరి రైతులు వస్తుంటారు. స్థానికులతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వ్యాపారులు కూడా ఇక్కడికి విచ్చేస్తారు. అయితే కనీస సదుపాయాలు లేకపోవడంతో వారంతా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఏమాత్రం వర్షం కురిసినా సంత ప్రాంగణం బురదమయమవుతోంది. కనీస నడవలేని స్థితిలో పరిసరాలు తయారవుతున్నాయి. దీంతో దుకాణ నిర్వహణకు వర్తకులు నానా పాట్లు



షెడ్లు లేక టార్పాలిన్లు వేసుకుని దుకాణాలు నిర్వహిస్తున్న దృశ్యం

పడుతున్నారు. వినియోగదారులు కూడా వస్తువుతు కొనుక్కోవడానికి నరకం చూస్తున్నారు. అలాగే సంతలో షెడ్లు లేకపోవడంతో టార్పాలిన్లు వేసుకుని దుకాణాలను నిర్వహించాల్సిన దుస్థితి. వర్షాల సమయంలో ఈ విధంగా వ్యాపారాలు సాగడం కష్టమవుతోంది. గుత్తులపుట్టు, పెదకోడాపల్లి ప్రధాన మార్గంలో జరిగే ఈ సంతకు రహదారిని మెరుగుపర్చాలని వర్తకులు, గిరిజన రైతులు, వినియోగదారులు కోరుతున్నారు. అలాగే సంత జరిగిన రోజైనా కనీస సదుపాయాలు కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

సౌకర్యాలు మెరుగుపరచాలి



నిత్యం రద్దీగా ఉండే గుత్తులపుట్టు వారపు సంతలో సౌకర్యాలను మెరుగు ఎర్చేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. పాడేరు మండలంలో వాణిజ్య పరంగా పెద్ద సంతగా పేరు పొందిన గుత్తులపుట్టు సంత బురద మయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు కురిస్తే కనీసం నడవలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. **-కించు కొండబాబు,** మర్రిపుట్టు, హుకుంపేట

సంతలో రోడ్లు నిర్మించాలి



మన్యంలో పెద్ద సంతగా గుర్తింపు పొందిన గుత్తులపుట్టు సంతలో రోడ్లు నిర్మించాలి. సంతకు వచ్చే ప్రజలు బురదతో నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడున్నది. సంత బురదమయం కావడంతో కూరగాయలు, అపరాలను అమ్మకాలను చేపట్టేందుకు నరకం చేస్తున్నాం. ఈ విషయంలో అధికారులు స్పందించాలి. **-ఎం.నూకరాజు,** కిముడుపల్లి, పెదబయలు

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కొయ్యూరు: మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను అఅందరూ తీసుకోవాలని కాకరపాడు అటవీ సెక్షన్ అధికారి చిరంజీవి సూచించారు. వన మహోత్సవంలో భాగంగా మంప గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొక్కలు నాటేందుకు అందరూ ముందుకు రావాలని, కావాల్సిన మొక్కలు నర్సరీల్లో ఉచితంగా పొందవచ్చని చెప్పారు. ప్రధానంగా నాటిన మొక్కను సంరక్షిస్తేనే సార్థకత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంప సర్పంచ్ జె.రాజబాబు, పాఠశాల హెచ్ఎం శామ్యూల్‌పడాల్, వార్డెన్ నరసింగరావు, ఏబీవో నాగేశ్వరరావు, ఎఫ్‌బీవో సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై జాతీయ బృందం తనిఖీలు

ఏపీడీ ఆనందరావు

చింతపల్లి: జిల్లాలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై జాతీయ బృందం తనిఖీలు నిర్వహించనున్నట్టు ఎన్‌ఆర్‌ఈజీఎస్ అదనపు పీడీ ఆనందరావు తెలిపారు. చింతపల్లి స్త్రీశక్తి భవనంలో శనివారం ఉపాధి పథకం ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు పీడీ మాట్లాడుతూ, ఈ నెల 21 నుంచి 24 వరకూ జాతీయ బృందం జిల్లాలో నిర్వహిస్తున్న అన్ని రకాల ఉపాధి పథకం పనులపై తనిఖీ చేయనున్నట్టు చెప్పారు. ఈ మేరకు ప్రతీ ఎంసీసీ పరిధిలో జరిగిన పనులకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను సిద్ధం చేసుకోవాలని ఆయన ఆదేశించారు. ఒక్కొక్క మండలానికి 10-12 బృందాలు వస్తాయన్నారు. తనిఖీ బృందం అడిగిన సమాచారం పూర్తి స్థాయిలో అందించేందుకు వీఆర్‌పీ, ఏపీవో, టీఏలు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కె.భాగ్యారావు, ఏపీడీ రవీంద్రనాథ్, ఏపీవో కొక్కుల లక్ష్మీనారాయణ, ఉపాధి పథకం ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ ఆనందరావు

కిడ్నీ బాధితురాలు కేజీహెచ్‌కు తరలింపు



పాడేరు రూరల్: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న చిన్నారికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు విశాఖ కేజీహెచ్‌కు తరలించామని ఏరియా ఆస్పత్రి వైద్యుడు వి.మోహనరావు తెలిపారు. హుకుంపేట మండలం బాకూరు గ్రామానికి చెందిన బాకూరు అప్పలరాజు కుమార్తె లోకనందిని(11) అనే బాలిక అదే గ్రామంలో 6వ తరగతి చదువుతుంది. ఇటీవల కాలంలో లోకనందిని అనారోగ్యంతో ఇబ్బంది పడుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం బాలిక పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్య పరీక్షలు చేపట్టి చిన్నారి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించి మెరుగైన వైద్యసేవల కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించామని వైద్యాధికారి మోహనరావు తెలిపారు.

విద్యార్థినికి సికిల్‌సెల్ ఎనీమియా



పాడేరు రూరల్: సికిల్‌సెల్ ఎనీమియాతో బాధ పడుతున్న విద్యార్థినికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేజీహెచ్‌కు తరలించారు. జి.మాడుగుల మండలం పెదలంక గ్రామానికి చెందిన కోని చిట్టిబాబు కుమార్తె కుమారి (11) జి.మాడుగుల కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఆరో తరగతి చదువుతుంది. వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలికను శుక్రవారం ఏరియా ఆస్పత్రికి తీసుకు వచ్చారు. ఆరోగ్య పరీక్షలు చేపట్టిన వైద్యులు బాలిక సికిల్‌సెల్ ఎనీమియాతో బాధ పడుతున్నట్టు గుర్తించారు. మెరుగైన వైద్య సేవలు అవసరమని శనివారం కేజీహెచ్‌కు తరలించారు.

మాడుగుల ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-224233
ఎంపీడీఓ	9000 01928
తహసీల్దార్	88977 01286

సినిమా గైడ్

సాయిసిరీమేక్స్	జయ జానకీ నాయక
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	ప్రతిక్షణం



శిక్షణకు హాజరైన రైతులు



మాట్లాడుతున్న ఆత్మ పీడీ త్రినాథస్వామి

ప్రతి నీటి బొట్టునూ వినియోగించుకోవాలి

రైతులకు ఆత్మ పీడీ త్రినాథస్వామి సూచన

దేవరాపల్లి: రైతులు వాతావరణ పరిస్థితలకు అనుగుణంగా పంటలు వేయాలని ఆత్మ పీడీ కె.త్రినాథస్వామి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన ఆధ్వర్యంలో నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాథస్వామి మాట్లాడుతూ రైతులు ప్రతి నీటిబొట్టునూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనల మేరకు పంటలు వేస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని అన్నారు. బిందు సేద్యం పద్ధతిలో వ్యవసాయం చేస్తే నీటిని ఆదా చేయడమే కాకుండా మరో 10 మంది రైతులకు ఆ నీరు ఉపయోగపడుతుందని అన్నారు. దీని వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చునని అన్నారు. వ్యవసాయశాఖ ఏడీ టి.సత్యనారాయణ మాట్లాడుతూ, నీటి వనరులను వినియోగించుకోవడానికి ప్రభుత్వం 90 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తోందని అన్నారు. జలసిరి పథకం కింద బోర్ల కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులకు త్వరలో బోర్లు తవ్విస్తామని అన్నారు. అలాగే పంట సంజీవిని కార్యక్రమంలో మూడు ఎకరాల నుంచి ఐదెకరాలు ఉన్న రైతుల పొలాల్లో నీటి నిల్వల గుంతలు ఏర్పాటుకు రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకూ ప్రభుత్వం ఖర్చు చేస్తుందని అన్నారు. దీని వల్ల నీటి వనరులు లేని చోట నీటిని నిల్వ చేసుకుని పంటలు పండించుకోవచ్చునని అన్నారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.అప్పారావు, ఆత్మ సిబ్బంది ఎస్.శ్రీదేవి, ఏపీవో తిరుపతి, ఇరిగేషన్ ఏఈఈ జి.భాగ్యలక్ష్మి, డి.చందు, వ్యవసాయ విస్తరణ అధికారి డి.సత్యనారాయణ, సీహెచ్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు



ఉపాధ్యాయుల సన్మాన సభలో మాట్లాడుతున్న వెంకటపతిరాజు

చీడికాడ: అంకితభావంతో పనిచేస్తే నిరంతరం గుర్తింపు ఉంటుందని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతిరాజు అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో పనిచేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు, మండలానికి కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు ఆహ్వాన సభ శనివారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడూ పూర్వ పాఠశాలల్లో ఏవిధంగా పనిచేసి గ్రామీణుల గుర్తింపు పొందారో బదిలీ అయిన చోట కూడా అదే విధంగా పనిచేసి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ కుచ్చు కళావతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులను అత్యున్నతంగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని అన్నారు. అనంతరం ఏపీటీఎఫ్ మండల కార్యదర్శి ఆడారి రమేష్‌తోపాటు పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్, ఎంఈవో కె.గంగరాజు, చీడికాడ హైస్కూల్ ఉపాధ్యాయిని ఎన్.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం : రామానాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామానాయుడు

కె.కోటపాడు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులైన పిల్లలు జన్మిస్తారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. శనివారం మండలంలోని కింతాడ శివారు జోగన్నపాలెం పాల కేంద్రంలో సర్పంచ్ బండారు అరుణకుమారి అధ్యక్షతన ఏడు అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 28 మందికి సామూహిక సీమంతాలు నిర్వహించారు. సర్పంచ్ సమకూర్చిన చీరలు, మిఠాయిలను, బాలింతలకు బేబీ కిట్లను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు పోషకాహారంతో పాటు కొద్దిగా వ్యాయామం కూడా అవసరమన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో రొంగలి ఉమాదేవి, సూపర్‌వైజర్ పీవీ రత్నం,టీడీపీ మండల అధ్యక్షుడు కొరుపోలు జయరామ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వంటాకు శ్రీను, వైస్ ఎంపీపీ బండారు మంగపతి, ఎంపీటీసీ సభ్యుడు ఒమ్మి వెంకటరావు, టీడీపీ నాయకులు బండారు నరసింహనాయుడు, బత్తి వెంకటరమణ, బొడ్డు తాతయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో భారీ అవినీతి

దేవరాపల్లి సెక్షన్ అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

చీడికాడ: దేవరాపల్లి ఫారెస్ట్ సెక్షన్ అధికారులపై ఏసీబీ దాడులు నిర్వహిస్తే కోట్లాది రూపాయల అక్రమ ఆస్తులు బయటపడతాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని మంచాల శివారు ఎం.గదబూరులో వన సంరక్షణ సమితి సభ్యులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ చీడికాడ, పినకోట, దేవరాపల్లి ప్రాంతాల్లో మొక్కలు పెంపకంలో అటవీ అధికారులు భారీ అవినీతికి పాల్పడుతూ, తప్పుడు మస్తర్లతో లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారన్నారు. ఉద్యోగుల కాలపరిమితి మించినప్పటికీ పై ఉద్యోగుల ప్రాపకంతో దేవరాపల్లి సెక్షన్ పరిధిలోనే కొంతమది దీర్ఘకాలంగా ఉద్యోగాలు చేస్తున్నారన్నారు.

గతంలో వీఎస్‌ఎస్‌లు ఏర్పాటు చేసి అటవీ ప్రాంతంలో పనులు చేయించినపుడు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, వీఎస్‌ఎస్ అధ్యక్షుడుతో జాయింట్ అకౌంట్ బ్యాంకులో ఉండేదన్నారు. తద్వారా ఏ పని చేసినా జాయింట్‌గా సంతకాలు చేసి నిధులు డ్రా చేసేవారనారు.. పదేళ్లుగా వీఎస్‌ఎస్‌లకు బాధ్యతలు అప్పగించకుండా వదిలిపెట్టడంతో ఫారెస్ట్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఖాళీగా ఉన్న అటవీ భూముల్లో గిరిజనులు జీడి మొక్కలు వేసుకొని పెంచుకుంటే వాటిని తొలగించి టేకు ప్లాంటేషన్ అంటూ గిరిజనులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దేవరాపల్లి ఫారెస్ట్ సెక్షన్ పరిధిలో అవినీతికి అంతం లేదని అన్నారు. ఈ సమావేశంలో ఎం.గదబూరు గిరిజన నాయకులు లోవ రాజు, చిన్ని జగ్గారావు, పశువుల బోగొండమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎం.గదుబూరులో వీఎస్‌ఎస్ సభ్యులతో మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకన్న

బోధన సామగ్రి పంపిణీ

కె.కోటపాడు : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కింతాడ సర్పంచ్ బండారు అరుణకుమారి అన్నారు. శనివారం మండలంలోని కింతాడ ప్రాథమిక పాఠశాలకు సామాజిక సేవ కార్యకర్త సూరిశెట్టి నాగరాజు సమకూర్చిన బోధన సామగ్రి, స్టీలు కంచాలను అందజేశారు.



బోధన సామగ్రి అందజేస్తున్న దృశ్యం

ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

చీడికాడ: మండలంలోని వరహాపురం గంగాదేవి ఆలయంలో శుక్రవారం రాత్రి సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఘనంగా జరిగాయి. శ్రావణమాసం ఆఖరి శుక్రవారం కావడంతో 108మంది దంపతులు కుంకుమార్చన, హారతి భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు గంగాదేవికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. ఈ పూజలకు వరహాపురం నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు కూడా హాజరయ్యారు.

మంచినీటి వాడకంపై కళాకారుల ప్రచారం

చీడికాడ: మంచినీటిని వృథా చేయకుండా సక్రమంగా వాడుకుంటే భావితరాలకు నీటి కొరత ఉండదని బుర్రకథ కళాకారులు పాటల రూపంలో ప్రచారం చేశారు. మండలంలోని సిరిజాం గ్రామ రామకోవెలలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఈ బృందం సభ్యులు వరల్డ్ బ్యాంకు నిధులతో నిర్మించిన మంచినీటి ట్యాంకుల నిర్వహణకు వాటర్ కమిటీ వేసుకోవాలని, కమిటీలో అధ్యక్షుడు సర్పంచ్ ఉంటారని తెలిపారు. ట్యాంకు నిర్వహణ పూర్తి బాధ్యత కమిటీకే ఉందన్నారు. నెలకు రెండుసార్లు క్లినింగ్ చేయాలని, నీటిలో క్లోరినేషన్ చేయాలని తెలిపారు. మంచినీటి వాడుకను పూర్తిగా ప్రజాభాగస్వామ్యంతో నిర్వహించుకోవాలని కోరారు. తాగునీటి వనరులను సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.కనకమ్మ, సర్పంచ్ పంచాడ దాలెంనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు కన్నూరు పార్వతిదేవి, టీడీపీ నాయకుడు కె.లచ్చన్న, పంచాయతీ కార్యదర్శి అల్లంగి కృష్ణవేణి, మండల రిసోర్స్ పర్సన్ రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చోడవరం ఫోన్ నెంబర్లు

పోలీస్‌స్టేషన్	08934-245033
ఎంపీడీఓ	9959550097
తహసీల్దార్	8500632088

సినిమా గైడ్

సాయిసిరిమేక్స్	జయ జానకి నాయక
శ్రీసాయిలక్ష్మి	నేనే రాజు.. నేనే మంత్రి
సాయిలక్ష్మి(ఏసీ)	లై
పూర్ణ	ప్రతిక్షణం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

గణపతి హుండీ ఆదాయం రూ.1.91 లక్షలు

చోడవరం: పట్టణంలోని స్వయంభూ విఘ్నేశ్వరాలయంలో శనివారం హుండీ లెక్కింపు జరిపారు. దేవాదాయ శాఖ ఈవో ఎస్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 75 రోజులకు ఒక లక్ష 90వేల 852 రూపాయలు ఆదాయం వచ్చింది. ఆలయ ప్రధానార్చకుడు కొడమంచిలి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

బుచ్చెయ్యపేట : వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మేథమేటిక్స్ బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను కోరుతున్నామని ప్రిన్సిపాల్ ప్రభాకరరావు తెలిపారు. ఆసక్తి గల పీజీ విద్యార్థులు సోమవారం నేరుగా దరఖాస్తులందజేయాలని ఆయన కోరారు. పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు.

ఫొటోగ్రాఫర్ ప్రసాద్‌కు ఘన సన్మానం



ఫొటోగ్రాఫర్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

చోడవరం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వరాలయం వద్ద ఫొటోగ్రఫీ డే వేడుకలను నిర్వహించారు. ఫొటోఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ ఫొటోగ్రాఫర్ అప్పికొండ ప్రసాద్‌ను స్థానిక ఫొటోగ్రాఫర్లు సత్కరించారు. ఫొటోగ్రాఫర్లు దుర్గారావు, శివ, కల్యాణ్, కోటి, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు శిక్షణానంతర సర్టిఫికెట్లు

చోడవరం: విజయనగరంలో మూడురోజులపాటు నిర్వహించిన టీడీపీ కార్యకర్తల నాయకత్వ శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ శిబిరానికి చోడవరం మండల పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్, జడ్పీటీసీ సభ్యుడు రాముునాయుడు తదితరులు హాజరయ్యారు. శిక్షణ శిబిరం రోజున వీరికి శిబిరం డైరెక్టర్ కనిశెట్టి అప్పలనాయుడు సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ శిబిరంలో తాము ఎన్నో విషయాలు నేర్చుకున్నామని, పార్టీ సంస్థాగత నిర్మాణంలో కార్యకర్తలకు ఇస్తున్న ప్రోత్సాహానికి ఈ శిబిరం ఒక నిదర్శనమని టీడీపీ మండల అధ్యక్షుడు నాగగంగాధర్ తెలిపారు.

తేనెటీగల మనుగడను కాపాడాలి

రైతులకు ఉద్యానవన శాస్త్రవేత్త సత్తిబాబు సూచన



సమావేశంలో మాట్లాడుతున్న సత్తిబాబు

రావికమతం: తేనెటీగలను ఉత్పత్తి చేయడంతోపాటు వాటి మనుగడను రైతులు కాపాడాలని కృషి విజ్ఞాన కేంద్రం (కొండెంపూడి) ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.సత్తిబాబు కోరారు. ప్రపంచ తేనెటీగల దినోత్సవం సందర్భంగా మండలంలోని మేడివాడలో సర్పంచ్ అరిశంకల రామారావు అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో తేనెటీగల ఆవశ్యకత, వాటి ఉపయోగాలు తదితర అంశాలపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ, తేనెటీగల వల్ల పంటలకు మేలు జరుగుతుందని అన్నారు. ఇవి అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత రైతులదేనన్నారు. పంటల్లో పరపరాగ సంపర్కం సమయంలో ఒక పుష్పంలో ఉన్న పుప్పొడి మరో పుష్పంలోని కీలాగ్రంపై చేరవేయడం తేనెటీగల వల్లే సాధ్యమన్నారు. ఉద్యానవన పంటల్లో కూడా తేనెటీగలు అధిక దిగుబడికి దోహదపడ తాయన్నారు. ఇవి వివిధ రకాల పుష్పాల్లో లభించే పుప్పొడి రేణువులు, మకరందం ఆహారంగా తీసుకుంటాయన్నారు. ఈ దృష్ట్యా రైతులు పుప్పొడి, మకరందం ఎక్కువగా ఇచ్చే నిమ్మ, నారింజ, ఉసిరి, కుంకుడు, కొబ్బరి, పామాయిల్, జామ, పొద్దుతిరుగుడు సాగును చేపట్టడం ద్వారా తేనెటీగల మనుగడను కాపాడవచ్చని అన్నారు. ఇందు కోసం ఆయా పంటల వద్ద తేనెటీగల పెట్టెలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకుడు గొర్లె విజయ్, పాలసంఘం అధ్యక్షుడు వేపాడ రమణ పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ ద్వారా అధిక దిగుబడి

రోలుగుంట : డ్రమ్ సీడర్‌తో వరి సాగు చేసే విధానం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.విజేత తెలిపారు. మొలకలొచ్చిన విత్తనాన్ని నేరుగా దమ్ము చేసిన మడిలో వరుసల్లో నాటేందుకు డ్రమ్ సీడర్ బాగా పనిచేస్తుందన్నారు. చంద్రన్న రైతు క్షేత్రంలో భాగంగా మండలంలోని కె.నాయుడుపాలెంలో దీనిపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ కాలపరిమితిలో వరి విత్తనాలను మొలకకట్టి సూడోమోనాస్‌తో విత్తన శుద్ధి చేసి డ్రమ్ సీడర్‌లో వేసి ప్రధాన పొలంలో లాగడం వలన వరి విత్తనాలు చల్లబడతాయన్నారు. రకాన్ని బట్టి ఎకరానికి 15 నుంచి 18 కిలోల విత్తనాలు అవసరం ఉంటుందన్నారు. విత్తనం వేసినప్పటి నుంచి చిరు పొట్ట దశ వరకు పొలంలో నీరు నిల్వ లేకుండా కేవలం తడిగా ఉంచాలని సూచించారు. పైరు చిరు పొట్ట దశ నుంచి కోతదశ ముందు వారం రోజుల వరకు పొలంలో సెంటీమీటర్ నీటి నిల్వ ఉండేటట్లు చూసుకోవాలన్నారు. అలాగే కలుపును కూడా కూలీల ఖర్చు లేకుండా కోనోవీడర్ సహాయంతో తొలగించవచ్చన్నారు. ఏఈవో చిరంజీవి, ఎంపీఈవోలు కె.వాణి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కె.నాయుడుపాలెంలో డ్రమ్ సీడర్‌తో వరి విత్తనాలను వేస్తున్న దృశ్యం

నేడు చాగంటి ప్రవచనాలు

చోడవరం: పట్టణంలోని స్వయంభూ గౌరీశ్వరాలయంలో ఆదివారం సాయంత్రం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు బ్రాహ్మణ సేవా సంఘం కన్వీనర్ ఉపాధ్యాయుల శ్రీనివాస్ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి నేడు శిక్షణ

చోడవరం: ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగాలకు హాజరయ్యే యువకులకు ఎంపికపై అవగాహన కల్పించేందుకు గణేష్ స్పోర్ట్సు సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నవరంలో ఆర్మీ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు సెంటర్ ప్రతినిధి పుల్లేటి గణేష్ తెలిపారు. ఆసక్తి కలిగిన యువకులు ఆదివారం ఉదయం నేరుగా శిక్షణకు హాజరు కావాలని కోరారు.

భోజన పథకాన్ని ప్రైవేటుపరం చేయొద్దు

ఎండీఎం రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి

బుచ్చెయ్యపేట : మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని ఆ పథకం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గునూరు వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఆమె శనివారం బుచ్చెయ్యపేటలో జరిగిన మండల నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాను మూడు క్లస్టర్లుగా విభజించి ఒక్కో క్లస్టర్ పరిధిలో 25 వేల మంది విద్యార్థులకు ఒకేచోట భోజనం వండి వాహనాల ద్వారా పంపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. నెల్లూరులో ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించిన ఈ పథకం విఫలమైందన్నారు. నాణ్యమైన కోడిగుడ్ల సరఫరాలో ఏజెన్సీలు విఫలమైనందున భోజన పథక నిర్వాహకులకే వాటి కొనుగోలు బాధ్యత అప్పగించాలని, పథకాన్ని ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. సంఘం మండల అధ్యక్షురాలు ఉమ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వరలక్ష్మి

హరియాణా పాడిగేదెలనే కొనుగోలు చేయాలి

వెలుగు అధికారులకు లబ్ధిదారుల వినతి



పాడి రైతుల సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సూర్యనాగేశ్వరరావు

బుచ్చెయ్యపేట : హరియాణా పాడిగేదెలనే కొనుగోలు చేసి ఇవ్వాలని పలువురు లబ్ధిదారులు సంబంధిత అధికారులను కోరారు. వెలుగు పథకం ద్వారా మండలంలోని 40 మంది ఎస్సీ మహిళలకు పాడిగేదెలు మంజూరయ్యాయి. వీటి కొనుగోలుపై లబ్ధిదారులతో ఎంపీడీవో టి.కొండలరావు శనివారం సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ దాడి సూర్యనాగేశ్వరరావు లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించారు. హరియాణా గేదెలైతే అధిక పాలు ఇస్తున్నందున అక్కడి గేదెలనే కొనుగోలు చేయాలని లబ్ధిదారులు సూచించారు. రాజాం పశువైద్య కేంద్రం అధికారి గణేష్ పర్యవేక్షణలో పాడిగేదెలను కొనుగోలు చేస్తామని, బీమా, రవాణాతో కలిపి ఒక్కో గేదెకు రూ.60 వేలు మంజూరైందని వెలుగు ఏపీఎం కనకమ్మ తెలిపారు. సమావేశంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు తమరాన దాసు, వడ్డాది కస్బా నీటి సంఘం అధ్యక్షుడు దాడి పెద గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణంపై న్యాయపోరాటం : ధర్మశ్రీ

చోడవరం: పోలీసులను, అధికారులను గుప్పిట్లో పెట్టుకుని అధికార బలంతో గ్రామస్థుల అభీష్టానికి వ్యతిరేకంగా అన్నవరంలో కల్యాణ మండపం నిర్మాణం చేపట్టిన ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అనవసర వివాదాలు రేపి గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ విమర్శించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నవరంలో ఏడాది క్రితం కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు చెబుతున్న ఎమ్మెల్యే, ఇంతకాలం దానిని ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. తీరా తాము నిధులు తెచ్చినట్టు తెలుసుకుని హడావుడిగా అధికారులతో తీర్మానం చేయించి శంకుస్థాపన తంతుకు తెరతీయడం వివాదాలను రేపడానికే అన్నది స్పష్టం అవుతుందన్నారు. దీనిపై న్యాయపోరాటానికి తాము సిద్ధమవుతున్నామని చెప్పారు. స్థానిక వైసీపీ నాయకులు లింగాబాబు, శ్రీకాంత్, నెహ్రూ, మూడెడ్ల శంకరరావు, బొడ్డేడ సూర్యనారాయణ, అల్లాడ భవానీ, నాగదుర్గ గోవింద్, మొల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోల ఫోన్ నంబర్లు

నర్సీపట్నం	9849900151
గొలుగొండ	9000013921
నాతవరం	9000013925
మాకవరపాలెం	9000013920

సినిమా

శ్రీకన్య - ఫిదా
కన్య - దర్శకుడు
కన్యమినీ - వశం
సాయిశ్రీకన్య - ఇదేమి! దెయ్యం
రాజుమూవీమ్యాక్స్ - నక్షత్రం
బంగార్రాజు - గౌతమ్‌నందా

మండల సమావేశం రేపు

గొలుగొండ : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్టు ఎంపీడీఓ ఎంవీ సువర్ణరాజు తెలిపారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు ఉదయం పది గంటలకు ఎంపీపీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులతో పాటు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ప్రమాదకరంగా బావి

గొలుగొండ : మండలంలోని ఏటిగైరంపేట ప్రాథమికోన్నత పాఠశాల ఆవ రణలో ఉన్న బావిని పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.ఈ పాఠశాలలో 65 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పక్కనే అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉంది. అయితే పాఠశాలకు గతంలో తాగునీటి అవసరాల నిమిత్తం30 అడుగుల లోతులో నేల బావి తవ్వారు. ప్రస్తుతం దీన్ని ఎవరూ ఉపయోగించడం లేదు. వర్షాకాలంలో అది నీటితో నిండుగా ఉండడం, ఆ పక్కనే పిల్లలు ఆటలు ఆడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారు.తక్షణమే పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి బావిని పూడ్చి వేయాలని కోరుతున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ అచ్చియమ్మ

మాకవరపాలెం : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని సర్పంచ్ అచ్చియ్యమ్మ పిలుపునిచ్చారు. శనివారం కె. అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మొక్కలను పిల్లలతో సమానంగా చూడాలన్నారు. ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటాలని చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమణ, సర్పంచ్ భర్త రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించాలని వినతి


తహసీల్దార్‌కి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మాకవరపాలెం : పెద్దల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ తహసీల్దార్ రమామణికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివలంక కోటేశ్వరరావు, పాలపర్తి తాతబ్బాయి శనివారం వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జి.కోడూరు రెవెన్యూ పరిధిలోని జి. వెంకటాపురం గ్రామస్థులకు గతంలో డిపట్టాలు ఇచ్చారు. ప్రస్తుతం ఆ భూములను కొందరు ఆక్రమించారని ఆరోపించారు.అలాగే సర్వే నంబర్ 737 ప్రభుత్వ భూమిలో కొందరు పెద్దలు 30 నుంచి 40 ఎకరాలు ఆక్రమించి, ఏటా వ్యవసాయం ద్వారా లక్షలాది రూపాయలు పొందుతున్నారని చెప్పారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ బుధవారం సిబ్బందితో సర్వే చేయించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొత్తగా.. గాదిగుమ్మి


వలసంపేట వద్ద గాదిగుమ్మి జలపాతం పరవళ్లు

- కొత్త నీటితో కళకళలాడుతున్న జలపాతం
- అప్రమత్తంగా ఉండాలని పర్యాటకులకు పోలీసుల సూచన

గొలుగొండ మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గాదిగుమ్మి జలపాతం కొత్త నీటితో కళకళలాడుతోంది. కృష్ణాదేవిపేట సమీపంలోని వలసంపేట వద్ద ఉన్న ఈ జలపాతం ఎగువ ప్రాంతాల్లో పడు తున్న వర్షాలతో పొంగి ప్రవహిస్తోంది. సుమారు 40 అడుగుల ఎత్తు నుంచి జరజరమంటూ రాళ్లపై నుంచి పరవళ్లు తొక్కుతోంది. సాధారణ రోజుల్లోనే ఇక్కడి అందాలు పర్యాటకులను కట్టిపడేస్తాయి. వర్షాకాలంలో అయితే ఇక్కడి సుందర దృశ్యాలు వేరే చెప్పనవసరం లేదు. చల్లని వాతావరణం ప్రతి మదిని దోచుకుంటోంది. - కృష్ణాదేవిపేట

పక్కాగా సామాజిక తనిఖీ


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీనారాయణ

గొలుగొండ : మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ పక్కాగా చేపట్టాలని ఎంపీపీ సుర్ల లక్ష్మీనారాయణ సూచించారు. శనివారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ డీఆర్‌పీ, కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఏడాది పాటు జరిగిన ఉపాధి పనులకు సంబంధించిన వివరాలను సర్పం చులు, ఎంపీటీసీ సభ్యులు సామాజిక తనిఖీ బృందాలకు అందజేయాలన్నారు. ఎస్ఆర్‌పీ సూర్యనారాయణ మాట్లాడుతూ మండలంలో గత ఏడాది ఆగస్టు 1వ తేదీ నుంచి ఈఏడాది జూన్ 30వ తేదీ వరకు రూ. 11. 35 కోట్ల పనులు చేపట్టామని చెప్పారు.అలాగే అటవీ భూముల్లో రూ. 23లక్షలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. వీటికి సంబంధించి సామాజిక తనిఖీకి ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఒక్కో పంచాయతీలో నాలుగు రోజుల పాటు తనిఖీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెలాఖరులోగా సామాజిక తనిఖీ పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎంవీ సువర్ణరాజు, ఉపాధి ఏపీఓ సుప్రియ, వెలుగు ఏపీఎం రమణి, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరి ఎంపిక

గొలుగొండ : మండల కేంద్రంలోని కేజీబీవీలో పదో తరగతి చదివిన ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు విద్యాలయం ప్రత్యేకాధికారిణి భవానీ తెలిపారు. శనివారం ఆమె ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. పాఠశాలకు చెందిన లక్ష్మణ, జంపా దేవిక ఈ ఘనత సాధించినట్టు తమకు ఆన్‌లైన్ ద్వారా సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు విద్యార్థినులను ప్రత్యేకాధికారిణి భవానీ, సర్వశిక్షాభియాన్ పీవో శివరామ్ ప్రసాద్, ఎంపీపీ సుర్ల లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు చిటికెల తారక వేణుగోపాల్, ఎంఈఓ నాగేంద్ర అభినందించారు.

చిన్నారులకు పలకలు పంపిణీ


ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పలకలు అందజేస్తున్న సీడీపీవో శ్రీకళ

నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు దాతలు మర్రా అప్పలనర్స, అప్పలరాజు శనివారం పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో ఎం. శ్రీకళ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు దాతలు పలకలు, ఇతర సామగ్రి పంపిణీ చేయడం అభి నందనీయమన్నారు. కేంద్రాల బలోపేతానికి మరింత మంది దాతలు ముందుకువస్తే అద్భుతమైన ఫలితాలు ఉంటాయన్నారు. అనంతరం కొత్తవీధి, పాత సంతబయలు, తవ్వావారి వీధి, ఆలేటి జమ్మయ్యవీధి తదితర కేంద్రాల్లో తల్లులకు, గర్భిణులకు, కిశోర బాలికలకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, కార్యకర్తలు రాజు లమ్మ,ధారమల్లేశ్వరి, పర్వీన్, కృష్ణవేణి, నాగమణి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

మాకవరపాలెం : మండలంలో కొద్ది రోజులుగా జరుగుతున్న రెవెన్యూ సదస్సులు శనివారంతో ముగిసాయి. చివరి రోజు తూటిపాల,మాకవరపాలెం, తాడపాల, ఎన్ఆర్‌పేట, బూరుగుపాలెం, బయ్యవరం గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ కె. రమామణి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వివిధ సమస్యలపై 30 దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో ఎక్కువగా పట్టాదారు పాస్ పుస్తకాలు, అడంగల్, ఆన్‌లైన్ పాసు పుస్తకాల దరఖాస్తులు వచ్చాయన్నారు.రైతులు పట్టాదారు పాసు పుస్తకం కోసం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల్లోనూ దశల వారీగా రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్ఐశ్రీనివాసరావు, వీఆర్‌వో రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ద్వారా మరిన్ని సేవలు

అనకాపల్లి పోస్టల్ సూపరింటెండెంట్ నాయుడు



నర్సీపట్నం టౌన్ : తపాలా శాఖ ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందించాలన్న ఉద్దేశంతో నర్సీపట్నంలోని శారదానగర్ హెడ్ పోస్టాఫీస్‌లో కొత్తగా సబ్ డివిజన్‌ను ఏర్పాటు చేసినట్టు ఆ శాఖ అనకాపల్లి డివిజన్ సూపరింటెండెంట్ కె.ఎల్. నాయుడు తెలిపారు. శనివారం ఆయన ఇక్కడి సబ్ డివిజన్ కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు అనకాపల్లి పోస్టల్ డివిజన్‌లో ఆరు సబ్ డివిజన్‌లు మాత్రమే ఉండేవని, నర్సీపట్నంలో ప్రారంభించిన కేంద్రంతో ఆ సంఖ్య ఏడుకి చేరిందన్నారు. ఇటీవల డివిజన్‌లో 76 కొత్త బ్రాంచి పోస్టాఫీస్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఖాతాదారుల సౌకర్యార్థం, పరిపాలనా పరంగా భవిష్యత్‌లో మరిన్ని సబ్ డివిజన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. తపాలా శాఖ సేవలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు నూతన కార్యాచరణ రూపొందిస్తున్నట్టు తెలిపారు. త్వరలో ఖాతాదారులకు ఏటీఎం కార్డులు కూడా ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం ఐపీ వోలు ఐ. మురళి, కె. సత్యనారాయణ, టి. రవికుమార్, నర్సీపట్నం తపాలా శాఖ పోస్ట్‌మాస్టర్ మహదేవ్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి గణనాథులు

నర్సీపట్నం టౌన్ : వినాయక చవితి పురస్కరించుకుని మార్కెట్‌లో గణనాథుని విగ్రహాలు విక్రయాలకు కొలువుదీరాయి. పట్టణంలోని శ్రీకన్య జంక్షన్, బలిఘట్టం, పెదబొడ్డేపల్లి, అబీద్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రంగు రంగుల వినాయక విగ్రహాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఏడు అడుగుల నుంచి 12 అడుగుల వరకు పెద్ద పెద్ద విగ్రహాలతో పాటు సాధారణ ఎత్తులో ఉండే విగ్రహాలను కూడా అమ్మకానికి సిద్ధం చేశారు. పెద్ద విగ్రహాలు హాలు ఒక్కొక్కటి రూ. 14 వేలు వరకు ఉండగా చిన్న విగ్రహాలు రూ. 20 నుంచి ఉన్నాయి. పండగకు ఇంకా ఏడురోజులే సమయం ఉండటంతో వీధుల్లో చిన్నారులు చందాలను వసూలు చేస్తున్నారు.


శ్రీకన్య జంక్షన్‌లో విక్రయానికి ఉంచిన విగ్రహాలు

పాయకరావుపేట మండలం ఫోన్ నెంబర్లు

పాయకరావుపేట పోలీస్ స్టేషన్	: 08854 254044
ఎంపీడీవో కార్యాలయం	: 9441953611
తహసీల్దార్ కార్యాలయం	: 9441836336
వెలుగు ఏపీఎం	: 9866074067

సినిమా గైడ్

గౌతమ్ : లై
సూర్యమహల్ : జయ జానకి నాయక
సాయిమహల్ : నేనే రాజు నేనే మంత్రి
లక్ష్మీ (ఏసీ) : ఫిదా

అర్హులందరికీ రుణాలివ్వాలి

- ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాస్
- బ్యాంకు అధికారులతో సమావేశం



రుణాలపై సమీక్షిస్తున్న ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాస్

పాయకరావుపేట : ఎస్సీ, బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలను అర్హులందరికీ మంజూరు చేయాలని అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాస్ బ్యాంకు అధికారులకు సూచించారు. శనివారం స్థానిక శ్రీశక్తి భవన్‌లో నియోజకవర్గ పరిధి నాలుగు మండలాల బ్యాంకు అధికారులతో ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యే వంగలపూడి అనిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ ముత్తంశెట్టి మాట్లాడుతూ రుణాలకు సంబంధించి ఇప్పటి వరకు నాలుగు మండలాల అధికారులు తయారు చేసిన జాబితాలు, రుణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ జీవీ ప్రకారం సబ్సిడీ రుణాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు తయారు చేసిన అర్హులకు మాత్రమే మంజూరు చేయాల్సి ఉండగా బ్యాంకు అధికారులు తమ సొంత జాబితాలు ఎందుకు తయారు చేశారని ప్రశ్నించారు. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు సొంత జాబితాలు తయారు చేసి అధికారులపై ఒత్తిడి చేయడం మానుకోవాలన్నారు. బ్యాంకులకు కేటాయించిన యూనిట్ల మేరకు నాలుగు మండలాల అధికారులు గుర్తించిన అర్హులకు మాత్రమే సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. సమావేశానికి అన్ని బ్యాంకుల అధికారులు హాజరుకాక పోవడంపై ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై బ్యాంకు ఉన్నతాధికారులతో మాట్లాడుతానని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓలు ఎ.ఎ.సాంబశివరావు, స్వరూపరాణి, మండల టీడీపీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సహకరించి మాదిగలకు న్యాయం చేయాలని ఎంపీ ముత్తంశెట్టి, ఎమ్మెల్యే అనితకు ఏపీ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు సలికే గోవింద్, నాగేశ్వరరావు, ఎం.తాతారావు తదితరులు వినతిపత్రం అందజేశారు.

సామాజికసేవా దృక్పథం కలిగి ఉండాలి

- విజయ్‌ప్రకాష్
- శ్రీప్రకాష్‌లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట : విద్యార్థులు సామాజిక సేవా దృక్పథంతో ముందుకు సాగాలని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సహాయ కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వీరరాజు మాట్లాడుతూ తమ విద్యార్థులు ఇప్పటి వరకు సుమారు 2 వేల యూనిట్ల రక్తం వివిధ బ్లడ్ బ్యాంకులకు అందజేశారని, శనివారం 150 యూనిట్లు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంక్(విశాఖ) మెడికల్ ఆఫీసర్ ఎ.అశోక్, సూర్యశక్తి వాలంటీర్ బ్లడ్ బ్యాంక్(కాకినాడ) మెడికల్ ఆఫీసర్ కె.కరీముల్లా, స్పేసెస్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి.భాస్కరరావు, పాల్గొన్నారు.

రూ.రెండు లక్షల రికవరీ

కోటవురట్ల: కొడవటిపూడి గ్రామంలో వర్మీకంపోస్టు పాకలు, వానపాములు వేయకపోవడంతో రెండు లక్షల రూపాయల రికవరీ పెడుతూ సోషల్ ఆడిట్ సిబ్బంది నివేదిక ఇచ్చారు. శనివారం మండలంలోని నీలిగుంట, పీకేపల్లి, పందూరు, చౌడువాడ, కొడవటిపూడి, టి.జగ్గపేట, అన్నవరం, చినబొడ్డేపల్లి, పాములవాక గ్రామాల్లో సోషల్ ఆడిట్ గ్రామసభలు జరిగాయి. అక్సాహెబ్‌పేట, చినబొడ్డేపల్లి గ్రామంలో కొబ్బరి మొక్కలు చనిపోవడంపై కూడా ఆడిట్ సిబ్బంది రికవరీకి నివేదిక ఇచ్చారు. పందూరు గ్రామంలో చనిపోయినవారికి పింఛన్లు పంపిణీ చేశారన్న ఆరోపణపై వీఆర్‌వోకు మూడు వేల రూపాయలు రికవరీ చేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సభల్లో ఎస్ఆర్‌పీలు యోషేపు, గోవింద, డీఆర్‌పీలు, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీఎం నాగరాజు, తహసీల్దార్ శ్రీనివాసరావు హాజరయ్యారు.

ఇంటి వద్దకే సిలిండర్లు అందజేయాలి

పాయకరావుపేట : గ్యాస్ సిలిండర్లు ఇంటి వద్దకే అందజేయాలని పాయకరావుపేట ఎమ్మెల్యే అనిత గ్యాస్ కంపెనీ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే సాల్మన్‌పేటలో రోడ్డుపై సిలిండర్లు ఇవ్వడాన్ని గమనించారు. ఈ సందర్భంగా గ్యాస్ కొనుగోలు చేసేందుకు వచ్చిన మహిళలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దీంతో ఆమె స్పందించి ఇంటింటికి సిలిండర్లు అందజేయాలన్నారు.

రంగవల్లి పోటీలు

ఎస్.రాయవరం : ఎస్.రాయవరం మండలం కోనవానిపాలెం గ్రామంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శనివారం రంగవల్లి పోటీలు నిర్వహించారు. ఆ గ్రామంలో శ్రీకృష్ణాలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. పలు ఆకృతులతో వేసిన రంగవల్లులు చూపరులను ఆకట్టుకున్నాయి.

68 పశువులకు గర్భకోశ చికిత్సలు

కోటవురట్ల: కైలాసపట్నం గోపాలమిత్ర కేంద్రంలోని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గర్భకోశవ్యాధి నివారణ చికిత్స శిబిరం నిర్వహించారు. తంగేడు పశువైద్యాధికారి డాక్టర్ జి.వి.ఎం.శిరీషా 68 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. అలాగే 55 దూడలకు ఏలికపాములు మందులు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.సూర్యకళ, సిద్దాబత్తుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక



టీడీపీలో చేరిన అమలాపురం గ్రామస్థులు

పాయకరావుపేట : నక్కపల్లి మండలం అమలాపురం గ్రామానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీలో చేరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమలాపురం టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు ఎరుపిల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో ఎనిమిది మంది పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారిని ఎమ్మెల్యే వంగలపూడి అనిత పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై అధిక సంఖ్యలో టీడీపీలో చేరుతున్నారన్నారు. గ్రామస్థాయిలో పార్టీ మరింత బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట, నక్కపల్లి మండలాల టీడీపీ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, కురందాసు నూకరాజుతోపాటు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులకు సన్మానం చేసిన దృశ్యం

నక్కపల్లి : మండలంలోని ఉద్దండపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు కోడి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సన్మాన సభలో ఉపాధ్యాయులు ఎం.మూర్తిరాజు, ఎంవీ కృష్ణవర్మ, డి.నాగాచారి, ఎం.అప్పారావును దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, బి.మారుతీబాబు, పి.వి.రమేష్‌బాబు, డి.నర్సింహరాజు, టి.సంజీవ్‌కుమార్, జి.సుమబిందు, ఎస్ఎంసీ చైర్మన్ జీని మంగ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతో ఉన్నత శిఖరాలు

- ప్రముఖ సినీ గాయని గోపికాపూర్ణిమ
- ముగిసిన శ్రీప్రకాష్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



బహుమతి పొందిన విద్యార్థులతో గోపికాపూర్ణిమ, విజయ్‌ప్రకాష్ తదితరులు

పాయకరావుపేట : నిరంతరం సాధన చేస్తే ఉన్నత శిఖరాలకు చేరుతామని ప్రముఖ సినీగాయని గోపికాపూర్ణిమ అన్నారు. శనివారం పాయకరావుపేటలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థల 41వ వ్యవస్థాపక దినోత్సవ ముగింపు సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 'గాతా రహే మేరా దిల్' కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రదర్శన అద్భుతమని, మరింత సాధన చేస్తే గాయకులుగా మరిన్ని అవకాశాలు చేజిక్కించుకోగలరని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాల్లో ఆసక్తి కనబరుస్తున్నారని, తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని సూచించారు. విద్యా సంస్థల సహాయ కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ 41 సంవత్సరాలుగా శ్రీప్రకాష్ విద్యార్థులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్నారన్నారు. తమ విద్యార్థులు చదువు, క్రీడలు, విజ్ఞాన రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. అనంతరం గోపికాపూర్ణిమను విజయ్‌ప్రకాష్ ఘనంగా సత్కరించారు. అనంతరం గోపికాపూర్ణిమ పలు సినీగీతాలను ఆలపించారు. అంతకుముందు శ్రీప్రకాష్ విద్యా సంస్థల వ్యవస్థాపక దినోత్సవ ముగింపు సందర్భంగా నిర్వహించిన గాతా రహే మేరా దిల్ ఫైనల్ పోటీలు ఎంతో ఉల్లాసంగా జరిగాయి. జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి, డాక్టర్ కె.వీరరాజు, వి.వి.ఎస్.ఎస్.భానుమూర్తి, వి.వి.ఎస్.బి.బంగార్రాజు, పరేష్‌కుమార్‌దాస్, వి.రవికుమార్, బి.సీతారాణి, శ్రీలక్ష్మి, శ్రీనివాస్, పాయకరావుపేట, తుని, పెద్దాపురం, రాజమండ్రి శ్రీప్రకాష్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పి.ఎల్.పురం గ్రామానికి ఆర్‌ఓ ప్లాంట్‌ను యాజమాన్యం అందజేసింది. సుమారు రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను విద్యా సంస్థల సహాయ కార్యదర్శి విజయ్‌ప్రకాష్ ప్రారంభించారు. మినరల్ వాటర్ బాటిల్‌ని పంపిణీ చేశారు.

వంకా బ్రదర్స్‌కి ఎమ్మెల్యే అనిత పరామర్శ

పాయకరావుపేట : పాయకరావుపేట మండలం వెంకటనగరం గ్రామానికి చెందిన వంకా బ్రదర్స్‌ని ఎమ్మెల్యే వంగలపూడి అనిత శనివారం పరామర్శించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వంకా సత్యనారాయణ, టీడీపీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి వంకా వెంకటరమణ తల్లి ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారిద్దరిని పరామర్శించారు.

సినిమా గైడ్

సీతాచిత్రమందిర్ - లై

తులసీ చిత్రమందిర్ - నేనే రాజు నేనే మంత్రి

పరమేశ్వరి - జయ జానకి నాయక

ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన అవసరం

ఎలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలోని తెరువుపల్లి వార్డులో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి విశ్వనాథం మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆచారి, రమణ, పాల్గొన్నారు.

పురుషోత్తపురంలో పశు వైద్య శిబిరం

ఎలమంచిలి రూరల్ : మండలంలోని పురుషోత్తపురంలో శనివారం ఇంటాస్ బోవి క్యూర, నియోవెట్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం జరిగింది.ఈ సందర్భంగా ఏటికొప్పాక పశు వైద్యాధికారి బానుబాబు మాట్లాడుతూ పశువులు గర్భంతో ఉన్న సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు ఎం.వసుధ హరి ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

గవర్ల అనకాపల్లిలో బ్యాంకు

మునగపాక : తోటాడ పంచాయతీలోని గవర్ల అనకాపల్లిలో ఈనెల 28వ తేదీ నుంచి విజయ బ్యాంకును ప్రారంభించనున్నట్టు బ్రాంచి మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. శనివారం ఆయన ఇక్కడి బ్యాంకు కార్యాలయానికి, ఏటీఎం, స్ట్రాంగ్ రూమ్‌లకు పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వంద బ్రాంచ్‌లు ప్రారంభిస్తున్నారని, అందులో భాగంగా ఇక్కడ కూడా బ్రాంచి ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏబీఎం ప్రసన్నకుమార్, మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్, స్థానిక నేతలు దొడ్డి కోటేశ్వరరావు, పొలమరశెట్టి కుమార స్వామి, పి.నరేంద్ర, పాల్గొన్నారు.

రుణాల మంజూరులో నిర్లక్ష్యం తగదు

మునగపాక : కాపు కార్పొరేషన్ రుణాల మంజూరులో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ.. మండల పరిషత్ కాంప్లెక్స్ వద్ద శనివారం కాపు యువకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది ఎస్‌బీహెచ్ ద్వారా కాపు కార్పొరేషన్ రుణాలు మంజూరయ్యాయని, కానీ చూచుకొండ బ్యాంకు వారు తమకు రుణాలు ఇవ్వలేదని ఆరోపించారు. బ్యాంకు అధికారులు తీరుపై జిల్లా అధికారులకు, కాపు కార్పొరేషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు.

మంత్రి ఆదిపై చర్యలు తీసుకోవాలి

మునగపాక : దళితులను అవమానపరుస్తూ మాట్లాడిన మంత్రి ఆదినారాయణ రెడ్డిని తక్షణమే మంత్రి వర్గం నుంచి తొలగించాలని దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మునగపాక మెయిన్ రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మెయిన్ రోడ్డు నుంచి ర్యాలీగా మండల కాంప్లెక్స్‌కు వచ్చి తహసీల్దార్ రాంబాబుకు, ఎంపీడీవో శాంత లక్ష్మికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సమాలోచన స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ రాజాన బుజ్జి, మాజీ సర్పంచ్ పిట్టా అప్పారావు, గుంట్ల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నృత్యం



విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ మాల్యాద్రి

ఆడేశారు..పాడేశారు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

అలకరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఎలమంచిలి : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె. మాల్యాద్రి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పడుచుకోవాలన్నారు. క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చెప్పారు. లక్ష్య సాధనకు ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఓర్పు నేర్పుతో ముందుకు పోవాలని తెలిపారు. ఎంపీడీఓ సందీప్ మాట్లాడుతూ కళాశాల విద్య ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఎంతగానో దోహద పడుతుందన్నారు. సమయం వృథా చేయకుండా కష్టించి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆనంద్, అధ్యాపకులు వికేటి మహాలక్ష్మి, వి. రాజశేఖర్, పీడీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు



నూకరాజుకి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

సమస్యలు పరిష్కరించండి

అచ్యుతాపురం : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రమేష్‌బాబు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పింఛన్లు పొందని వారిని గుర్తించి తనకు తెలిజేయాలన్నారు. అలాగే పారిశుధ్యం, ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. అనంతరం పెదపాడులో పిడుగుపాటుకి మృతి చెందిన యాళ్ల గంగమ్మ కుటుంబానికి మంజూరైన రూ. 5 లక్షల చెక్కును ఆమె భర్త నూకరాజుకి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసరాజు, జెడ్‌పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ రాజాన రమేష్‌కుమార్, పీలా తులసీరామ్, మేరుగు బాపునాయుడు, పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

మునగపాక : టీడీపీ నియోజకవర్గ నేత సుందరపు విజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు మునగపాక పీఏసీఎస్ కార్యాలయం వద్ద శనివారం 300 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ తన పేరుతో సొంత నిధులు వెచ్చించి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడు కోరుకొండ రామప్రసాద్, ఆస్పత్రి కమిటీ చైర్మన్ విల్లూరి నూకనరసింగరావు, మద్దాల కృష్ణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్

పోస్టల్ సిబ్బంది సమ్మెకు సీఐటీయూ మద్దతు

అచ్యుతాపురం : పోస్టల్ సిబ్బంది సమ్మెకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము అన్నారు. శనివారం ఆయన పోస్టాఫీస్ వద్ద నిరవధిక దీక్ష చేస్తున్న సిబ్బంది వద్దకు వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్ సిబ్బంది ఏళ్ల తరబడి పని చేస్తున్నా...కనీస జీతాలు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలలో సీపీఎం మండల నాయకుడు కె సోమునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

4వ రోజుకు చేరిన సమ్మె

ఎలమంచిలి : గ్రామీణ తపాలా ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం నాటికి నాలుగవ రోజుకు చేరింది. సమ్మె వల్ల సామాన్యులకు తపాలా సేవలతో పాటు ఉపాధి కూలీలకు నగదు చెల్లింపులు నిలిచిపోయాయి. సమ్మెలో పాయకరావుపేట, ఏటికొప్పాక, పెదగుమ్ములూరు, అచ్యుతాపురం, సత్యవరం, ఎస్. రాయవరం బ్రాంచిలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.



ఎలమంచిలిలో సమ్మెలో పాల్గొన్న సిబ్బంది



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న మహిళలు

తాగునీటి సమస్యపై మహిళల వినతి

ఎలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులోని సీపీపేట (ధర్మవరం) కాలనీవాసులు తాగునీటి సమస్యపై మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణకు శనివారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది రోజులు నుంచి వీధిలోని కొళాయిలు రాకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. కొళాయిలకు ముందు ప్రాంతంలోని ట్యాప్‌లు తీసేస్తుండడంతో శివారు ప్రాంతాల్లో ఉన్న వారికి నీరు రావడం లేదని తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే గొడవలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సమీపంలో ఉన్న ప్రభుత్వ బావిని శుభ్రం చేయించాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం

అచ్యుతాపురం రూరల్ : ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని రక్షించాలని స్పందించే హృదయం ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కాండ్రేగుల వెంకటరమణ పిలుపునిచ్చారు. శనివారం ఆ సంస్థ ఆధ్వర్యంలో పెదపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.పీఓపీ వల్ల పర్యావరణ సమతుల్యత లోపిస్తుందన్నారు. అనకాపల్లి, మునగపాక, అచ్యుతాపురం మండలాల్లోని విద్యార్థులకు రెండు వేల మట్టి విగ్రహాలు పంపిణీ చేసి, వాటి ప్రాధాన్యత తెలియజేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.భాస్కర్, సంస్థ ప్రతినిధులు దక్షిణామూర్తి, సుజాత, అప్పారావు, బాబ్జి, పద్మ, గ్రామ పెద్దలు శ్రీనివాసరావు, సత్యనారాయణ, పాల్గొన్నారు.

మడుతూరులో మెగా వైద్య శిబిరం



రక్తదానం చేస్తున్న సుందరపు విజయ్‌కుమార్

అచ్యుతాపురం/రూరల్ : టీడీపీ నియోజకవర్గ నాయకుడు సుందరపు విజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా శనివారం మడుతూరులో మెగా వైద్య శిబిరం జరిగింది. విజయ్‌కుమార్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో విశాఖ ఐ హాస్పిటల్ వైద్యులు రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. అలాగే యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నిర్మల, మడుతూరు సర్పంచ్ జువ్వాల నాయుడు, భాను ప్రసాద్, కళ్యాణ్, నాయుడు, పాల్గొన్నారు.

భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు

రాంబిల్లి : భూసార పరీక్షలు ఆధారంగా రైతులు ఎరువులు వాడాలని అనకాపల్లి రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు జి. పద్మజ, టి.దాసు, ఎం.ఎస్ వసంతకుమారి సూచించారు.శనివారం వారు మామిడివాడలో విత్తనోత్పత్తి పథకం గురించి,రాజుకోడూరు, వాడనర్సాపురం గ్రామాల్లోని రైతులకు యాంత్రీకరణ, ఎరువుల యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. అలాగే వరి నారు కట్టల కొనలు తుంచుట, పొలంలో కాలిబాటలు తీయడంపై ప్రయోగాత్మకంగా రైతులకు చూపించారు. కార్యక్రమంలో ఏఓలు నరసింహనాయక్, గాయత్రి, ఏఈవో ప్రసాద్, ఎంపీఈవోలు వెంకటరమణ, మోహన్, స్వర్ణ,రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రెండు ట్రాక్టర్లకు జరిమానా

ఎలమంచిలి రూరల్ : మండలంలోని రేగుపాలెం సమీపంలో ఉన్న పోలవరం ఎడమ కాలువ నుంచి అక్రమంగా రాయి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలవరం కాలువ అధికారులు శనివారం ఉదయం పట్టుకున్నారు. ఈ మేరకు పోలవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినేర్ రామచందరావు ఒక్కొక్క దానికి రూ వెయ్యి చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ నుంచిఅక్రమంగా గ్రావెల్, రాయి తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.


23న బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

కొత్తూరు : గ్రామ స్వరాజ్య సమితి ఆధ్వర్యంలో ఈ నెల 23న బాల్య వివాహాలపై గ్రామస్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు సమితి కార్యనిర్వాహక కార్యదర్శి బి.రాము తెలిపారు. అనకాపల్లి పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగా గల విజయ రెసిడెన్సీలో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఈ సదస్సు ప్రారంభం కానుందన్నారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర- గౌతమ్‌నంద
శ్రీసత్య - లై
రాజా - జయ జానకి నాయక
షిర్డీసాయి - ఆనందో బ్రహ్మ
పర్తిసాయి- ఫిదా
రామచంద్ర : నేనే రాజు నేనే మంత్రి
శ్రీసత్యనారాయణ : ప్రతిక్షణం

ఘనంగా ఫొటోగ్రఫీ డే



హిమశేఖర్ కళాశాలలో మాట్లాడుతున్న రామ్మోహన్

అనకాపల్లి టౌన్ : పట్టణంలో ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులంతా ద్విచక్ర వాహనాలతో ర్యాలీ జరిపారు. నెహ్రూచౌక్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మెయిన్ రోడ్డు, సుంకరమెట్ట జంక్షన్, గాంధీనగరం, పూడిమడక రోడ్డు మీదుగా సాగింది. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి.రమేష్, కె.కిరణ్, కె.బాబ్జీ, కె.కిరణ్, సంజీవరావు, రవ్వా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'డాక్టర్ హిమశేఖర్'లో...

రింగు రోడ్డులోని డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ ఛాయా చిత్ర కళా దినోత్సవాన్ని నిర్వహించారు. రోటరీక్లబ్, రోటరాక్టు క్లబ్, కళాశాల సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మొబైల్ ఫొటోగ్రఫీని ప్రధాన రంగంగా ఎంపిక చేసి విశ్రాంత అధ్యాపకుడు రామ్మోహన్ దృశ్య శ్రవణ మాధ్యమంతో ఆసక్తికరమైన ఉపన్యాసం ఇచ్చారు. ఛాయ చిత్రకళ ప్రాథమిక అంశాలు, మంచి ఫొటోలు తీయడానికి అవసరమైన మెలకువలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.చిన్నికృష్ణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బుద్ద రమణాజీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్స్ ఆఫీసర్లు కె.రమేష్, ఎంజీ రాజ్‌కుమార్, అధ్యాపకులు కె.సీతారామ్, డి.హిమబిందు, కేబీపీవీ రమణ, కె.మల్లికార్జునరావు, కె.ధర్మలింగం తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

22న బ్యాంకు ఉద్యోగుల సమ్మె

అనకాపల్లి రూరల్ : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 22న దేశవ్యాప్తంగా సమ్మె చేపడుతున్నట్టు ఆంధ్రా బ్యాంకు అవార్డు ఎంప్లాయీస్ యూనియన్ డిప్యూటీ జోనల్ సెక్రటరీ కాండ్రేగుల హరికృష్ణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానంగా బ్యాంకుల విలీనం, కార్పొరేట్ బ్యాంకింగ్, ఖాతాదారులకు సర్వీస్ చార్జీల పెంపు తదితర అంశాలపై సమ్మె చేయనున్నట్టు చెప్పారు. సెప్టెంబర్ ఒకటో తేదీన ఢిల్లీలో లక్ష మంది బ్యాంకు ఉద్యోగులతో పార్లమెంట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నామన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛభారత్



అనకాపల్లి టౌన్ : అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో శనివారం స్వచ్ఛభారత్‌ను నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ఒక్కో రైల్వే స్టేషన్‌లో ఈ కార్యక్రమ నిర్వహణకు అధికారులను రైల్వేశాఖ నియమించింది. అనకాపల్లి స్టేషన్‌కు రైల్వే విజయవాడ డివిజన్ సీనియర్ సెక్యూరిటీ కమిషనర్ ఎస్.ఆర్.గాంధీని నియమించడంతో ఆయన ఇక్కడ ప్రత్యేక దృష్టిసారించారు. గాంధీతో పాటు స్టేషన్ సూపరింటెండెంట్ కొమ్ముశెట్టి పార్థసారథి, ఆర్పీఎఫ్ ఎస్ఐ శ్రీనివాసరావు, అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్, సిబ్బంది చీపుర్లు చేతపట్టి ప్లాట్‌ఫారాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

వయో వృద్ధులు మార్గదర్శకులుగా నిలవాలి

గవరపాలెం : వయో వృద్ధులు యువతకు మార్గదర్శకులుగా నిలవాలని ఆర్డీవో సూర్యకళ కోరారు. శనివారం ఇక్కడ గ్రామీణ వయో వృద్ధుల ప్రజా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. అమెరికా వంటి దేశాలలో 60 ఏళ్లకే రిటైర్‌మెంట్ అనే పద్ధతి లేదని వయో పరిమితితో సంబంధం లేకుండా అక్కడి వృద్ధులు సమాజం కోసం పనిచేస్తుంటారని వివరించారు. అందుకే ఆ దేశాలు అభివృద్ధి బాటలో ఉన్నాయన్నారు. మన దేశంలో కూడా ఆ విధంగా వృద్ధులు ముందుకు సాగాలని కోరారు. మరో ముఖ్యఅతిథి విల్లూరి పైడారావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు, ఎంఎన్ఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో సూర్యకళ

ఐఐఐటీ నూజీవీడుకు జ్యోతిరవళి ఎంపిక

కశింకోట రూరల్ : తాళ్లపాలెం గాయత్రి హైస్కూల్‌లో గత ఏడాది పదో తరగతి చదివిన విద్యార్థిని కె.జ్యోతిరవళి నూజీవీడు ఐఐఐటీకి ఎంపికైనట్టు స్కూల్ కరస్పాండెంట్ బి.రామకుమార్ తెలిపారు. గత ఏడాది పదికి పది పాయింట్లు సాధించడంతో ఆమె సీటు సాధించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆమెను ప్రిన్సిపాల్ వై.నగేష్, కరస్పాండెంట్ రామకుమార్ సత్కరించారు. పాఠశాల కమిటీ అధ్యక్షుడు జీవీఎన్ రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రవళిని అభినందిస్తున్న యాజమాన్యం

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

నెహ్రూచౌక్ : స్థానిక పరుశరాముడిపేట వద్ద గల ఎల్ఐసీ కార్యాలయంలో ఉద్యోగులకు, ఏజెంట్లకు శనివారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.



ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ అధ్యక్షుడు ఆడారి కుమారస్వామి, అనకాపల్లి ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ దుర్గాప్రసాద్, ఎల్ఐసీ ఉద్యోగుల విభాగం అధ్యక్షుడు ఎ.కె.మహేష్, కార్యదర్శి జె.ఎన్.శాసి పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ



కశింకోట రూరల్ : తాళ్లపాలెంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో శనివారం పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన కోటేశ్వరరావును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

కశింకోట రూరల్ : మండలంలోని చింతలపాలెంలో శనివారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళలకు సమావేశం ఏర్పాటైంది. ఈ సందర్భంగా జిల్లా మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు మాణిక్యం మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నా చట్టసభల్లో తగిన ప్రాధాన్యం ఉండడం లేదున్నారు. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కోసం పోరాడాలని, రేషన్ డిపోలలో కందిపప్పు, కిరోసిన్, పామాయిల్ వంటి నిత్యావసర సరకులు యథావిధిగా ఇవ్వాలని కోరారు. జిల్లా ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి బుద్ద శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏడు వారాలుగా ఉపాధి బకాయిలు చెల్లించలేదని ప్రభుత్వం వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రమణమ్మ, కుమారి, లక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మహిళలు

అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర రేపు

అనకాపల్లి రూరల్ : అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని పలు ప్రజా సంఘాల నాయకులు కోరారు. శనివారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితుల చైన్య యాత్ర ఈ నెల 21 అనకాపల్లి చేరుకుంటుందన్నారు. ఇందులో భాగంగా నెహ్రూచౌక్ వద్ద బహిరంగ సభ జరగనుందన్నారు. అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు విజయవంతం చేయాల్సిందిగా కోరారు. నాయకులు వై.ఎన్.భద్రం, కోన లక్ష్మణ్, శ్రీరామదాసు అబ్బులు, ఆడారి అప్పారావు, కోరిబిల్లి శంకరరావు, కర్రి సూర్యనారాయణ పాల్గొన్నారు.

సీతానగరంలో 'జ్యోతిర్భవ' యూనిట్ ప్రారంభం

పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రంలో మహిళలు రాణించాలి : జేసీఐ ప్రతినిధి సతీష్‌బాబు

కొత్తూరు : జూనియర్ చాంబర్ ఇంటర్‌నేషనల్ (జేసీఐ) వైజాగ్ స్టీల్ సిటీ విభాగం ఆధ్వర్యంలో జ్యోతిర్భవ మొదటి యూనిట్ మండలంలోని సీతానగరంలో శనివారం ఏర్పాటైంది. రూరల్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా జేసీఐ సంస్థ ప్రతినిధి ఆర్.సతీష్‌బాబు దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జ్యోతిర్భవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో పరిశ్రమలను నెలకొల్పుతున్నామని చెప్పారు. అనంతరం మొదటి యూనిట్ ప్రారంభోత్సవంలో భాగంగా సీతానగరం గ్రామంలో పేపర్ ప్లేట్ల తయారీ యంత్రాన్ని ప్రారంభించారు. జోన్ అధ్యక్షుడు ఎం.శేఖర్‌బాబు, డైరెక్టర్ జి.జయలక్ష్మి, వైజాగ్ స్టీల్ సిటీ అధ్యక్షుడు సంతోష్ సాహు, కార్యక్రమ నిర్వాహకుడు జి.వంశీధర్, సర్పంచ్ గంగుపాం రామలక్ష్మి, సీతానగరం స్కూల్ చైర్మన్ తెల్లాకుల ప్రకాష్, రాష్ట్ర రైతు రక్షక కన్వీనర్ గంగుపాం నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ సుంకర చంటి తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సతీష్‌బాబు

మట్టి వినాయక విగ్రహాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తూరు : విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన కల్పించేందుకు 'మట్టి వినాయకుడు- పర్యావరణ పరిరక్షకుడు' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు ఏవీఎన్ మూర్తి, బోయిన చిన్నారావు తెలిపారు. కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో శనివారం ఏర్పాటైన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అనకాపల్లి, అచ్యుతాపురం, కశింకోట, మునగపాక మండలాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన కల్పించడంతో పాటు రెండు వేల మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీకేవీ గోవిందరావు, ఉపాధ్యాయులు వర్మ, మహేష్, నాయుడుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల నృత్య ప్రదర్శన భళా



అనకాపల్లి టౌన్ : గవరపాలెం సంతోషిమాత ఆలయం వద్ద శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో విద్యార్థుల నాట్యం విశేషంగా ఆకట్టుకుంది. సాయి నాట్య భారతి అకాడమీ ప్రతినిధి శిరీష ఆధ్వర్యంలో బాలికల నృత్య ప్రదర్శన అందరి ప్రశంసలు అందుకుంది. వీరిని ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తదితరులు అభినందించారు.

ఏఎన్‌ఎంల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు: మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (మహిళ) శిక్షణ కోర్సులో చేరదలచిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో రవి పట్టన్‌శెట్టి తెలిపారు. 2017-18 సంవత్సరానికి నిర్వహించే రెండేళ్ల శిక్షణ కోర్సులో చేరదలచిన అభ్యర్థులకు పాడేరులోనే ప్రభుత్వ గిరిజన ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) శిక్షణ కేంద్రం ఉందన్నారు. ఈ కేంద్రంలో ఉన్న 40 సీట్లలో 21 సీట్లు కోసం అభ్యర్థులను ఐటీడీఏ సంస్థ ఫీజులు చెల్లిస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఆరోగ్య, కుటుంబ సక్షేమ శాఖ వెబ్‌సైట్ లేదా స్థానిక ప్రభుత్వ గిరిజన ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్‌ను తక్షణమే సంప్రదించాలని పీవో సూచించారు.

బక్కలపనుకులో డివిజన్ స్థాయి క్రీడా పోటీలు

పాడేరు రూరల్: సిద్ధివినాయక చవితి సందర్భంగా పట్టణంలోని బక్కలపనుకు వీధిలో డివిజన్ స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహిస్తామని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఏజెన్సీ 11 మండలాలకు చెందిన క్రీడాకారులు తమ జట్ల పేర్లను ఈ నెల 24వ తేదీలోగా స్వయంగా లేదా ఫోన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. పీఎంఆర్సీ భవనం వెనుక ఉన్న మైదానంలో 25వ తేదీ నుంచి పోటీలను నిర్వహిస్తామన్నారు. వాలీబాల్ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.6 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు అందిస్తామన్నారు. అలాగే కబడ్డీ పోటీ విజేతలకు ప్రథమ బహుమతి రూ.7 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు అందించనున్నామని క్రీడా నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 8985194978, 9494698632, 8985382057 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.

ప్రజావాణికి అధికారులు విధిగా హాజరుకావాలి

జి.మాడుగుల: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని వైస్ ఎంపీపీ అంగనైని సన్యాసినాయుడు తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ప్రతీ మంగళవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి పూర్తి స్థాయిలో అధికారులు పాల్గొనడం లేదని, దీంతో మారుమూల ప్రాంతాల నుంచి ఎంతో ఆశతో వచ్చిన గిరిజనులు నిరాశతో వెనుదిరుగుతున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి అన్ని శాఖల అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి హాజరై గిరిజనులు సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

జీసీసీ బంకులో ఆయిల్ కొరత

జి.మాడుగుల: మండల కేంద్రంలో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో ఆయిల్ కొరత ఏర్పడింది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెట్రోల్, డీజిల్ కోసం పాడేరు వెళ్లాల్సి వస్తున్నదని వారు గగ్గోలు పెడుతున్నారు. ఈ విషంలో జీసీసీ అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.


పాడేరు ప్రధాన కూడలిలో తప్పని జన కళ


చినుకులకు చిత్తడిగా ఉన్న పాడేరు రహదారి


కొయ్యూరులో భారీగా పడుతున్న వర్షం

మన్యంలో కొనసాగుతున్న ముసురు

నాలుగు రోజులుగా వదలని వాన

జీకే వీధిలో అత్యధిక వర్షపాతం

పాడేరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఏజెన్సీలో శనివారం కూడా ముసురు వాతావరణం కొనసాగింది. గత నాలుగు రోజులుగా చినుకులు పడుతుండటంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం కలుగుతున్నది. అయితే శనివారం ఉదయం నుంచి వాతావరణం మబ్బులుగా ఉండడం, సాయంత్రం చినుకులు పడటంతో సంచారానికి వీలుకాని పరిస్థితి ఏర్పడుతోంది. నాలుగు రోజుల వర్షానికి పాడేరు పట్టణం చిత్తడిగానే ఉంది. జన సంచారం ఉండే స్థానిక అంబేడ్కర్ కూడలి, మెయిన్ రోడ్డు తాజా వాతావరణంతో కళ తప్పాయి. వర్షానికి పట్టణంలోని రోడ్లు, వీధులు చిత్తడిగా మారాయి. వాన చినుకులు పడుతుండడటంతో గొడుగులు వేసుకునే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే ఏజెన్సీలో పాడేరుతో పాటు అన్ని మండలాల్లోనూ అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి.

గూడెంకొత్తవీధిలో అత్యధిక వర్షం

ఏజెన్సీలో గూడెంకొత్తవీధి శనివారం అత్యధికంగా 140 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. ముంచంగిపుట్టులో 49 మిల్లీమీటర్లు, పెదబయలులో 34, డుంబ్రిగుడలో 31, అరకులోయలో 28, జి.మాడుగులలో 39, పాడేరులో 27, అనంతగిరిలో ఎనిమిది, చింతపల్లిలో 20, హుకుంపేటలో ఏడు, కొయ్యూరులో 75, మిల్లీమీటర్ల వర్షం పాతం నమోదైంది.

కొయ్యూరులో భారీ వర్షం

కొయ్యూరు: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి వర్షం కురుస్తున్నది. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రరూపం దాల్చి మండల వాసులను ఉక్కిరిబిక్కిరి చేసింది. అనంతరం రెండు గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. చిరు జల్లులతో వర్షం ప్రారంభమై రాత్రి భారీగా కురిసింది. శనివారం సాయంత్రం వరకూ వాన పడుతూనే ఉంది. దీంతో రావణాపల్లి, బంగారమ్మపేట, అంతాడ, బకులూరు, బాలారం, కంఠారం, శరభనపాలెం, నడింపాలెం, పి.మాకవరం తదితర పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఖరీఫ్ సాగుకు ఈ వర్షం ఎంతో ఉపకరిస్తుందనే రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీలేరులో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు

సీలేరు: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ధారకొండ పంచాయతీ పరిధిలోని అగ్రహారం, కొంగపాకల వద్ద వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కొండ ప్రాంతాల నుంచి వరదనీరు రావడంతో వంతెనపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో సుమారు 20 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ధారకొండ నుంచి గుమ్మిరేవుల పంచాయతీకి వెళ్లే రహదారిలో ఉన్న కొంగపాకల వాగు కూడా కొండలపై నుంచి వచ్చే వరదనీరు తాకిడికి కొంగపాకల వద్ద వేసిన తూరలు కొట్టుకుపోయాయి.

సంతల్లో వనిత ఫ్యామిలీ కార్డు మేళాలు

పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్ రమేష్

పాడేరు రూరల్: వనిత ఫ్యామిలీ కార్డుల అమ్మకాలను చేపట్టేందుకు వారపు సంతల్లో మేళాలు నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ.. డిపో పరిధిలో సుమారు రెండు లక్షల వరకు తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులు ఉన్నట్టు రెవెన్యూ రికార్డుల ఆధారంగా తెలుసుకున్నామన్నారు. వారిలో ఇంతవరకు సుమారు 1500 మందికి మాత్రమే వనిత ఫ్యామిలీ కార్డులు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ ఏడాది పక్షోత్సవాలుసందర్భంగా పది వేల మందికి వనిత కార్డులు అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. డిపో సిబ్బందిని గ్రూపులుగా విభజించి గిరిజన గ్రామాలకు పంపించి ప్రతీ కుటుంబానికి వనిత కార్డును అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రూ.100 చెల్లించి కార్డు పొందిన కుటుంబానికి అదనంగా మరో రూ.20 తీసుకుని యాడింగ్ కార్డును అందించనున్నామన్నారు. అలా చేయడం వల్ల వేర్వేరు ప్రాంతాలకు వెళ్లే కుటుంబంలో ఉన్న సభ్యులంతా ఆర్టీసీ సేవలను వినియోగించుకోవచ్చని చెప్పారు. ఒకసారి కార్డు పొందిన లబ్ధిదారులు తెలుగు వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రెండేళ్ల పాటు 10 శాతం రాయితీపై ప్రయాణం సాగించవచ్చని తెలిపారు. ఈ రెండేళ్లలో ప్రమాదం సంభవిస్తే ప్రమాద బీమా కింద రూ.2 లక్షలు అందిస్తామన్నారు. వనిత కార్డు పొందదలచిన వారు సంతలో నిర్వహించే మేళాకు వెళ్లి



రూ.100తో పాటు తెల్లరేషన్ కార్డు జెరాక్స్, రెండు పాస్ ఫోటోలు అందిస్తే సరిపోతుందని డీఎం తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

పాడేరు రూరల్: పట్టణంలో వాహనాలను నడిపే వారు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎం.రామారావు మెచ్చరించారు. పట్టణంలో శనివారం విస్తృతంగా వాహనాల తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీల్లో డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని 25 మంది ప్రైవేటు వాహనదారులపై ఆన్‌లైన్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తప్పవన్నారు. వాహనదారులు విధిగా రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు దగ్గరే ఉంచుకోవాలని సూచించారు. అలాగే హెల్మెట్‌ను విధిగా ధరించాలని స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమించినా, పరిమితికి మించి ప్రయాణికులను తరలించినా, వాహనాలను నిర్లక్ష్యంగా నడిపినా కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.


ప్రైవేటు వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్న ఎస్ఐ

కుటీర పరిశ్రమగా పెట్టెతేనె పెంపకం చేపట్టాలి

శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్

చింతపల్లి: ఆదివాసీ రైతులు కుటీర పరిశ్రమగా పెట్టెతేనె పెంపకం చేపడితే అదనపు ఆదాయం పొందవచ్చునని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త, శాస్త్రవేత్త నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. సోమవారం ప్రపంచ తేనెటీగల దినోత్సవం పురస్కరించుకుని బురడవీధి గ్రామంలో తేనె పెట్టెల నిర్వహణ, శాస్త్రీయ పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ, విశాఖ ఏజెన్సీలో పెట్టెతేనె అభివృద్ధికి వాతావరణం అత్యంత అనుకూలంగా ఉందని చెప్పారు. ప్రతీ రైతు పంట పొలాల్లో తేనెపెట్టెలను ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా ఆర్థిక ప్రయోజనం పొందాలని ఆయన సూచించారు.

పెసాతో ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోండి

చింతపల్లి: ఏజెన్సీ ప్రజా ప్రతినిధులు పెసా చట్టాన్ని ఉపయోగించుకుని ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవాలని బీజేపీ కేంద్ర కాఫీబోర్డు సభ్యుడు లోకుల గాంధీ సూచించారు. జర్రెల, మొండిగెడ్డ పంచాయతీల్లో పెసా చట్టం ప్రకారం గ్రామసభ తీర్మానాలు పంపించామని, వీటి ఫలితంగానే పర్యావరణం అనుమతులు, బాక్సైట్ తవ్వకాల ఒప్పందాలను రద్దు చేయడం జరిగిందని చెప్పారు. అలాగే పోలీసు అవుట్‌పోస్టులకు వ్యతిరేకంగా పెసా ప్రకారం తీర్మానాలు చేసి ప్రభుత్వానికి, గవర్నర్‌కు పంపించాలని ఆయన సూచించారు.

ఆంధ్రజ్యోతి
5
మాడుగుల
విశాఖపట్నం। ఆదివారం 20 ఆగస్టు 2017
మాడుగుల • దేవరాపల్లి • కె.కోటపాడు • చీడికాడ

అజాగ్రత్తగా ఉంటే కాలువలోకే...!

- ప్రమాదకరంగా గవరపాలెం రైవాడ కాలువ కల్వర్టు
- బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్న వాహనదారులు


ఇరువైపులా రక్షణ గోడలు లేని రైవాడ కాలువ కల్వర్టు

కె.కోటపాడు : మండలంలోని గవరపాలెం గ్రామంలో రైవాడ కాలువ కల్వర్టు ప్రమాదకరంగా మారింది. జలాశయ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోని కారణంగా శిథిలదశకు చేరుకుంది. దాంతో ఈ కల్వర్టు గుండా ప్రయాణించే వాహనదారులు ప్రమాదటంచున బిక్కు-బిక్కు-మంటూ ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. కల్వర్టు శిథిలదశకు చేరుకుని సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన చెందుతున్నారు. గవరపాలెం గ్రామానికి వెళ్ళాలంటే ఈ కల్వర్టును దాటుకునే వెళ్ళాలి. అలాంటి కల్వర్టు శిథిలమైతే అధికారులు స్పందించకపోవడాన్ని ప్రజలు ఆక్షేపిస్తున్నారు.

ప్రతిరోజూ కల్వర్టు గుండా గవరపాలెం నుంచి రైతులు, ప్రజలు దాలివలస, దీక్షితుల అగ్రహారం, పిండ్రంగి, లంకవానిపాలెం, కొరువాడ తదితర గ్రామాలకు రాకపోకలు చేస్తుంటారు. విద్యార్థులు కొరువాడ ఉన్నత పాఠశాలకు సైకిళ్లపై, కాలినడకన కల్వర్టు మీదుగానే వెళ్తుంటారు. రైతులు కోటపాడు, ఇతర గ్రామాల నుంచి ఎరువులు, విత్తనాలు ఈ రహదారి గుండానే తీసుకువెళ్తారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు కల్వర్టుపై నుంచే రాకపోకలు సాగిస్తాయి. కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడం, శిథలావస్థకు చేరుకోవడంతో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాలువలో పడాల్సిందే. వర్షాల సమయంలో ఈ కాలువ దాదాపు రహదారిని ఆనుకునే ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. రోడ్డంతా బురదమయంగా మారుతుంది. ఒక్కోసారి నీరు రహదారిపై ప్రవహిస్తుంటుంది. దాంతో నీరు తగ్గేవరకూ ఆ మార్గం గుండా రాకపోకలు నిలిచిపోతాయి. కల్వర్టుకు మరమ్మతులు చేపటాల్సిందిగా పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని దాలివలస, దీక్షితుల అగ్రహారం తదితర గ్రామాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించి రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.


పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న అటవీ అధికారి రమేష్‌కుమార్ తదితరులు

మొక్కల పెంపకంతో కాలుష్యం దూరం

అటవీశాఖ అధికారి రమేష్‌కుమార్

దేవరాపల్లి: గ్రామాల పరిధిలో వేసిన మొక్కల సంరక్షణ బాధ్యత ప్రజలు తీసుకోవాలని దేవరాపల్లి అటవీశాఖ అధికారి ఎం.రమేష్‌కుమార్ కోరారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా అనంతగిరి మండలం పెదగంగవరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ రోజూ మొక్కలకు నీరు పోసి సంరక్షించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులను చైతన్యవంతం చేయాలని అన్నారు. గ్రామంలో బాదం, కదంబ, మద్ది తదితర వంద మొక్కలను నాటామని చెప్పారు. హెచ్ఎం బి.రాజేశ్వరి, అటవీశాఖ సిబ్బంది పి.శంకరాచారి, ఎం.వెంకన్న, ఎల్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు


వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రవీంద్రబాబు

దేవరాపల్లి: ఉపాధ్యాయులు తమ వృత్తిని అంకితభావంతో నిర్వర్తించాలని మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రవీంద్రబాబు అన్నారు. మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసి ఇతర మండలాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను శనివారం స్థానిక ద్రోణంరాజు కల్యాణమండపంలో ఘనంగా సత్కరించారు. వారికి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డి చిన్నంనాయుడు, కొటాన శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు నౌడు అప్పారావు, చిరికి శ్రీనివాసరావు, ఆర్.ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రాఫర్స్ దినోత్సవం


రోగులకు పాలు, రొట్టెలు అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు

మాడుగుల: మండల కేంద్రం మాడుగులలో శనివారం ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా జరిగింది. మాడుగుల మండల ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గడ్రెట్టి సుధ, జాంటి తదితరులు మాడుగుల సీహెచ్‌సీలో రోగులకు, వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. సర్పంచ్ దంగేటి సూర్యారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీహెచ్‌సీ వైద్యుడు తిరుపతిరావు, ఫొటోగ్రాఫర్లు కోడూరు కొండలరావు, షేక్ మస్తాన్, ఎం.విజయ్, పి.కొండలరావు, గండేపల్లి నారాయణరావు, పడాల సుధాకర్, టి.సతీష్, కె.రాంభీ, సాధన శ్రీను, చింపులాడ త్రిమూర్తి, టి.శివ, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం


బదిలీ అయిన వైద్యులు, వైద్య సిబ్బందితో సీహెచ్‌సీ సిబ్బంది

కె.కోటపాడు : రోగులకు అందించిన సేవలే వైద్యులు, వైద్య సిబ్బందికి గుర్తింపును తీసుకొస్తాయని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.సరిత అన్నారు.

స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో పనిచేసి బదిలీ అయిన వైద్యులు రెడ్డి జగన్నాథం మంజుల, ఎంఎన్‌వో శ్రీనులను శనివారం ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బదిలీపై వెళ్ళిన వైద్యులు, సిబ్బంది ఆయా ఆస్పత్రిలలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దంత వైద్యురాలు సురేఖ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తుప్పు పట్టిన చేతిబోరుతో అవస్థలు

గొట్టాలు పాడవుతున్నా పట్టించుకోని అధికారులు

మాడుగుల రూరల్ : మండలంలోని కేజే పురం పంచాయతీ కార్యాలయానికి అతి సమీపంలో ఉన్న ఓ చేతిబోరు తుప్పు పట్టి కలుషిత నీరు వస్తోంది. గొట్టాలు సైతం తుప్పు పట్టి బయటకు కనిపిస్తున్నాయి. దీంతో నీరు తోడుతుంటే తుప్పు రేణువులు నీటితో కలిసి వస్తున్నాయని, ఆ నీటిని వాడలేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. అయినా సంబంధిత అధికారులు తుప్పు పట్టిన గొట్టాలను మార్చేందుకు తగిన శ్రద్ధ తీసుకోవడం లేదని చెబుతున్నారు. పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న చేతిబోరును స్థానికులు వాడుకనీటి కోసం ఉపయోగించుకుంటూ ఉంటారు. ఇప్పటికైనా అధికారులు తుప్పు పట్టిన చేతిబోరుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



మూడు రోజుల్లో అక్రమ నిర్మాణాలు తొలగించాలి : తహసీల్దార్ భాగ్యవతి

చీడికాడ: మూడు రోజుల్లో అక్రమ నిర్మాణాలు తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పి.భాగ్యవతి తెలిపారు. చీడికాడ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సర్వే నంబరు 134లో మంచాల గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్వో బొడ్డు మల్లునాయుడు ప్రభుత్వ బంజరు భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని చీడికాడత గ్రామానికి చెందిన ముర్రు కన్నంనాయుడు సిట్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నాలుగు రోజుల క్రితం ఆర్ఐ త్రిమూర్తులు, వీఆర్‌వోలను పంపించగా, వీరిపై మల్లునాయుడు తిరగబడినట్లు తహసీల్దార్ తెలిపారు. శనివారం ఏఎస్ఐ జి.నాగేశ్వరరావు, సిబ్బంది సహాయంతో ఆర్ఐ త్రిమూర్తులు, వీఆర్‌వోలు, వీఆర్ఏలను నిర్మాణాలు తొలగించేందుకు పంపించగా మల్లునాయుడు సంఘటన స్థలంలో లేరన్నారు. ఫోన్‌లో సంప్రదించగా, మూడు రోజులు సమయం అడిగారని తెలిపారు. మూడు రోజుల్లో అక్రమ నిర్మాణాలు తొలగించకపోతే నాలుగో రోజు దగ్గరుండి పోలీస్ బందోబస్తుతో తొలగిస్తామని ఆమె తెలిపారు.

చురుగ్గా సీతారామాలయ నిర్మాణ పనులు



మాడుగుల: మండల కేంద్రంలో టీటీడీ ఆధ్వర్యంలో సీతారామస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను శనివారం టీటీడీ ఇంజినీర్ రవికుమార్ పరిశీలించారు. మూడు నెలల్లో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ ఆలయ నిర్మాణానికి టీటీడీ నిధులు మంజూరు చేసింది. ఈ నిధులు పూర్తిస్థాయిలో సరిపోవని, ఆలయం పూర్తికి భక్తుల నుంచి విరాళాలు సేకరిస్తామని స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


వరి పొలాల గట్లపై కంది విత్తనాలు నాటిస్తున్న ఏవో శైలజ

వరిలో కాలిబాటలపై అవగాహన

బుచ్చెయ్యపేట : వరిలో కాలి బాటలు తీస్తే అధిక దిగుబడిని సాధించవచ్చునని వ్యవసాయాధికారి శైలజ తెలిపారు. చంద్రన్న రైతు క్షేత్రం కార్యక్రమంలో భాగంగా ఆమె శనివారం పొట్టిదొరపాలెం, దిబ్బిడి గ్రామాల్లో వరి పొలాల్లో కాలిబాటలపై రైతుల్లో అవగాహన కల్పించారు. కాలిబాటలు తీయడం వలన పంటకు గాలి, వెలుతురు సమృద్ధిగా అందడంతో పిలకలు అధికంగా వస్తాయన్నారు. చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. ఎరువులు వేసుకోవడానికి, రసాయనిక మందులు పిచికారీ చేసుకోవడానికి కాలిబాటలు అనుకూలంగా ఉంటాయన్నారు. అనంతరం పొలం గట్లపై కంది విత్తనాలను నాటించారు.

కొనసాగుతున్న పోస్టల్ ఉద్యోగుల సమ్మె


సమ్మె చేస్తున్న పోస్టల్ సిబ్బంది

రావికమతం: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె విరమించేది లేదని గ్రామీణ తపాలా ఉద్యోగులు హెచ్చరించారు. శనివారం స్థానిక తపాలా కార్యాలయం ఎదుట వీరు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎల్‌టీ ఆచారి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గ్రామీణ తపాలా ఉద్యోగులపై నిర్లక్ష్యం చూపుతూ చాలీచాలని వేతనాలతో పని చేయిస్తోందన్నారు. తమను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, కమిలేష్‌చంద్ర కమిటీ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌లు అంగీకరించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీవీఎన్.మూర్తి, వీవీఎన్.లక్ష్మి, సీహెచ్.సత్యరాజు, ఏవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాల శిక్షణకు అభ్యర్థుల ఎంపిక

చోడవరం: ఎయిర్‌ఫోర్స్‌లో ఎయిర్‌మెన్ ఉద్యోగాల భర్తీకి వచ్చే నెల జరగనున్న రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శిక్షణకు శనివారం పట్టణంలో ఎంపిక నిర్వహించారు. ఎంపికైన వారికి నెల రోజులపాటు ఫోర్ ఎస్ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నారు. వివిధ మండలాల నుంచి అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఫోర్ ఎస్ కళాశాల చైర్మన్ నాగిరెడ్డి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఎంపికకు హాజరైన అభ్యర్థులు

పాఠశాల సమీపంలో మద్యం దుకాణం తొలగించాలి

- కిత్తంపేట గ్రామస్థుల డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా


షాపు నిర్వాహకులతో ఘర్షణ పడుతున్న మహిళలు


ధర్నా చేస్తున్న కిత్తంపేట గ్రామస్థులు

రావికమతం: మండలంలో దొండపూడి గ్రామ శివారు కిత్తంపేట వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన విజయదుర్గ వైన్ షాపును అక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ కిత్తంపేట గ్రామస్థులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కర్రి అర్జున మాట్లాడుతూ కిత్తంపేట గ్రామం నుంచి రోజు 40 మంది విద్యార్థినీ, విద్యార్థులు దొండపూడి ఉన్నత పాఠశాలకు వస్తున్నారన్నారు.

ఈ హైస్కూల్‌కు వెళ్లే రహదారిలోనే వైన్‌షాపు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థినులతోపాటు గ్రామస్థులు కూడా మందుబాబుల వల్ల ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. ఈ షాపు కిత్తంపేట వెళ్లే రహదారిని ఆనుకొని ఉండటంతో షాపును ఆనుకొని జీడితోటలు కూడా ఉన్నాయని, దీంతో మందుబాబులు తోటల్లో మకాం వేసి రహదారి గుండా వచ్చేవారిని వేధించే అవకాశం ఉందని, ఈ దృష్ట్యా షాపు అనుమతులు తక్షణమే రద్దుచేయాలని, లేనిపక్షంలో వేరొక చోటుకు మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సిద్ధయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. అంతకు ముందు వైన్‌షాపు ముందు మహిళలు, గ్రామస్థులు ఆందోళనకు దిగడంతో షాపు నిర్వాహకులు, గ్రామస్థులకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇక్కడ షాపు వద్దని గ్రామస్థులు అభ్యంతరం తెలపడంతో ప్రభుత్వం తమకు అనుమతులు ఇచ్చిందని, మీరు చెప్పినంత మాత్రాన షాపును వేరొక చోటకు మార్చే ప్రసక్తి లేదంటూ నిర్వాహకులు గ్రామస్థులతో వాగ్వివాదానికి దిగారు.

దీంతో వారంతా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. తహసీల్దార్ సిద్ధయ్యతో పాటు చోడవరంలోని ఎక్సైజ్ సీఐ వద్దకు వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి మణెమ్మ, సీహెచ్.జగ్గమ్మ, అడ్డూరు నారాయణమ్మ, రాజాన లక్ష్మి, కరెడ్ల నాగేశ్వరరావు, చేకూరి లక్ష్మి, కర్రి రమణమ్మ, అద్దెపల్లి దాలినాయుడు, మట్టా చినతల్లి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎంపీడీవో కొండలరావు

బుచ్చెయ్యపేట : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీవో టి.కొండలరావు సూచించారు. మన గ్రామం-మన విశాఖ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మంగళాపురంలో ఆయన పర్యటించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. రక్షిత మంచినీటి పథకం పనితీరును పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ చేతి బోర్లు, వాటర్ ట్యాంకులకు తరుచూ క్లోరినేషన్ చేయించాలన్నారు. కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయించాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నిల్వ ఉన్న చేపలు, మాంసం తినరాదని అన్నారు. జ్వరాలు సోకితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. కాగా నిర్మాణం పూర్తి చేసిన వ్యక్తిగత మరుగుదొడ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని సర్పంచ్ పత్తి రాము విజ్ఞప్తి చేశారు. రెండు వారాల్లో చెల్లింపులు చేపడతామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. మండల ఇంజనీర్ జగన్నాథం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సుబ్బలక్ష్మి, హౌసింగ్ ఏఈఈ శ్రీపాణి, ఏవో శైలజ, హెచ్‌ఎం తమరాన త్రినాథరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో కొండలరావు

21న అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర

బుచ్చెయ్యపేట : తమను ఆదుకోవాలని కోరుతూ అగ్రిగోల్డ్ బాధితులు ఈ నెల 16న చేపట్టిన చైతన్య యాత్ర 21న అనకాపల్లి చేరకుంటున్నందున మండలంలో బాధిలందరూ ఆ యాత్రలో పాల్గొనాలని పేద ప్రజల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఆకుల నాగేశ్వరరావు కోరారు. అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటామని సీఎం నారా చంద్రబాబునాయుడు మార్చిలో జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఇచ్చిన హామీని సత్వరంగా అమలు చేయాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు బాధితులంతా చైతన్యయాత్ర చేపట్టారన్నారు.

లోసింగిలో వైద్య శిబిరం

రోలుగుంట : మండలంలోని బుచ్చెంపేట ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి కుసుమ మౌనిక, ఎంపీహెచ్‌ఈవో అప్పలనాయుడు, ఏఎన్‌ఎం సుజాత శిబిరంలో పాల్గొన్నారు. 30 మందికి పైగా గిరిజనులకు రక్తపూతలు తీశారు. ఒకరికి సాధారణ జ్వరం తప్ప మిగిలిన వారికి ఎటువంటి జ్వరాలూ లేవని వైద్యులు తెలిపారు. సూపర్‌వైజర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై రైతు సహాయ కేంద్రం

రోలుగుంట : మండలంలోని రైతులు తమకు ఎటువంటి భూ సమస్యలున్నా లేదా వెబ్‌ల్యాండ్‌లో నమోదైన భూమి వివరాలను సరి చూసికోవడానికి రోలుగుంటలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని స్వరాజ్ అభియాన్ కన్వీనర్ చక్రధర్ తెలిపారు. వెబ్ ల్యాండ్ పేరుతో భూమి రికార్డులను నిర్వహించడం మొదలుపెట్టిన తరువాత రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వీటిపై అవగాహన కల్పించడానికే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సహాయ కేంద్రం ఉదయం 11 నుండి సాయింత్రం 4 గంటల వరకు ఉంటుదన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

చోడవరం రేంజ్ అధికారి రాజు


విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు


మొక్కలు నాటుతున్న రేంజర్ రాజు తదితరులు

రావికమతం: అంతరించిపోతున్న పచ్చదనాన్ని తిరిగి కాపాడుకొనేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సోషల్ ఫారెస్ట్ చోడవరం రేంజ్ అధికారి ఎన్‌ఎస్‌బీ రాజు కోరారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆయనతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తురాయి, నేరేడు, వేప, మహాగని, బాదం మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులకు వనం-మనంపై వక్తృత్వ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, పెరుగుతున్న జనాభాతోపాటు కాలుష్యం కూడా పెరుగుతోందని, దీనికి దీటుగా మొక్కలను నాటడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చని అన్నారు. సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో చోడవరం రేంజ్ డివిజన్‌లో 17.1 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వీటిని పాఠశాలలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో, రోడ్లుకు ఇరువైపులా, చెరువు గట్ల పైనా నాటుతున్నామన్నారు. ఇప్పటికే ఏడు లక్షల మొక్కలు నాటామన్నారు. అనంతరం విద్యార్థులకు ఉసిరి, గోరింట, సువర్ణగన్నేరు, తులసి, దానిమ్మ, నిమ్మ తదితర మొక్కలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుమ్ముడు ప్రకాశరావు, స్కూల్ కమిటీ చైర్మన్ మజ్జి నరసింగరావు, ఎఫ్‌ఎస్‌వో ఎన్.కృష్ణ, సామాజిక వనమిత్రులు కొండలరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

- నిరుపయోగంగా ఏఎల్‌పురంలోని హోమియో వైద్య శాల
- మూడు నెలల క్రితం వైద్యుడు, ఫార్మాసిస్టుకి బదిలీ
- గత నెలలో అటెండర్ పోస్టు మాత్రమే భర్తీ
- సిబ్బంది కొరతతో రోగులకు అందని సేవలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పేరుకే ఆస్పత్రి..!

కృష్ణాదేవిపేట : ఏఎల్‌పురం గ్రామంలోని హోమియో వైద్య శాల నిరుపయోగంగా ఉంది. సిబ్బంది లేకపోవడంతో మూడు నెలలుగా ఆస్పత్రిని మూసివేశారు. దీంతో రోగులు వైద్య సేవలు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ అటెండర్‌సురేష్‌కుమార్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మంత్రి అయ్యన్న దత్తత గ్రామమైన ఏఎల్‌పురంలో 30 ఏళ్ల క్రితం హోమియో వైద్యశాల ఏర్పాటు చేశారు. మూడు నెలల క్రితం ఇక్కడి వైద్యాధికారి లక్ష్మీశైల, ఫార్మాశిస్టు ప్రసాద్‌కి బదిలీ అయ్యింది.అప్పటి నుంచి ఈ పోస్టులు భర్తీ చేయకపోవడంతో రోగులకు సేవలు అందడం లేదు. ఈ ఆస్పత్రి ద్వారా కొయ్యూరు, గొలుగొండ మండలాల చెందిన వంద గిరిజన, మైదాన ప్రాంతాల రోగులకు సేవలు అందుతున్నాయి. అయితే మూడు నెలలుగా వైద్యులు లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయమై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు రావడంతో గతనెల 26వ తేదీన అటెండర్ పోస్టును భర్తీ చేశారు. దీంతో నెల రోజులుగా ఆస్పత్రి తెరుస్తున్నారు కానీ వైద్యులు లేక సేవలు అందడం లేదు.ఇప్పటికైనాపాలకులు, అధికారులు స్పందించి ఆస్పత్రిలో వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా ఈ విషయమై జిల్లా హోమియో విభాగం ఆర్‌డీడీ డాక్టర్ శేఖర్ వద్ద ప్రస్తావించగా జిల్లా వ్యాప్తంగా వైద్యాధికారుల పోస్టులు కొరత ఉందన్నారు. కొత్త పోస్టులు భర్తీ చేసే వరకు ఈ సమస్య తప్పదని తెలిపారు. 20 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఎవరైనా అందుబాటులో ఉంటే డిప్యూటేషన్‌పై వారానికి రెండు, మూడు రోజులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చాలా ఇబ్బంది పడుతున్నాం



ఏళ్ల తరబడి హోమియో వైద్య సేవలు పొందుతున్నాను. బదిలీ పేరుతో ఆ కారణంగా ఇక్కడ విధులు నిర్వర్తించే వైద్యాధికారిని, ఫార్మాశిస్టును బదిలీ చేశారు. దీంతో మాకు సక్రమంగా సేవలు అందడం లేదు. ప్రతి రోజూ ఆస్పత్రికి వస్తున్నాను. అటెండర్ మాత్రమే ఉండడంతో మందులు తీసుకుని వెళ్లిపోతున్నాను.

బోడ్డు వెంకినాయుడు, ఏఎల్‌పురం

వైద్యులను నియమించాలి



ఆస్పత్రిలో తక్షణమే వైద్యుడ్ని నియమించాలి. దీర్ఘకాలిక, సాధారణ వ్యాధులకు సంబంధించి ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నాం. ఉన్నతాధికారులు ఇక్కడి వైద్యుడిన బదిలీ చేసి, ఆ స్థానాన్ని భర్తీ చేయలేదు. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి పోస్టులను భర్తీ చేయాలి.

ఆడ్లబోయిన త్రిమూర్తులు, కేడీపేట

ఇళ్ల నిర్మాణాలకు జియో ట్యాగింగ్

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి జియో ట్యాగింగ్ శరవేగంగా జరుగుతోంది. సర్వే సిబ్బంది గ్రామాల్లో పాత, కొత్త ఇళ్ల నిర్మాణాలకు కొలతలు వేసి, నంబర్లు వేస్తున్నారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ వై. త్రిమూర్తులు మాట్లాడుతూ ఇంటి యజమానులు ఇంటి వివరాలు, ఫోన్ నంబర్ తెలిపేందుకు అందుబాటులో ఉండాలని కోరారు. ప్రస్తుతం ఏఎల్‌పురంలో సర్వే జరుగుతుందని,పదిరోజులు ఉంటుందని చెప్పారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి ఆనంద్, సిబ్బంది దేవత, రాజు ఉన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేయాలి



ఎంఈవో కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ శైలజ, తదితరులు దృశ్యం

నర్సీపట్నం : నూతన పెన్షన్ విధానం పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ వచ్చేనెల 1వ తేదీన విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్ వాల్ పోస్టర్లను ఎంఈఓ సాయిశైలజ శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎస్ సమన్వయకర్త జి.దేముడు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌నుపునరుద్ధరించాలని కోరుతూ విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి బిషరప్ అజరయ్య బాలికోన్నత పాఠశాల మైదానం వరకు వేలాది మంది ఉద్యోగులతో జరిగే ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ కో-కన్వీనర్ రమణ, డీవీఆర్ మూర్తి, బ్రహ్మాజీ, సూర్యప్రకాష్, బాలాజీ, దుర్గాప్రసాద్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బస్సు యాత్ర రేపు

నర్సీపట్నం : అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి తలపెట్టిన బస్సు యాత్ర సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని అబీద్ సెంటర్‌కు చేరుకుంటుందని నర్సీపట్నం అగ్రిగోల్డ్ కస్టమర్ అసోసియేషన్ సంస్థ ప్రతినిధులు బాలేపల్లి వెంకటరమణ, ఎం.రామునాయుడు, జి.గురుబాబు, ఆర్.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు వచ్చే బస్సు యాత్రకు బాధితులంతా స్వాగతం పలకాలన్నారు. యాత్ర ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు జరుగుతుందన్నారు. బాధితుల సమస్యలు తెలుసుకుని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే దీని ఉద్దేశమన్నారు. మరిన్ని వివరాలకు 9030825028/9490950365 సెల్ నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

అప్పన్నదొరపాలెంలో పొలం పిలుస్తోంది



రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో ఝాన్సీలక్ష్మి

నర్సీపట్నం రూరల్ : వరి నారుమళ్లకు తెగుళ్లు సోకకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం ఏఓ కె. ఝాన్సీలక్ష్మి సూచించారు. శనివారం అప్పన్నదొరపాలెంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 14 వారాల పాటు ఇకపై ప్రతి వారం రైతులతో క్షేత్రస్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. తెగుళ్లు సోకినట్టయితే వెంటనే తమను సంప్రదించి, అవసరమైన సలహాలు, సూచనలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం నీటి యాజమాన్య పద్ధతులు, పంటలకు వచ్చే చీడపీడల గురించి ఆమె రైతు లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఉష, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల విజేత నింజాస్

నర్సీపట్నం టౌన్ : పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఇటీవల జరిగిన జిల్లా రూరల్ గేమ్స్ కరాటే ఛాంపియన్ షిప్‌లో నింజాస్ విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీ గెలుచుకున్నారు. ఈ మేరకు మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు శనివారం విజేతలకు ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణ రావు తనయుడు సుధీర్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో నింజాస్ స్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ చూపారన్నారు. కాగా ఈ పోటీల్లో పాయకరావుపేటకు చెందిన క్రీడాకారులు ద్వితీయ బహుమతి పొందారు. గెలుపొందిన వారుత్వరలో జరిగే రాష్ట్ర రూరల్ గేమ్స్‌లో పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేష్, నింజాస్ అకాడమీ కార్యదర్శి బంగారు నాయుడు, డైరెక్టర్‌లు రత్నకుమారి, బేబీరాణి, మల్లికా, విజయ్, కోచ్‌లు కె. అబ్బు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోపీ అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు

అంగన్‌వాడీ నిర్వహణపై ఎంపీపీ అసంతృప్తి

నర్సీపట్నం టౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఒక్కొక్క చోట ఒక్కొక్కలా ఉం టుందని ఎంపీపీ సుకల రమణమ్మ అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఆమె వేములపూడి గ్రామంలోని కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కార్యకర్త రేవతి సెంటర్‌లో మధ్యాహ్నం 1.30 గంటకే చిన్నారులు లేకపోవటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదేనా కేంద్రాన్ని నిర్వహించే తీరంటూ కార్యకర్తను ప్రశ్నించారు. కేవలం ఐదుగురు చిన్నారులు మాత్రమే ఉండడంతో విస్తుపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తున్నారంటేనే పిల్లలును ఉంచుతారా లేకపోతే తీసుకురారా అంటూ నిలదీసారు. ఇటువంటి సంఘటన మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలని కార్యకర్తను హెచ్చరించారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి



చంద్రన్న బీమా పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ రమణమ్మ

నర్సీపట్నం రూరల్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రమణమ్మ సూచించారు. శనివారం వేములపూడి పంచాయతీ శివారు అప్పన్నపాలెంలో జరిగిన మనఊరు-మన విశాఖ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంతకుముందు ఆమె గ్రామంలో ఇటీవల మృతి చెందిన సుర్ల సత్తిబాబు కుటుంబ సభ్యులకు చంద్రన్న బీమా పథకం కింద వచ్చిన 25 వేల రూపాయల మంజూరు పత్రాన్ని ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణబాబు, సర్పంచ్ కుమారిలక్ష్మి పాల్గొన్నారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి

నర్సీపట్నం టౌన్ : జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే విద్యార్థి దశలో ఎంచుకునే లక్ష్యం ఉన్నతంగా ఉండాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైనదని, ఆ దశలో తీసుకునే నిర్ణయాలు కచ్చితమైనవిగా, లక్ష్యాన్ని చేరుకోగలిగేలా ఉండాలన్నారు.నేటితరం విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ తక్కువగా ఉంటున్నాయని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగమే కోరుకుంటున్నారని, దీనికి కఠోర దీక్ష అవసరమన్నారు. ఎస్‌బీఐ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ చదువుకోవాల్సిన సమయంలో చదువుకోవాలని, ఎంజాయ్ చేసే సమయంలో ఎంజాయ్ చేయాలన్నారు. అందుకు విరుద్ధంగా చేస్తే జీవితాలు అగమ్యగోచరంగా మారుతాయన్నారు. రాబోయే రోజుల్లో బ్యాంకింగ్ రంగంలో వేల సంఖ్యలో ఉద్యోగావకాశాలు ఉన్నాయని,డిగ్రీ పూర్తి చేసిన వెంటనే బ్యాంకు ఉద్యోగాలకు శిక్షణ తీసుకుంటే మంచిదన్నారు. అంతకుముందు అతిథులకు కళాశాల యాజమాన్యం జ్ఞాపికలు అందజేసారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శేషగిరిరావు, కరస్పాండెంట్ గాడి సత్యవాణి, డైరెక్టర్ బి.దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యుడు రాజశేఖర్

వెంకటనగరం రోడ్డులో...
ప్రయాణం నరకం



- రోడ్డు నిండా గోతులు
- వర్షం వస్తే నిలిచిపోతున్న నీరు
- నిధులు మంజూరైనా ప్రారంభంకాని పనులు

పాయకరావుపేట :మండలంలోని వెంకటనగరం రోడ్డులో ప్రయాణం చేయాలంటే నరకంలా ఉందని పలువురు వాహనదారులు అన్నారు. రోడ్డు అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు నిధులు రూ.50 లక్షలు మంజూరై రెండేళ్లు కావస్తున్నా పనులు ప్రారంభం కాలేదు. ఈ రోడ్డుకు ఎప్పుడు మోక్షం కలుగుతుందని ఆ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో కేశవరం దాటిన తరువాత జంక్షన్ నుంచి వెంకటనగరం వరకు సుమారు రెండు కిలో మీటర్లున్న రహదారి తీరప్రాంత ప్రజల రాకపోకలకు, చేపలు, రొయ్యేల రవాణాకు ఎంతగానో ఉపయోగపడుతోంది. దశాబ్దాలుగా ఈ రోడ్డు కనీస నిర్వహణకు నోచుకోకపోవడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడి రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. 2012లో సంభవించిన



గోతులమయంగా మారిన రహదారి

నీలం తుపాను, ఆ తర్వాత వచ్చిన హుద్‌హుద్ తుపానులో మరింత అధ్వానంగా తయారైంది. దీంతో వెంకటనగరం, రాజానగరం గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ మాత్రం వర్షం పడినా సమస్యలు రెట్టింపు అవుతున్నాయి. ఆస్పత్రులకు వెళ్లే దీర్ఘకాల రోగులు, గర్భిణుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. చేపలు, హెచరీల ఉత్పత్తులతో రాకపోకలు సాగించే వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. స్థానిక నాయకులు ఈ విషయాన్ని పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత దృష్టికి తీసుకు వెళ్లారు. ఇందుకు ఆమె స్పందించి వెంకటనగరం రోడ్డు పునర్నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నిధులు రూ.50 లక్షలు మంజూరయ్యేలా కృషి చేశారు. నిధులు మంజూరై రెండేళ్లు కావస్తున్నా ఇంకా పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న వెంకటనగరం రోడ్డును వెంటనే పనురుద్ధరించాలని కోరుతున్నారు.

మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలి

- ఉత్సవ కమిటీలను చైతన్యపరచాలి
- దండోర వేయాలని కార్యదర్శులకు సూచన
- మండలాలకు చేరిన పీఆర్ కమిషనర్ ఉత్తర్వులు

నక్కపల్లి : గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేవారు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయన ఆధారిత రంగులు ఉపయోగించి తయారు చేసిన గణపతి విగ్రహాలకు బదులు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసేలా చైతన్యపరచాలని జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి ఆదేశించారు. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ బి. రామాంజనేయులు జారీ చేసిన ఉత్తర్వులను మండలాలకు పంపించారు. పర్యావరణానికి హాని కలిగించే విగ్రహాలకు బదులు పర్యావరణాన్ని కాపాడే మట్టి విగ్రహాలనే పూజించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై వుందన్నారు. ఈ మేరకు అన్ని గ్రామాల్లోనూ దండోరా వేయించాలని ఈవోఆర్‌డీలను ఆదేశించారు. దీనిపై ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి స్పష్టమైన సూచనలు చేశామని నక్కపల్లి ఈవోపీఆర్‌డీ పీఎస్ కుమార్ చెప్పారు.

ఉపమాకలో అన్నమాచార్య కీర్తనల ఆలాపన



అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న మహిళలు

నక్కపల్లి : మండలంలోని ఉపమాక వెంకటేశ్వరస్వామి క్షేత్రంలో శనివారం విశాఖపట్నం ఎంవీపీ కాలనీకి చెందిన సద్గురు నిలయానికి చెందిన మహిళా భక్తులు అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ప్రధానార్చకుడు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో కొండపైన, దిగువ ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ సద్గురు నిలయం మహిళా భక్తులు పాడిన శ్రీహరి పాటలు, అన్నమాచార్య కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆక్రమణలు లేకుండా చూడాల్సిన బాధ్యత వీఆర్‌ఓలదే : తహసీల్దార్

నక్కపల్లి : మండలంలో ప్రభుత్వ స్థలాలు, చెరువులు ఆక్రమణకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత వీఆర్వోలపై వుందని తహసీల్దార్ రాణీఅమ్మాజీ అన్నారు. శనివారం వీఆర్వోలతో ఆమె సమావేశమయ్యారు. గ్రామాల వారీగా చెరువులు, ప్రభుత్వ భూములపై సమగ్ర నివేదికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. నీటి తీరువా వసూళ్లు, ఇతర అంశాలపై ఆమె చర్చించారు. భూ ఆక్రమణలు జరిగినా, రికార్డులను తారుమారు చేసే ప్రయత్నం చేసినా కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు.

ఎస్.రాయవరంలో వనమహోత్సవం

ఎస్.రాయవరం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వన మహోత్సవ కార్యక్రమాన్ని అటవీశాఖ అధికారులు నిర్వహించారు. ఎలమంచిలి సామాజిక అటవీశాఖాధికారి మస్తాన్ వల్లీ, ఎస్.రాయవరం సర్పంచ్ లక్కోజు ఆదిమూర్తి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదిమూర్తి మాట్లాడుతూ మొక్కలు పెంపకం వల్ల పర్యావరణాన్ని కాపాడవచ్చునని, కాలుష్యాన్ని అరికట్టవచ్చునని చెప్పారు. అటవీశాఖ నర్సరీల నుంచి మొక్కలను గ్రామ పంచాయతీలకు అందజేస్తున్నామని అటవీశాఖాధికారి మస్తాన్‌వల్లీ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, ఖాళీ స్థలాలు, రహదారులకు ఇరువైపులా మొక్కలు పెంచాలని కోరారు. ఇందులో మండల విద్యాశాఖాధికారి ఏఎన్ఎన్



మొక్కలు నాటుతున్న దృశ్యం

మూర్తి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భాగ్యశ్రీ, హెచ్‌ఎం కర్రి గణేష్, వైసీపీ నాయకుడు కొమ్ము జగదీష్ పాల్గొన్నారు.

3 నుంచి ఇంటింటికీ తెలుగుదేశం

పాయకరావుపేట : పాయకరావుపేట నియోజకవర్గంలో సెప్టెంబర్ 3వ తేదీ నుంచి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వంగలపూడి అనిత అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పార్టీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిత మాట్లాడుతూ నియోజకవర్గంలో రోజుకు రెండు గ్రామాల చొప్పున రెండు నెలలపాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామస్థాయిలో పార్టీ మరింత బలోపేతమయ్యేలా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కారానికి పార్టీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిత

శ్రేణులు సమన్వయంతో కృషి చేయడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల టీడీపీ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, కురందాసు నూకరాజు, లాలం కాశీనాయుడు, వెంకటరాజు నక్కపల్లి ఎంపీపీ లావణ్య, టీడీపీ నాయకులు పెదిరెడ్డి శ్రీను, యాళ్ళ వరహాలబాబు, బొంది కాశీవిశ్వనాథం, కంకిపాటి వెంకటేశ్వరరావు, నీలాపు మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పెట్టుబడి రాయితీ రూ.1.24 కోట్లు మంజూరు

- ఉద్యానవన తోటలు పెంచే రైతులకు త్వరలో పంపిణీ
- అనకాపల్లి వ్యవసాయశాఖ భూసంరక్షణశాఖ ఏడీ సుజాత

పాయకరావుపేట :జిల్లాలోని 2016-17లో వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం కింద ఉద్యానవన తోటలు పెంచుతున్న రైతులకు పెట్టుబడి రాయితీ రూ.1.24కోట్లు మంజూరైందని అనకాపల్లి వ్యవసాయశాఖ భూ సంరక్షణశాఖ ఏడ జి.సుజాత తెలిపారు. శనివారం సత్యవరం గ్రామంలో అర్హులైన తమలపాకు రైతుల తోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్యవరంలో తమలపాకు, నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లులో సరుగుడు తోటలు వేసిన రైతులకు త్వరలో అందజేస్తామన్నారు. ఎకరానికి రూ.10 వేలు పెట్టుబడిరాయితీగా అందజేస్తామని తెలిపారు. గత ఏడాది జూన్‌లో ఈ పథకం ప్రారంభమవ్వగా పాయకరావుపేట మండలం సత్యవరం,



తమలపాకు తోటలను పరిశీలిస్తున్న సుజాత

చింతపల్లి తప్పించి మిగిలిన మూడు క్లస్టర్లలో పెట్టుబడి రాయితీ పంపిణీ చేశామన్నారు. సత్యవరం క్లస్టర్‌లో వంద ఎకరాల తమలపాకు తోటలకు రూ.10 లక్షలు, ఎస్‌పీఎస్‌లో 12.5 ఎకరాల సరుగుడు తోటలు ఎకరానికి రూ.6వేలు చొప్పున పెట్టుబడి రాయితీ పంపిణీ చేస్తామన్నారు. అలాగే గోడౌన్లు నిర్మించుకునేందుకు ఎస్సీ, జనరల్ కెటగిరీల్లో ఇద్దరు రైతులకు రూ.2 లక్షలు చొప్పున సబ్సిడి మంజూరు చేస్తామన్నారు. సత్యవరంలో తమలపాకు తోటలు ఎక్కువగా కౌలు రైతులు 10 నుంచి 50 సెంట్లలోపు సాగు చేస్తున్నందున కౌలు గుర్తింపులో సమస్య ఉందని తెలిపారు. సత్యవరంలో ఇప్పటి వరకు 60 శాతం తమలపాకు తోటలను గుర్తించామన్నారు. ఆమె వెంట వీఆర్వో రామకృష్ణ, రైతులు కీర్తి సీతారాం, మొగసాల రాజు తదితరులున్నారు.



తిమ్మరాజుపేటలో పశువైద్య శిబిరం



అచ్యుతాపురం రూరల్ : మండలంలోని తిమ్మరాజుపేటలో శనివారం పశు వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఎం. జగన్నాథపురం పశువైద్యాధికారి సౌజన్య పశువులకు సాధారణంగా వచ్చే భావ్యపరాన్న జీవుల నిర్మూలనా చికిత్స చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరాన్న జీవులు ఆవులకు, గేదెలకు రాకుండా ఉండేందుకు మందును శరీరంపై పిచికారీ చేయించాలన్నారు. దీని వల్ల జోరీగలు, పేలు, మిన్నల్లులు, గోమార్లను నిర్మూలించవచ్చునని తెలిపారు. శిబిరంలో 95 పశువులకు చికిత్స చేసి, అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఓ శ్రీనివాసరావు, గోపాల మిత్ర సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం రూరల్ : కొండకర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎం. జగన్నాథపురం ఫీడర్ పరిధిలో ఐదు గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ డీఈ మహేంద్రనాథ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొండకర్ల సబ్ స్టేషన్ పరిధిలోని ఎం. జగన్నాథపురం ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు వల్ల యర్రవరం, ఉప్పవరం, మల్లవరం, నరేంద్రపురం, ఎం.జె.పురం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.







ఊరిలో వణుకు

- అనకాపల్లిలో గుబులు పుట్టిస్తున్న పందుల గుంపు
- నివాస ప్రాంతాల్లో నిత్యం సంచారం
- చెత్తకుప్పలు, మురుగు కాలువల్లో దొర్లుతూ వాతావరణం కలుషితం
- నెల్లూరు జిల్లా కావలి సంఘటనతో మరింత కలవరం

పెంపుడు జంతువులు ప్రతాపాన్ని చూపుతున్నాయి. కనిపించే వారిపై కలబడుతున్నాయి. ఎదురు తిరిగే వారి తాట తీయాలన్నట్టు తిరగబడుతున్నాయి. ఇందుకు మొన్నటి వరకు శునకాలు.. మర్కటాల చేష్టలు మాత్రమే విన్నాం, చూశాం. నేడు ఈ జాబితాలోకి తాజాగా వరాహాలు కూడా వచ్చి చేరాయి. ఫలితంగా జాతి ఏదైనా తమ పట్ల జాగరూకతతో ఉండాలన్న సంకేతాలిచ్చాయి. ఇందుకు శుక్రవారం నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో జరిగిన ఘటనే ఉదాహరణ. అటుగా వెళ్తున్న ఓ వృద్ధురాలిపై పందులు పగబట్టినట్టు దాడిచేసిన ఘటన అందరిలో కలవరం పుట్టించింది. ఇటువంటి వాటిని జనావాసాలకు దూరంగా ఉంచాలన్న నిబంధనలు ఉన్నా సదరు పెంపకందారులు పట్టించుకోవడం లేదు. వీటిని నియంత్రించాల్సిన అధికారణం చేతులు ముడుచుకుని కూర్చుంటోంది. దీంతో చెత్త కుప్పల్లో.. మురుగు కాలువల్లో దొర్లుతూ ఆయా ప్రాంతాలను మరింత దుర్గంధభరితంగా మార్చుతున్నాయి.


పట్టణంలోని సులభ్ కాంప్లెక్స్ సమీపంలో పందుల సంచారం


గవరపాలెం శ్మశానం సమీపంలో..


గవరపాలెం రజక కాలనీలో..


బాలాజీరావుపేటలో..

అనకాపల్లి టౌన్ : అనకాపల్లి పట్టణంలో పందుల సంచారం అధికంగా ఉంది. దీంతో జనం హడలిపోతున్నారు. ప్రధానంగా విజయరామరాజుపేట, బాలాజీరావుపేట, గాంధీమార్కెట్, డీసీఎంఎస్ స్థలం ఆవరణ, ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట, సంతబయలు, రజక కాలనీ తదితర ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. అంతేకాక అటుగా వెళ్లే వారిలో కాస్త హడావుడి కూడా సృష్టిస్తున్నారు. అసలే ఇక్కడ విద్యాలయాలు ఎక్కువ. వీటిలో విద్యనభ్యసించేందుకు వెళ్లే పిల్లలు వీటిని చూసి భయపడుతున్నారు. అందునా నిన్నటి సంఘటనతో మరింత ఆందోళన చెందుతున్నారు. తక్షణమే జీవీఎంసీ విభాగం స్పందించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో జరగరానిది జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని కొందరు తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు.


తుమ్మపాలలో..

పెంపకందారులకు హెచ్చరించాం



పందుల పెంపకందారులు పట్టణంలో పది మంది ఉన్నారు. వీరికి గత నెల మొదటి వారంలో సమావేశం ఏర్పాటు చేసి పందులను పట్టణానికి దూరంగా పెంచుకోవాలని సూచించాం. జనావాసాలకు దూరంగా ఉంచాలని, రోడ్లపైకి వదలరాదని స్పష్టం చేశాం. పందుల పెంపకాన్ని వీడి ఏదైనా వృత్తి చేసుకోవడానికి వీలుగా బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

- షేక్ సుభానీ,
జీవీఎంసీ జోనల్ కమిషనర్, అనకాపల్లి జోన్

పంది కరిస్తే వెంటనే వైద్యం పొందాలి

- డాక్టర్ బగాది రాము, పశువైద్యాధికారి



పందుల వలన ప్రజలకు ప్రాణాంతకమైన వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయి. ముఖ్యంగా స్వైన్‌ఫ్లూ, రేబిస్, జపనీస్ బి, హెపటైటిస్ ఈ, బ్రూసిల్లోసెస్, సిఫాలైసస్, సాల్మోనెల్లోసెస్ వంటి వ్యాధులతో పాటు చర్మవ్యాధులు కూడా సోకే ప్రమాదం ఉంది. కావున పంది కరిస్తే వెంటనే వైద్యం పొందాలి.

ప్రీ ఆర్‌డీసీ శిక్షణకు ఏఎంఏఎల్ విద్యార్థుల ఎంపిక

కొత్తూరు : ప్రీ ఆర్‌డీసీ శిక్షణకు ఏఎంఏఎల్ కళాశాల నుంచి ఇద్దరు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. జనవరి 26న ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనే విద్యార్థులకు హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తారు. ఈ ప్రీ ఆర్‌డీసీ క్యాంప్‌నకు ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంపికైన విద్యార్థుల్లో తమ కళాశాల నుంచి ఇద్దరు ఉన్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు తెలిపారు. బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎ.రామ్ కుమార్, బీకాం ద్వితీయ సంవత్సరం విద్యార్థి పి.వెంకటేష్‌లు ఇందులో ఉన్నట్టు చెప్పారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు శరగడం నాగేశ్వరరావు, పూసర్ల సునీల్, ఎన్ఎస్ఎస్ యూనిట్-2,3 పీవోలు కేవీ నాగేశ్వరరావు, బీఎంవీపీ నాయుడు, అధ్యాపకులు అభినందించారు.

రహదారుల నిర్మాణాన్ని పర్యవేక్షించాలి

అనకాపల్లి టౌన్ : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పర్యవేక్షణ జరిపించాలని లోక్‌సత్తా నాయకులు శనివారం జోనల్ కమిషనర్ సుభానీని కోరారు. పట్టణంలో, విలీన గ్రామాలైన కొప్పాక, రాజుపాలెం గ్రామాల్లో రహదారుల నిర్మాణాల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాల పాటించడం లేదని లోక్‌సత్తా నియోజకవర్గ కార్యదర్శి ఎం.భాస్కరరావు, కోరిబిల్లి సంతోష్, ఎం.విజయ్‌లు ఆరోపించారు. అంతేకాకుండా ఈ నిర్మాణాల్లో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడానికి స్థలం కూడా ఉంచడం లేదన్నారు. దాసరిగెడ్డరోడ్డు, పరమేశ్వరిపార్కుల చుట్టూ రోడ్లు అభివృద్ధి పరచాలని కోరారు.

సమస్యలపై చర్చకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని అపరిష్కృత సమస్యలపై చర్చించేందుకు ప్రత్యేకాధికారితో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని రాజకీయ, ప్రజా సంఘాల ప్రతినిధులు శనివారం జీవీఎంసీ జోనల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంద ని, ప్రజలకు సరిపడా తాగునీరు అందడం లేదని, ట్రాఫిక్ సమస్య అధికమైందని, రోడ్ల విస్తరణ జరగక వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అనకాపల్లి మున్సిపాలిటీగా ఉన్నప్పటికీ, జీవీఎంసీలో విలీనమైనప్పటికీ ప్రజలకు పెద్దగా ప్రయోజనాలు కనపడలేదన్నారు. ఈ కార్యక్రమంలో కనిశెట్టి సురేష్ బాబు, ఎ.బాలకృష్ణ, కోరిబిల్లి శంకరరావు, బొట్టా చిన్నియాదవ్, భాస్కరరావు, బుగిడి నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.


జెడ్సీకి వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు



పంటల నమోదు తప్పనిసరి : వ్యవసాయాధికారి శ్రీదేవి

కొత్తూరు : పొలాల్లో వేసే పంటలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఎంపీఈవోలకు అనకాపల్లి సహాయ వ్యవసాయ సంచాలకురాలు శ్రీదేవి సూచించారు. పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో అనకాపల్లి డివిజన్ ఎంపీఈవోలకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చంద్రన్న రైతు క్షేత్రాల్లో అన్ని ప్రభుత్వ పథకాల గురించి రైతులకు వివరించాలన్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్.మహేశ్వరరావు మాట్లాడుతూ సూక్ష్మ పోషకాల ఆవశ్యకత వివరించారు. మునగపాక, కశింకోట మండలాల వ్యవసాయాధికారులు చిరంజీవి, టి.హరికృష్ణ, ఆత్మ ఏటీఎం మణికంఠేశ్వరి, అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు, డివిజన్‌లోని ఎంపీఈవోలు పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో ఆధార్ అప్‌డేషన్

రేపు కేంద్రం ప్రారంభం

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో ఈ నెల 21న ఆధార్ అప్‌డేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ కె.ఎల్.నాయుడు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ కేంద్రంలో ఆధార్ కార్డులలో సవరణ (చేర్పులు, మార్పులు) చేసుకోవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.